www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

యాదగిరి ప్రదక్షిణ

గుట్టపై నమో నారసింహా!

రెండున్నర కి.మీ. మేర 45 నిమిషాలు..

జయజయ ధ్వానాలతో భక్తుల గిరి ప్రదక్షిణ

తొలిరోజు 8 వేల మంది పైగా హాజరు

లక్ష్మీనృసింహుడికి ప్రత్యేక పూజలు

వేద పాఠశాలలో వనమహోత్సవం

3



మంగళవారం | 16-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 108 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాడమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 8.34 తదుపరి ఏకాదశి; నక్షత్రం: విశాఖ రా. 2.14 తదుపరి అనూరాధ వర్జ్యం: ఉ. 6.30-8.13; దుర్ముహూర్తం: ఉ. 8.28-9.20, రా. 10.26-11.08; అమృతఘడియలు: సా. 4.47-6.30; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 5.53; సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మాఫీకి మార్గమిదీ!

అసలు, వడ్డీ కలిపి రైతు కుటుంబానికి 2 లక్షల రుణమాఫీ



వ్యవధి 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9

లబ్ధిదారుల రుణ ఖాతాలకు నగదు బదిలీ పద్ధతిలో జమ

2 లక్షలకు మించి ఉంటే.. పైమొత్తాన్ని రైతులే చెల్లించాలి

ఆ తర్వాత రుణ ఖాతాలకు రూ.2 లక్షల మాఫీ నగదు బదిలీ

యజమాని, భార్య/భర్త, పిల్లలు కలిపి కుటుంబంగా పరిగణన

కుటుంబ సభ్యుల నిర్ధారణకు ఆహార భద్రత కార్డు ప్రామాణికం

రుణ మొత్తం ఆధారంగా తక్కువ నుంచి ఎక్కువ మొత్తం మాఫీ

రుణమాఫీ పథకం మార్గదర్శకాలను విడుదల చేసిన ప్రభుత్వం

'పీఎం-కిసాన్' మినహాయింపులు అవసరం మేరకు పరిగణన

తేట తెలుగులో మొదటి జీవో

పడికట్టు, సంక్లిష్ట పదాలు లేకుండా ఉత్తర్వు

రుణమాఫీపై వెలువరించిన వ్యవసాయ శాఖ

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రుణమాఫీ పథకానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదల య్యాయి. గతంలో చెప్పినట్లుగానే నిర్ణీత వ్యవధిలో తీసుకున్న అప్పు, వడ్డీ మొత్తం కలిపి కుటుంబానికి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రుణమాఫీ మొత్తాన్ని లబ్ధిదారుల రుణ ఖాతాలకు నగదు బదిలీ పద్ధతిలో జమ చేస్తామని పేర్కొంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)లో అప్పు తీసుకున్న రైతుల రుణమాఫీ మొత్తాన్ని డీసీసీబీ (జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) ఖాతాల్లో జమ చేస్తామని తెలిపింది. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 నాటికి రైతుల పేరిట ఉన్న బకాయిలను మాఫీ చేస్తామని ప్రకటించింది. కుటుంబ సభ్యుల నిర్ధారణకు ఆహార భద్రత (పీడీఎస్) కార్డును పరిగణనలోకి తీసుకోనున్నట్లు పేర్కొంది. రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, వాటి శాఖల్లో తీసుకున్న

మిగతా 13వ పేజీలో...

13

ప్రభుత్వోద్యోగులకు నో

రాజకీయ నాయకులకు కూడా

ట్యాక్స్ కడుతున్నవారికీ లేనట్లే!

రిటర్న్స్ దాఖలు చేస్తే ఓకే

పీఎం కిసాన్ బాటలో మాఫీ

రేషన్‌కార్డు లేకున్నా మాఫీ

కుటుంబ నిర్ధారణ కోసమే..

ఆంధ్రజ్యోతితో మంత్రి తుమ్మల

స్థానిక సంస్థల ఎన్నికలు

ఎప్పట్లోగా పెట్టగలం?

బీసీ కుల గణనకు ఎంత సమయం పడుతుంది?

కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయండి

కేంద్రం నిధులు ఆగకుండా త్వరగా ఎన్నికలు

పంచాయతీరాజ్ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

జానారెడ్డి సలహాలు తీసుకోవాలని సూచన

56 అంశాలతో చేపడితే ఐదున్నర నెలలు

కులగణనపై సీఎంకు అధికారుల వివరణ

నేడు కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం సమావేశం

ఎజెండాలో ధరణి సహా 9 అంశాలు

వ్యవసాయం, వాతావరణంపైనా చర్చ

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఎట్టి పరిస్థితుల్లో ఆగే పరిస్థితి తలెత్తకూడదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ముందుగా నిర్దేశించుకున్న ప్రకారం రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టేందుకు ఎంత సమయం పడుతుందో చెప్పాలని అడిగారు. కులగణన పూర్తయ్యాక బీసీ రిజర్వేషన్ల పెంపుతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించగలుగుతామో ఒక అంచనాకు రావాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి తక్షణమే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సోమవారం ఆయన పంచాయతీ

మిగతా 14వ పేజీలో...



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో జగ్గారెడ్డి, దామోదర

14

కాంగ్రెస్ గూటికి మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు ఎమ్మెల్యేను పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి

10కి పెరిగిన కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ శాసనసభ్యుల సంఖ్య

2/3 వంతు చేరితే బీఆర్ఎస్ఎల్పీ విలీనమే

గతంలో ఆ పార్టీ వాళ్లు ఇలాగే చేశారు కదా.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కూల్చుతామంటే.. ఊరుకోవాలా?.. ప్రజా తీర్పును కాపాడుకుంటాం: పొన్నం

చేరుతున్న వారికి ఎలాంటి హామీలు, పదవులు ఇవ్వట్లేదు: మధుయాష్కీగౌడ్

13



డ్రగ్స్ వినియోగదారుల్లో..

రకుల్ తమ్ముడు

కొకైన్ తీసుకున్న అమన్ ప్రీత్‌సింగ్

డ్రగ్స్ కింగ్‌పిన్ నైజీరియా మహిళ

14

రైళ్లు, విమానాల్లో హైదరాబాద్‌కు కొకైన్

రాజేంద్రనగర్‌లో ఆట కట్టించిన టీజీన్యాబ్

రూ. 35లక్షల విలువైన కొకైన్ స్వాధీనం

ఇద్దరు నైజీరియన్లు సహా ఐదుగురి అరెస్టు

అదుపులో 13 మంది వినియోగదారులు

పరీక్షల్లో 10 మందికి పాజిటివ్

గతంలో డ్రగ్స్ కేసులో రకుల్ ప్రీత్ పేరు

సినీ పరిశ్రమలో మళ్లీ చర్చనీయాంశం



రక్తనాళాలను చూపే త్రీడీ వెయిన్ ఫ్యూయర్

ఇంటి దగ్గరే క్యాన్సర్ పరీక్ష

త్రీడీ టెక్నాలజీతో రక్తనాళాల గుర్తింపు

పొలంలో టొమాటోలు కోసే రోబో

సైనికుల రక్షణ కోసం ఫైర్ సేఫ్టీ సూట్

ఐఐటీహెచ్‌లో అద్భుత ఆవిష్కరణలు

కంది, జూలై 15: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్ష ఇంటివద్దే చేసుకునే వీలు కల్పించే పరికరం ఉంటే? రక్త నమూనా తీసుకునేటప్పుడు కొంతమందికి రక్తనాళం దొరక్క చాలా ఇబ్బంది అవుతుంది. అలాంటి సందర్భాల్లో రక్తనాళం ఎక్కడుందో చూపించే పరికరం అందుబాటులో ఉంటే? అద్భుతమైన ఆ పరికరాలు ఎక్కడో ఊహల్లో

మిగతా 2వ పేజీలో...

'కాళేశ్వరం'లో
మా పాత్రేం లేదు!



సీఎం ఘోష్ విచారణకు హాజరైన స్మితా సబర్వాల్

ఉన్నతస్థాయి నిర్ణయాలనే అమలు చేశాం

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారుల వివరణ

మీరు చెప్పినదంతా.. అఫిడవిట్ల రూపంలో సమర్పించండి

అధికారులకు సూచించిన కమిషన్

ఎస్‌కే జోషి, సోమేశ్, రామకృష్ణారావు, రజత్‌కుమార్, స్మితాసబర్వాల్ హాజరు

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, అంచనాల సవరణ, టెండర్ల ప్రక్రియలో తమ పాత్రేమీ లేదని ఐఏఎస్, విశ్రాంత ఐఏఎస్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఉన్నత స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను మాత్రమే అమలు చేశామని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల్లో లోపాలు, అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఎదుట సోమవారం పలువురు సీనియర్ ఐఏఎస్‌లు, విశ్రాంత ఐఏఎస్‌లు హాజరయ్యారు. మాజీ సీఎస్ శైలేంద్రకుమార్ జోషి (ఆన్‌లైన్‌లో), మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్, నీటిపారుదల శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, నీటిపారుదల శాఖ ప్రస్తుత కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, మాజీ సీఎం కేసీఆర్‌కు పదేళ్లు కార్యదర్శిగా పనిచేసిన స్మితా సబర్వాల్ విచారణకు హాజరై, వాదనలు వినిపించారు. బ్యారేజీల నిర్మాణ ప్రాంతాల ఎంపిక, నిర్మాణంలో మీ పాత్ర ఏంటి? అని కమిషన్ ఆరా తీసింది. బ్యారేజీల నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులు, కాంట్రాక్టర్లకు పనులు అప్పగించిన తీరు, వారితో చేసుకున్న ఒప్పందాలు, వాటి అమలు,

మిగతా 12వ పేజీలో...



ఖమ్మం-కోదాడ మధ్య నిర్మాణంలో ఉన్న ఎక్స్‌ప్రెస్ హైవే

భూములు ఇచ్చేదేలే!

జాతీయ రహదారులకు భూమి సమస్య

1,442 కి.మీ. రహదారుల నిర్మాణానికి..

8,199 హెక్టార్ల భూమి అవసరం

ఎన్‌హెచ్ఏఐకి అందింది 3859 హెక్టార్లే

4,340 హెక్టార్ల సేకరణ పెండింగ్

7 జిల్లాల్లోని రహదారుల పనుల్లో జాప్యం

వేగిరానికి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు జాతీయ రహదారులకు భూసేకరణ సమస్యగా మారింది. రోడ్ల నిర్మాణమయ్యే పలు ప్రాంతాల్లోని రైతులు భూములను ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. కొన్ని చోట్ల అలైన్‌మెంట్ మార్చాలంటూ పనులను అడ్డుకుంటున్నారు. దీంతో రహదారి నిర్మాణానికి లక్ష్యంగా పెట్టుకున్న భూ సేకరణ జరగడం లేదు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు సమయానికి భూమి అందడంలేదు. దీంతో రహదారుల నిర్మాణ పనులు అపరిష్కృతంగా ఉండిపోతున్నాయి. రాష్ట్రంలో

మిగతా 14వ పేజీలో...

అన్నదాతల్లో వర్షాతిరేకం!

రెండో రోజూ విస్తారంగా వానలు

వికారాబాద్ జిల్లా నవాబ్‌పేటలో అత్యధికంగా 9.1 సెం.మీ.

రాష్ట్రంలో పొంగుతున్న వాగులు, చెరువులకు జలకళ

రైతులకు ఊరట.. జోరుగా వరినాట్లు.. ప్రాజెక్టులకు వరద

బంగాళాఖాతంలో అల్పపీడనం.. మరో 5 రోజులూ వర్షాలే

రేపు, ఎల్లుండి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం



యాదాద్రి జిల్లా ధర్మారంలో బండిపై వరినారు పంచుతున్న ఎమ్మెల్యే సామేలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రైతుల్లో ఊరట. వరుణుడు కరుణిస్తుండటంతో ఆనందంతో తడిసిముద్దవుతున్నారు. చేలల్లో మొలకలు వాడిపోతున్న దశలో జీవధారగా చినుకులు పడుతున్నాయి. ఫలితంగా వర్షాధార పంటలైన పత్తి, పెసర, కంది, మినుము, మొక్కజొన్న తదితర పంటలకు జీవం వచ్చినట్లయింది. వరినాట్లూ ఊపందుకుంటున్నాయి. బోసిపోయిన చెరువులు, వాగులకు నెమ్మదిగా జలకళ వస్తోంది. కొన్నిచోట్ల చెరువులు అలుగు పోస్తున్నాయి. అన్నదాతలు మళ్లీ శివార్లవైపు కదిలి సాగు పనుల్లో బిజీ అవుతున్నారు. రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల సోమవారం విస్తారంగా వర్షాలు పడ్డాయి. పట్టణ ప్రాంతాల్లో వరుణుడి ఉధృతికి రోడ్లు, కాలనీలు.. ప్రత్యేకించి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వికారాబాద్ జిల్లాలో వాన దంచికొట్టింది. అత్యధికంగా నవాబ్‌పేట మండలంలో 9.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలోని కోట్‌పల్లి, బంట్వారం మండలాల్లో 6 సెం.మీకు మించి.. ధారూరు, వికారాబాద్ మండలాల్లో 5సెం.మీకు మించి.. బషీరాబాద్, మోమిన్‌పేట్‌లో 4సెం.మీకు మించి వర్షపాతం నమోదవ్వడం గమనార్హం. వనపర్తి జిల్లా అమరచింతలో 5.8 సెం.మీ, నారాయణపేట జిల్లా నర్వలో 5.3 సెం.మీ, నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో 4.2 సెం.మీ, యాదాద్రి జిల్లా రామన్నపేటలో 4 సెం.మీ, నల్లగొండ చందంపేటలో 3.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లా నడికుడి మండలం కంఠాత్మకూరు దగ్గర తాత్కాలిక రోడ్డు వరద ఉధృతికి తెగిపోయింది. భూపాలపల్లి జిల్లాలోని కాటారంలో ఓ ఇంటి ప్రహరీ కూలిపోయింది. దామెరకుంట, మల్లారం, గంగపురి, గుండ్రాత్‌పల్లి పరిధిలోని పెద్ద వాగు ఉప్పొంగడంతో వందల ఎకరాల్లోని పత్తి చేలల్లో వరద నిలిచింది. మహబూబాబాద్ జిల్లాలో కాకతీయుల నాటి బయ్యారం పెద్ద చెరువు సోమవారం అలుగు పోసింది. హైదరాబాద్ నగరమ్మీద మబ్బుల దుప్పటి కమ్ముకుంది. నగరంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం దాకా పలుచోట్ల

మిగతా 12వ పేజీలో...



14

ఇంజనీరింగ్ కాలేజీల్లో 10 వేల సీట్ల పెంపు?

సర్కారు అనుమతించినట్టు సమాచారం

ఉత్తర్వులు వెలువడితే సీట్ల పెంపుపై రానున్న స్పష్టత

మరో 7వేల సీట్ల వరకు కోర్సుల కన్వర్షన్

వెబ్ ఆప్షన్ల నమోదు గడువు రేపటి వరకు పొడిగింపు

13

బేగంపేట రైల్వేస్టేషన్‌కు రూ. 22.57 కోట్లు

కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

ఇమ్రాన్‌ఖాన్ అరెస్టు.. పార్టీపై నిషేధం!



దేశద్రోహం కేసూ నమోదు చేయనున్న పాక్ సర్కారు

ఇస్లామాబాద్, జూలై 15: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు కోర్టుల్లో ఉపశమనం లభిస్తున్నప్పటికీ, ఆయనకు జైలు కష్టాలు తొలగడం లేదు. కార్ప్స్ కమాండర్ హౌస్‌పై దాడి, మే 9 అల్లర్లు సహా మొత్తం 12 కేసుల్లో తాజాగా ఆయనను లాహోర్ పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఇమ్రాన్ నేతృత్వంలోని పీటీఐ(పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్) పార్టీని నిషేధించనున్నట్టు పాక్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. అలాగే, దేశద్రోహానికి పాల్పడినందుకు ఇమ్రాన్‌తోపాటు, ఇద్దరు పీటీఐ సీనియర్ నేతలపై కేసులు నమోదు చేయనున్నట్టు వివరించింది. పాక్ సమాచారశాఖ మంత్రి అతావుల్లా తరర్ సోమవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. పీటీఐని నిషేధించేందుకు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్నట్టు చెప్పారు. అక్రమ పెళ్లి కేసులో ఇమ్రాన్‌ను నిర్దోషిగా జిల్లా కోర్టు ప్రకటించడం, జాతీయ అసెంబ్లీలో రిజర్వు సీట్లు పొందడానికి పీటీఐకి అర్హత ఉందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకోవడం గమనార్హం. పీటీఐకి రిజర్వు సీట్లు కేటాయిస్తే ఆ పార్టీ బలం 109కి చేరి, జాతీయ అసెంబ్లీలో అతిపెద్ద పార్టీగా మారే అవకాశం ఉంది. 71 సంవత్సరాల వయసున్న ఇమ్రాన్‌ఖాన్ ప్రస్తుతం రావల్పిండిలోని అదియాలా జైల్లో ఉన్నారు. 2022 ఏప్రిల్‌లో ప్రధాని పదవి కోల్పోయినప్పటి నుంచి ఆయనపై అనేక కేసులు నమోదవుతూనే ఉన్నాయి.

సరైన సమయంలో తల తిప్పకపోతే చనిపోయి ఉండేవాడిని



వాషింగ్టన్, జూలై 15: "సరైన సమయంలో, కాకతాళీయంగా తల తిప్పాను. లేకపోతే చనిపోయి ఉండేవాడిని. దేవుడి దయ, అదృష్టం వల్ల బతికి ఉన్నాను" అని అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. తనపై హత్యాయత్నం తర్వాత తొలిసారి ఆయన న్యూయార్క్ పోస్టుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన భావోద్వేగాన్ని పంచుకొన్నారు. నవంబరు 5న జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తమ అభ్యర్థిని సోమవారం ప్రకటించనుండడంతో.. ఆదివారం మిల్వాకీ బయలుదేరిన ఆయన విమానంలో ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ సమయంలో ఆయన కుడి చెవికి బ్యాండేజీ కట్టు ఉన్నట్లు న్యూయార్క్ పోస్ట్ వెల్లడించింది. కాగా.. ట్రంప్ ఈ ఘటన నుంచి క్షేమంగా బయటపడడం పూరి జగన్నాథుడి కృపేనని ఇస్కాన్ సంస్థ ప్రతినిధి రాధారమణ్‌దాస్ అభిప్రాయపడ్డారు. మరోవైపు.. ట్రంప్‌పై హత్యాయత్నం చేసిన దుండగుడు థామస్ మాథ్యూ క్రూక్స్(20) ఫొటోలను ఎఫ్‌బీఐ విడుదల చేసింది.

నవోదయ విద్యాలయాల్లో టాటామోటార్స్ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు

ముంబై, జూలై 15: జవహర్ నవోదయ విద్యాలయాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సోమవారం టాటా మోటార్స్ సంస్థ ప్రకటించింది. నైపుణ్యాభివృద్ధికి అవసరమైన వొకేషనల్ కోర్సులను ఏర్పాటు చేయాలనే జాతీయ విద్యావిధానం-2020 లక్ష్యానికి అనుగుణంగా నవోదయ విద్యాలయ సమితి భాగస్వామ్యంతో వీటిని స్థాపించినట్లు పేర్కొంది. వీటి ద్వారా ప్రతి ఏడాది 4 వేల మంది విద్యార్థులకు ఆటోమోటివ్ రంగంలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. దీనిలో 30% మంది ఆడపిల్లలు ఉండేటట్లు చూసుకుంటామని తెలిపింది. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు తమ కంపెనీలో మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ డిప్లొమా కోర్సును ఎంచుకోవచ్చని టాటా మోటార్స్ సీఎస్ఆర్ అధినేత వినోద్ కులకర్ణి తెలిపారు. ఆ సమయంలో వారికి పూర్తి స్టైపెండ్‌తో పాటు జాబ్ ట్రైనింగ్ ఇస్తామని చెప్పారు.

ప్రధాని మోదీని కలిసిన హేమంత్‌సోరెన్



న్యూఢిల్లీ, జూలై 15: ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ సోమవారం ప్రధాని నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. అందుకు సంబంధించిన ఫొటోలను హేమంత్ తన ఎక్స్(ట్విటర్) ఖాతాలో పోస్ట్ చేశారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఇటీవల బెయిల్‌పై విడుదల అయిన హేమంత్‌సోరెన్ మరోసారి రాష్ట్ర సీఎంగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే.

పరారీలో ట్రైనీ ఐఏఎస్ పూజా తల్లిదండ్రులు

పుణె, జూలై 15: వివాదస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ తల్లిదండ్రులు పరారీలో ఉన్నారు. భూ వివాదంలో కొందరిని ఆయుధాలతో బెదిరించిన కేసులో పూజా తల్లి మనోరమా ఖేద్కర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. బనెర్ రోడ్డులోని బంగ్లాలో మనోరమా ఉందని భావించిన పోలీసు బృందం అక్కడ వెళ్లినా ఆమెను కనుగొనలేకపోయింది. ఒక భూ వివాదంలో తుపాకీతో కొందరిని మనోరమ బెదిరిస్తున్న వీడియో ఒకటి వెలుగు చూసిన సంగతి తెలిసిందే. ఇక సివిల్ సర్వీసెస్‌లో అర్హత సాధించేందుకు పూజా ఖేద్కర్ అంగవైకల్యం లేకున్నా ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం పొందేందుకు ప్రయత్నించినట్లు వెలుగులోకి వచ్చింది. 2022, ఆగస్టులో ఆమె పుణెలోని అంధ్ ఆసుపత్రిని సంప్రదించి డిజెబిలిటీ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరగా వైద్యులు నిరాకరించారు.

మొక్కల ఆధారిత నూనెలతో గుండెకు మేలు!

న్యూఢిల్లీ, జూలై 15: ఆలివ్, వేరుశనగ వంటి మొక్కల ఆధారిత నూనెలతో గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుందని స్వీడన్‌లోని చాల్మర్స్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు తాజా అధ్యయనంలో గుర్తించారు. 113 మందిపై చేసిన ఈ అధ్యయన వివరాలను నేచుర్ మెడిసిన్ అనే జర్నల్‌లో ప్రచురించారు. అధ్యయనంలో భాగంగా 16 వారాలపాటు కొంతమందికి తృణధాన్యాలు, డ్రైఫ్రూట్స్, పండ్లు, కూరగాయలు అధికంగా ఉండే డైట్‌ను అందించారు. ఈ వంటకాలను ఎక్కువగా ఆలివ్ నూనెతో వండుతారు. మరికొంత మందికి వెన్న, చేపలు, మాంసం, పాలు, స్వీట్లు ఇలా.. అధిక జంతు కొవ్వులతో కూడిన ఆహారాన్ని అందించారు. ఆ తర్వాత వారి రక్తంలోని కొవ్వులను విశ్లేషించారు. జంతు కొవ్వులు తీసుకున్న వారితో పోలిస్తే మొక్కల ఆధారిత కొవ్వులు తీసుకున్న వారి రక్తంలో మల్టీ లిపిడ్ స్కోర్ (ఎంఎల్ఎస్) తక్కువగా ఉందని తెలిపారు.

గదిలో బంధించి కొడితే పిల్లి కూడా పులిలా తిరగబడుతుందని సామెత! అవసరం నూతన ఆవిష్కరణలకు మూలం.. అని మరో సామెత!! పిచుక మీద బ్రహ్మాస్త్రంలా తనపై దండయాత్రకు దిగిన రష్యాపై యుద్ధంలో.. ఉక్రెయిన్ ఈ రెండు సామెతలనూ నిజం చేస్తోంది! భారీ సాధన సంపత్తి ఉన్న అంత పెద్ద అగ్రరాజ్యాన్ని.. ఉక్రెయిన్ డ్రోన్, ఏఐ టెక్నాలజీల సాయంతో నిలువరించగలుగుతోంది. యుద్ధరంగంలో తన సైనికుల ప్రాణాలు పోకుండా కాపాడుకోవడానికి 'ఆటోమేటెడ్ ఆర్మీ'తో శాయశక్తులా పోరాడుతోంది. ఏ యుద్ధంలోనైనా త్రివిధ దళాలు ఉంటాయి. ల్యాండ్ డ్రోన్లు, ఉక్రెయిన్‌లో ఆ మూడు దళాలకూ దన్నుగా నిలుస్తున్న నాలుగో దళంలా మారిందీ ఆటోమేటెడ్ ఆర్మీ!!



మినీ యుద్ధట్యాంకు

కేబుల్ టైతో డ్రోన్‌కు బాంబును అమర్చుతున్న సైనికుడు

టెక్నాలజీతో కొడుతోంది!

'ఆటోమేటెడ్ ఆర్మీ'తో రష్యాను సమర్థంగా ఢీకొంటున్న ఉక్రెయిన్

- ఆ దేశంలో రెండేళ్లలో వెలసిన డిఫెన్స్ స్టార్టప్‌ల సంఖ్య 250కిపైనే!
- గ్రౌండ్ డ్రోన్లు, ఏఐతో పనిచేసే ఆయుధాల తయారీలో నిమగ్నం
- సామాన్యులూ డ్రోన్ల తయారీ నేర్చుకోవాలంటున్న ఆ దేశ ఉపప్రధాని

డ్రోన్లంటే.. మానవ రహిత విమానాలని మనకు తెలుసు! ఒక చిన్నపాటి యుద్ధట్యాంకును కూడా అలా డ్రోన్‌లాగానే శత్రువుల సమీపానికి తీసుకెళ్లి పేల్చేస్తే? దానికో ఆటోమేటెడ్ మెషీన్‌గన్‌ను అమర్చి అల్లంత దూరం నుంచే రిమోట్‌తో కాల్పులు జరపగలిగితే? సూపర్ ఐడియా కదూ! అత్యంత విలువైన తన సైనికుల ప్రాణాలు పోకుండా రష్యాపై యుద్ధాన్ని కొనసాగించడానికి ఉక్రెయిన్ ఇప్పుడు ఇలాంటి కొత్త కొత్త టెక్నాలజీలనే ఆశ్రయిస్తోంది. ఉదాహరణకు.. ఆ దేశానికి చెందిన వీరియ్ అనే డ్రోన్ కంపెనీ 'ఒడిస్సే' పేరుతో.. కారు పరిమాణంలో ఉండే ప్రోటోటైప్ 'అన్‌మ్యాన్డ్ గ్రౌండ్ వెహికల్‌'ను తయారు చేసింది. మినీ యుద్ధట్యాంకు తరహాలో ఉండే ఆ వెహికల్ బరువు 800 కిలోలు. దాని బ్యాటరీని ఒక్కసారి చార్జ్ చేస్తే 30 కిలోమీటర్ల దూరం వెళ్తుంది. కీవ్ శివార్లలోని వ్యవసాయక్షేత్రాల్లో.. వీరియ్ కంపెనీ సీఈవోనే దాన్ని స్వయంగా పరీక్షించారు. ఒడిస్సేపై మెషీన్‌గన్‌ను అమర్చి ఆటోమేటెడ్ దాడులకే కాక.. రిమోట్‌కంట్రోల్‌తో ఆపరేట్ చేస్తూ యుద్ధరంగంలోని సిబ్బందిని కాపాడే రెస్క్యూ అండ్ సప్లై ప్లాట్‌ఫామ్‌గా కూడా వాడుకోవచ్చని వీరియ్ సిబ్బంది తెలిపారు. ఇంతా చేస్తే.. దాని నిర్మాణానికి అయిన ఖర్చు 35 వేల డాలర్లు. అంటే మన కరెన్సీలో దాదాపుగా రూ.30 లక్షలు. వీరియ్ కంపెనీ తరహాలో ఆ



ఏఐ ఆటోమేటెడ్ గన్



దేశంలో ఆటోమేటెడ్ ఆయుధాలను తయారు చేసే స్టార్టప్‌లు 250కి పైగా ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఉక్రెయిన్‌వ్యాప్తంగా అవి రహస్యంగా ఆటోమేటెడ్ ఆయుధాలను, రష్యన్లపై పోరాడే రోబో ఆర్మీని తయారుచేస్తున్నాయి.

ఆన్‌లైన్ వీడియోలు చూసి..

ఇంతకీ ఉక్రెయిన్ స్టార్టప్ కంపెనీలు వీటిని ఎలా తయారుచేయగలుగుతున్నాయి? అంటే.. డిఫెన్స్ మ్యాగజైన్లు, ఆన్‌లైన్ వీడియోలను చూసి వాటికి తమ ఊహలను జోడించి కొత్తకొత్త ఉత్పత్తులను డిజైన్ చేస్తున్నారు. అది కూడా అందుబాటులో ఉన్న వనరులతో అతి తక్కువ ధరలకే తయారుచేయగలుగుతున్నారు. ఉదాహరణకు.. డ్రోన్ల రెక్కల తయారీకి తేలికపాటి చెక్కను వినియోగించడం, సూపర్ మార్కెట్లలో వాడే 'కేబుల్ టై'లను ఉపయోగించి డ్రోన్లకు మందుగుండు సామగ్రిని కట్టి, సరిహద్దులకు పంపి పేల్చేయడం వంటి విధానాలను పాటిస్తున్నారు. ఇప్పటికే తయారుచేసిన ఆయుధాలను ఇంకా సమర్థంగా ఉపయోగించే విధానాలను అన్వేషిస్తున్నారు. టో ట్రక్కులు, ఫైన్‌లేయర్లు, డీమైనర్స్.. ఇలా రకరకాల రోబోలను తయారుచేస్తున్నారు. 'ఫస్ట్ పర్సన్ వ్యూ' డ్రోన్లను పెద్ద ఎత్తున తయారుచేస్తున్నారు. వర్చువల్ రియాలిటీ తరహా కళ్లజోళ్లకు అనుసంధానమై ఉండే డ్రోన్లు ఇవి. యుద్ధరంగంలోకి వెళ్లే డ్రోన్‌కు అమర్చిన కెమెరాల ద్వారా.. ఆ ప్రదేశం మొత్తాన్నీ గాగుల్‌ను ధరించిన ఆపరేటర్ చూడగలుగుతాడు. ఎక్కడ దాడి చేయాలో అతడే నిర్ణయించగలుగుతాడు. అలాగే, డేవ్‌డ్రాయిడ్ అనే మరో కంపెనీ.. కదిలే లక్ష్యాలను గుర్తించి, గురిపెట్టి కాల్పులు జరిపే ఏఐ ఆధారిత ఆటోమేటెడ్ గన్‌ను తయారుచేసింది. కానీ.. ప్రస్తుతానికి ఆ గన్‌పై నియంత్రణను సైనికులకే అప్పగించింది. అంటే ముందున్న లక్ష్యాలను ఆ గన్ గుర్తిస్తుంది. కానీ, కాల్చాలా వద్దా అనే నిర్ణయం మాత్రం వెనకాల ఎక్కడో ఉండే సైనికుడిదేనన్నమాట. కంపెనీలే కాక.. ఉక్రెయిన్‌లోని సాధారణ ప్రజలందరూ కూడా ఇలాంటి డ్రోన్ల, ఆయుధాల తయారీకి సంబంధించి ఆన్‌లైన్‌లో ఉచితంగా లభించే కోర్సులను నేర్చుకోవాలని ఉక్రెయిన్ ఉప ప్రధాని మిఖాయిలో ఫెడొరోవ్ ప్రోత్సహిస్తున్నారు. దేశ ప్రజలు ఏడాదికి పది లక్షల డ్రోన్లను తయారుచేయాలన్నది ఆయన నిర్దేశించిన లక్ష్యం. కృత్రిమ మేధను యుద్ధరంగంలో ఉపయోగించడం అంతమంచిది కాదని ఐక్యరాజ్యసమితి, మానవహక్కుల సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. కానీ ఉక్రెయిన్ డిప్యూటీ పీఎం చెబుతున్న మాట ఒక్కటే.. 'ముందు మేం గెలవాలి. అందుకు మేం చేయగలిగిందంతా చేస్తాం. మా సైనికుల ప్రాణాలు కాపాడుకోవడానికి ఆటోమేషన్‌ను వాడి తీరుతాం" అని!! టెక్నాలజీనే తమ విజయానికి మొదటి మెట్టు అన్నది ఆయన నినాదం.

- సెంట్రల్ డెస్క్

లోకం తీరు



రాజ్యసభలో ఎన్డీఏ బలం తగ్గింది

న్యూఢిల్లీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో నలుగురు నామినేటెడ్ సభ్యులు గత శనివారం పదవీ విరమణ చేయడంతో బీజేపీ బలం 86 సీట్లకు, ఎన్డీఏ బలం 101 సీట్లకు తగ్గిపోయింది. పదవీ విరమణ చేసిన నామినేటెడ్ సభ్యుల్లో సోనాల్ మాన్ సింగ్, సీనియర్ న్యాయవాది మహేశ్ జెఠ్మలానీ, ఆర్ఎస్ఎస్ సభ్యుడు రాకేశ్ సిన్హా, యూపీ బీజేపీ నేత రాంషకల్ ఉన్నారు. సాధ్యమైనంత త్వరగా వీరి స్థానంలో మరో నలుగురిని నామినేట్ చేసి రాజ్యసభలో మళ్లీ బలాన్ని పెంచుకోవాలని బీజేపీ యోచిస్తోంది. మరోవైపు.. ఏపీ, తెలంగాణలో రాజకీయంగా క్లిష్ట దశను ఎదుర్కొంటున్న వైసీపీ, బీఆర్ఎస్ బీజేపీకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధపడ్డట్లు తెలిసింది. తాము బేషరతుగా మద్దతిస్తామని జగన్ లేఖ రాయగా, బీజేపీకి అండగా ఉండాలని తమ నలుగురు ఎంపీలకు బీఆర్ఎస్ సూచించినట్లు తెలిసింది. అయితే, బీజేడీకి చెందిన 9 మంది, అన్నాడీఎంకేకు చెందిన నలుగురు సభ్యులు తటస్థంగా ఉండే అవకాశాలున్నాయి. రాజ్యసభలో ఇండియా కూటమికి 87మంది సభ్యులు ఉండగా, అందులో కాంగ్రెస్‌కు 26 మంది సభ్యులు ఉన్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కేశవరావు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో అభిషేక్ సింఘ్వీని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎంపిక చేసే అవకాశాలున్నాయి. మొత్తంగా తెలంగాణతోపాటు హరియాణా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, త్రిపురలో ఒక్కో ఖాళీ, మహారాష్ట్ర, అస్సాం, బీహార్‌లో రెండేసీ చొప్పున సీట్లు భర్తీ చేయాల్సి ఉంది. మొత్తం 11 సీట్లలో బీజేపీకి ఏడు సీట్లు దక్కే అవకాశాలు ఉన్నాయి. నామినేటెడ్ ఖాళీలను కూడా భర్తీ చేస్తే ఎన్డీఏ సంఖ్యాబలం 112 సీట్లకు పెరగనుంది. అయినప్పటికీ బిల్లుల ఆమోదానికి ఇతర పార్టీలపై ఆధారపడాల్సి ఉంటుంది.

భోజశాల కింద 94 విరిగిన విగ్రహాలు!

- హిందూ పిటిషనర్ల న్యాయవాది వెల్లడి
- మధ్యప్రదేశ్ హైకోర్టుకు శాస్త్రీయ సర్వే నివేదిక సమర్పించిన ఏఎస్ఐ

ఇండోర్, జూలై 15: మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజశాల-కమల్ మౌలా మసీదు సముదాయం కింద 94కిపైగా విరిగిన విగ్రహాలు దొరికినట్లు భారతీయ పురావస్తు విభాగం (ఏఎస్ఐ) తన శాస్త్రీయ సర్వేలో తేల్చిందని న్యాయవాది హరిశంకర్ జైన్ తెలిపారు. అక్కడ హిందూ ఆలయం ఉందనడానికి ఇదే నిదర్శనమని.. అక్కడ హిందూ పూజలు మాత్రమే నిర్వహించాలని సోమవారమిక్కడ తెలిపారు. వివాదాస్పద కట్టడంపై శాస్త్రీయ సర్వే నిర్వహించి తమకు నివేదిక సమర్పించాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఇండోర్ బెంచ్ ఈ నెల 4న ఇచ్చిన ఆదేశాల మేరకు ఏఎస్ఐ సర్వే పూర్తిచేసింది. దాని తరఫు న్యాయవాది హిమాంశు జోషీ సోమవారం 2,000 పేజీల తన రిపోర్టును కోర్టుకు అందజేశారు. 22న దీనిపై హైకోర్టులో విచారణ జరుగుతుందని తెలిపారు. ధార్ జిల్లాలో 11వ శతాబ్దికి చెందిన ఈ భోజశాలను వాగ్దేవి (సరస్వతీదేవి) ఆలయంగా హిందువులు విశ్వసిస్తారు. ఇది కమల్ మౌలా మసీదు అని ముస్లింలు వాదిస్తున్నారు. 2003 ఏప్రిల్ 7న ఏఎస్ ఐ.. భోజశాలలో ప్రతి మంగళవారం హిందువులు పూజ చేసుకోవడానికి, ప్రతి శుక్రవారం ముస్లింలు నమాజ్ చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. దీనిని వ్యతిరేకించిన 'హిందూ ఫ్రంట్ ఫర్ జస్టిస్' సంస్థ శాస్త్రీయ సర్వే నిర్వహించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించింది. కాగా, శాస్త్రీయ సర్వే జరపాలన్న హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా మౌలానా కమాలుద్దీన్ వెల్ఫేర్ సొసైటీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది.

డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురు

అక్రమ ఆస్తుల కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్.. దానికి అనుబంధంగా ఈడీ సమన్లు

- వీటిపై గతంలో కర్ణాటక హైకోర్టుకు డీకే
- సమన్ల రద్దుకు నిరాకరించిన ధర్మాసనం
- హైకోర్టు నిర్ణయంలో జోక్యానికి సుప్రీంకోర్టు నో.. పిటిషన్ కొట్టివేత



బెంగళూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అక్రమ ఆస్తుల వ్యవహారంలో సీబీఐ ఎఫ్ఐఆర్‌ను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. దీంతో డీకే శివకుమార్ కేసులను ఎదుర్కొనక తప్పని పరిస్థితి ఏర్పడింది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌కు అనుబంధంగా ఈడీ జారీ చేసిన సమన్లను ప్రశ్నిస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. కానీ ఆ సమన్లను రద్దు చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. దీంతో డీకే శివకుమార్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం.. ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు విషయంలో జోక్యం చేసుకోబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. డీకే శివకుమార్‌ను విచారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2019 సెప్టెంబరు 25న అనుమతులు ఇచ్చింది. అందుకు అనుగుణంగానే ఆయనపై 2020 అక్టోబరు 3న సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ కేసుపై ప్రభుత్వ అనుమతులను రద్దు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో సీబీఐ దర్యాప్తు నుంచి విముక్తి లభిస్తుందని భావించారు. కానీ అప్పటికే అక్రమ ఆస్తులను నిర్ధారించిన ఈడీ సమన్లు జారీ చేసింది. ఇదిలా ఉండగా, రాజ్యసభలో మెజారిటీ లేకపోయినప్పటికీ మోదీ సర్కారు ఆధార్ చట్టం వంటి కీలక బిల్లులను ద్రవ్య బిల్లుల ముసుగులో ఆమోదింపజేసుకోవడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లను విచారించేందుకు రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. ఈ అంశం ఇప్పటికే రాజ్యాంగ ధర్మాసనం విచారణ జాబితాలో ఉందని, దీన్ని ప్రాధాన్య అంశంగా గుర్తించి, రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని కపిల్ సిబల్ కోరారు. స్పందించిన సీజేఐ.. రాజ్యాంగ ధర్మాసనాలు ఏర్పాటు చేసిన వెంటనే తెలియజేస్తానని చెప్పారు.

కర్ణాటక అసెంబ్లీలో 'ఏఐ కెమెరా'

కర్ణాటక శాసనసభలో ఎమ్మెల్యేల హాజరు, రాకపోకలను రికార్డు చేసేందుకు కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కెమెరాలను అమర్చారు. శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యేలు ఏ సమయానికి సభలో ప్రవేశిస్తున్నారు, ఎంత సేపటికి బయటకు వెళ్తున్నారనే వివరాలను ఈ కెమెరాలు రికార్డు చేయనున్నాయి. ఎమ్మెల్యేలు ఎంతసమయం శాసనసభలో గడుపుతున్నారనేది వీటిలో రికార్డు కానుంది.

అదానీ గ్రూప్‌పై తీర్పును సమీక్షించం

- పిల్‌ను కొట్టివేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, జూలై 15: అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్‌లో అవకతవకలకు పాల్పడిందంటూ వచ్చిన ఆరోపణలపై సెబీ చేస్తున్న విచారణను ప్రత్యేక విచారణ బృందం (సిట్) లేదా సీబీఐకి అప్పగించాలంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ జనవరి 3న ఇచ్చిన తీర్పును సమీక్షించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అనామిక మిశ్రా తదితరులు దాఖలు చేసిన పిల్‌ను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. పిల్‌ను పరిశీలించిన తర్వాత ఎలాంటి సమీక్షకు అవకాశం లేదని స్పష్టం చేసింది. కాగా, జనవరి 3న ఇచ్చిన తీర్పులో.. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణల మీద సెబీ సమగ్ర విచారణ జరుపుతున్నదని, ఆ విచారణ నమ్మకం కలిగిస్తున్నదని సుప్రీం పేర్కొంది.

చందమామపై గుహ

కేప్‌కెనవరాల్, జూలై 15: విశాలమైన మైదానాలు.. పెద్ద పెద్ద లోయలు.. చందమామపై ఇవే ఉంటాయని ఇన్నాళ్లూ మనకు తెలుసు. కానీ.. అక్కడ ఒక కొండరాతిపై నుంచి కిందికి 100 మీటర్ల లోతుకు విస్తరించిన గోతిలాంటి గుహ కూడా ఉందనే విషయాన్ని ఇటాలియన్ శాస్త్రజ్ఞులు గుర్తించారు. 55 ఏళ్ల క్రితం నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ మొట్టమొదటిసారి చంద్రుడిపై కాలు మోపిన 'సీ ఆఫ్ ట్రాంక్విలిటీకి' 400 కిలోమీటర్ల దూరంలో ఆ గుహ ఉన్నట్టు వారు పేర్కొన్నారు. అలాంటి గుహలు ఇంకా బోలెడు ఉంటాయని.. భవిష్యత్తులో జాబిలిపైకి వెళ్లే వ్యోమగాములు బేస్ నిర్మించుకోవడానికి ఉపయోగపడతాయని వారు ఆశిస్తున్నారు. కొండ రాతిపై నుంచి లావా ప్రవహించడం వల్ల ఈ గుహ ఏర్పడి ఉంటుందని శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

జర్నలిస్టులపై సాయిరెడ్డి తిట్ల పురాణం

- వాడు, వీడు అంటూ అసభ్యకర భాష
- పెద్దల సభలో సభ్యుడిని అనేది కూడా మరిచిపోయి దిగజారుడు వ్యాఖ్యలు



విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి మరోసారి నోరు పారేసుకున్నారు. వాడు, వీడు అంటూ మీడియా సంస్థల ప్రతినిధులపై దిగజారుడు భాషను ఉపయోగించారు. సస్పెన్షన్‌లో ఉన్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతికి, ఆమె భర్తకు మధ్య కొంతకాలంగా వివాదం చెలరేగుతోంది. దీనిపై ఆమె భర్త అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై ఇటు చానళ్లలోనూ, అటు సోషల్ మీడియాలోనూ ఆ వివరాలతో వార్తలు వచ్చాయి. దానిపై శాంతి తన వాదనను ఇప్పటికే మీడియా ముందు ఉంచారు. అయితే, సాయిరెడ్డి దానికి భిన్నంగా మీడియాపై నోరు పారేసుకున్నారు. సోమవారం విశాఖలో పత్రికా సమావేశం పెట్టి, మీడియా సంస్థలను, చానళ్లను, జర్నలిస్టులను సాయిరెడ్డి ఆడిపోసుకున్నారు. వారిపై అభ్యంతరకర భాష వాడుతూ తిట్లు లంఘించుకున్నారు. తన వయస్సునూ, పెద్దల సభలో సభ్యుడిని అనేది కూడా మరిచిపోయి జర్నలిస్టులు, మీడియా సంస్థల యజమానులపై విరుచుకుపడ్డారు. పైగా, ఆ సంఘటనకు సంబంధించి మీడియా ప్రతినిధులు అడిగిన ఏ ప్రశ్నకూ ఆయన సరైన సమాధానం చెప్పలేదు. తన సత్తా ఏమిటో మీడియా సంస్థలకు, చానళ్లకు, జర్నలిస్టులకు చూపిస్తానంటూ చెలరేగిపోయారు. "తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి కొన్ని టీవీ చానళ్లు నా వ్యక్తిత్వాన్ని హననం చేశాయి. లేనిపోనివి ప్రసారం చేశాయి. సంబంధిత చానళ్ల యజమానులు, యాంకర్లపై పరువు నష్టం కేసులు వేసి, అంతుచూస్తాను" అని హెచ్చరించారు. పార్లమెంటులో ప్రివిలేజ్ మోషన్ పెడతానని, ప్రెస్ కౌన్సిల్‌కి, ఎడిటర్స్ గిల్డ్‌కి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. శాంతి ఆదిమజాతికి చెందిన మహిళ అని, ఆమెతో ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయిస్తానన్నారు. 'శాంతి భర్త మదన్‌మోహన్‌తో మీకు ఎలాంటి పరిచయం ఉంది' అని విలేకరులు ప్రశ్నించగా, ఆయన ఎవరో తనకు తెలియదన్నారు. ఆ తర్వాత ...ఏదో పని మీద ఒకటి, రెండుసార్లు తన వద్దకు వచ్చాడని చెప్పారు. గతంలో రామోజీరావుతో విభేదాలు వచ్చినప్పుడు పత్రిక, చానల్ పెట్టాలని అనుకున్నానని, పార్టీ అధ్యక్షుడు వద్దని వారించారని, కానీ ఇప్పుడు కచ్చితంగా చానల్ పెట్టి తీరుతానని పేర్కొన్నారు.


ఇంటి దగ్గరే క్యాన్సర్ పరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

కాదు.. సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో సోమవారం ఆవిష్కృతం అయ్యాయి. దేశంలోని విద్యాసంస్థలు, పరిశ్రమల అనుసంధానంతో ఐఐటీహెచ్‌లో జరిగిన 'ఇన్నోవేషన్ డే ఫెయిర్' ఈ సరికొత్త ఆవిష్కరణలకు వేదికగా నిలిచింది. ఈ ఉత్సవాన్ని ఐఐటీహెచ్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులోని బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధకులు.. 'సీ-కాలర్ డిటెక్షన్' పేరుతో సర్వీసెల్ఫ్ కిట్‌ను తయారుచేశారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షను మహిళలు ఈ కిట్ సాయంతో ఇంటివద్దే చేసుకోవచ్చు. అలాగే.. ఐఐటీహెచ్‌లోని భౌతికశాస్త్ర విభాగం పరిశోధకులు ఇన్‌ఫ్రారెడ్, ఏఐ టెక్నాలజీ ఉపయోగించి.. స్కానింగ్‌తో నరాలను కనిపెట్టే టెక్నాలజీ అభివృద్ధి చేశారు. 'త్రీడీ వెయిన్ వ్యూయర్'గా పిలిచే ఈ పరికరంతో ఒక్కసారి మన శరీరంపై స్కాన్ చేస్తే ఒంట్లోని రక్తనాళాలు స్పష్టంగా కనపడతాయి. ఇది డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీంతో ఎక్కువ మంది పేషెంట్లకు త్వరగా ఇంజెక్షన్లు చేయడానికి, రక్త పరీక్షలు తొందరగా నిర్వహించడానికి వీలుగా ఉంటుంది. భవిష్యత్తులో ఈ టెక్నాలజీ ఉపయోగించి రోబోలతో కూడా ఇంజెక్షన్‌లు, రక్త పరీక్షలు చేయించవచ్చు. ఇక.. ఐఐటీహెచ్ ఇంక్యుబేషన్ స్టార్టప్ పరిశోధకులు ఇండియన్ నేవీతో కలిసి ట్రాడీ గ్రేడ్ ఫైర్ రెసిస్టెంట్ సూట్‌ను తయారు చేశారు. 2.3 కేజీల బరువుగల ఈ సూట్ 1200 డిగ్రీల వరకూ వేడిని తట్టుకుంటుంది. ప్రమాదవశాత్తు మంటలలో చిక్కుకున్నా.. ఈ సూట్ వేసుకున్న వారి ప్రాణాలకు హాని జరగదు. అగ్ని ప్రమాదాలు జరిగి మంటల్లో చిక్కుకున్న బాధితులను బయటకు తీసుకురావడానికి.. అగ్నిమాపక దళాలకు ఈ సూట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాగే.. ఐఐటీహెచ్ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన పరిశోధకులు కూరగాయల రైతులకు ఖర్చు తగ్గించేందుకు అగ్రీబాట్ పేరుతో.. టొమాటో పంటను సంరక్షించి, టొమాటోలను కోసే యంత్రాన్ని రూపొందించారు. ఇవి కాక.. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వాతావరణ మార్పు, ఈ-మొబిలిటీ, క్లీన్‌ఎనర్జీ, స్థిరమైన సాంకేతికతలు, రక్షణకు సంబంధించి 35 రకాల ఆవిష్కరణలను ఈ వేడుకలో ప్రదర్శించారు.



క్యాన్సర్‌ను గుర్తించే సర్వీసెల్ఫ్ కిట్



కూరగాయలు తెంపడానికి ఉపయోగపడే యంత్రం

నమో.. నమో.. నారసింహా!

» జయజయ ధ్వానాలతో భక్తుల గిరి ప్రదక్షిణ

» 8వేల మంది హాజరు.. ప్రారంభించిన విప్ ఐలయ్య

భువనగిరి అర్బన్, జూలై 15: యాదగిరిగుట్ట లక్ష్మీ నారసింహ స్వామి దేవస్థానంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని సుమారు 8వేల మంది భక్తులు గిరిప్రదక్షిణలో భాగస్వామ్యులయ్యారు. వేకువజాము నాలుగు గంటల నుంచే కొందరు భక్తులు ప్రదక్షిణ చేపట్టగా, అధికారికంగా ఉదయం 6.05 గంటలకు వైకుంఠద్వారం వద్ద పూజల అనంతరం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. కొండ చుట్టూ సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర 45నిమిషాల పాటు సాగిన ప్రదక్షిణలో నమో నారసింహ అంటూ భక్తులు జయజయ ధ్వానాలు చేశారు. వేకువజామున ఆలయంలో స్వాతి నక్షత్ర పూజల్లో భాగంగా అర్చకులు శతఘటాభిషేకం నిర్వహించారు. కాగా, గిరిప్రదక్షిణతోపాటు వన మహోత్సవంలోనూ భక్తులు మమేకమయ్యారు. వ్రత మండపం, మల్లాపురం గోశాల, వేద పాఠశాల ప్రాంగణంలో వందలాది మంది మొక్కలు నాటారు. కొండపైన ప్రొటోకాల్ కార్యాలయం ఎదురుగా దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, వైటీడీఏ వైస్‌ఛైర్మన్ కిషన్‌రావు మొక్కలు నాటారు. అనంతరం వారు లక్ష్మీనృసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



కొండ చుట్టూ గిరిప్రదక్షిణ మార్గంలో భక్తజన సందోహం

ప్రొటోకాల్ ఉల్లంఘనను అడ్డుకోండి

» స్పీకర్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

» ఫిర్యాదులు పట్టించుకోరా: హరీశ్

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులను కాలరాసే విధంగా కొత్త సంస్కృతిని తీసుకొచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను అవమానించేలా ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని, దీన్ని తక్షణం అడ్డుకోవాలని స్పీకర్ గడ్డ ప్రసాద్‌కుమార్‌ను కోరుతూ సోమవారం కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు అందించాల్సిన చెక్కులను స్థానిక ఎమ్మెల్యేను కాదని కాంగ్రెస్ నాయకులే పంపిణీ చేస్తున్నారని వెల్లడించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రొటోకాల్‌ను పరిరక్షించాలని సీఎస్ సహా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని స్పీకర్‌కు విజ్ఞప్తిచేశారు. 'రాష్ట్ర మంత్రిగా మూడుసార్లు, ఐదుసార్లు ఎమ్మెల్యే అయిన మహిళా నేతకు ఇందిరమ్మ రాజ్యంలో గౌరవం లేదా..?' అని మాజీమంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పట్ల కాంగ్రెస్ నేతలు అనుసరించిన తీరుపై సోమవారం ఎక్స్ వేదికగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ విషయంలో ప్రజా ప్రతినిధులకు జరుగుతున్న అవమానంపట్ల స్పీకర్ వెంటనే స్పందించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న నిరుద్యోగులను నిర్బంధించడం, అరెస్టు చేయడం తగదని కేటీఆర్ అన్నారు. సచివాలయ ముట్టడికి యత్నించిన రాజారాంయాదవ్ సహా ఇతర విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయడాన్ని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన ఖండించారు. విద్యార్థి నాయకులందరినీ బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాగా గౌడ సోదరులకు కాటమయ్య కిట్ల పంపిణీలో పాల్గొన్న సీఎం.. వారిని చెట్ల మీద అంతసేపు నిలబెట్టి.. వారి వృత్తి మీద చౌకబారు జోకులు వేస్తూ.. దాన్ని ప్రచారానికి వాడుకోవడం దుర్మార్గమని కేటీఆర్ పేర్కొన్నారు. ఉచితం అంటూనే.. బస్సు చార్జీల పెంపుపై కర్ణాటక దృష్టి పెట్టిందని.. తెలంగాణలో చార్జీలను పెంచే రోజు ఎంతో దూరం లేదని అభిప్రాయపడ్డారు.

ప్రజల అభిప్రాయాలే ప్రభుత్వ జీవోలు!

ప్రజలు చెల్లించే పన్నులతోనే పథకాల అమలు.. అక్రమాలకు తావు లేకుండా రైతు భరోసా

రైతుల అభిప్రాయాలపై చట్టసభల్లో చర్చిస్తాం

ఆగస్టులో 2 లక్షల రుణమాఫీ: భట్టి విక్రమార్క

'ఐటీ' రైతులకూ రైతుభరోసా: పొంగులేటి

బీమా కంపెనీలతో చర్చిస్తున్నాం: తుమ్మల

వరంగల్ రైతుల అభిప్రాయాల సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క; చిత్రంలో మంత్రులు సురేఖ, తుమ్మల, పొంగులేటి

వరంగల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తమ ప్రభుత్వంలో ప్రజల అభిప్రాయాలే జీవోలుగా వెలువడుతాయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ప్రజల అభిప్రాయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఉపాధి హామీ కూలీలు మొదలుకొని రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారని, ఆ పన్నులతోనే ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. రైతు భరోసా పథకం అమలుపై మంత్రివర్గ ఉపసంఘం నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాల స్థాయి విస్తృత సమావేశాల్లో భాగంగా సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులతో హనుమకొండ కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలు తీసుకుని పారదర్శకంగా అమలు చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారని తెలిపారు. ఇప్పటివరకు నాలుగు ఉమ్మడి జిల్లాల్లో రైతుల అభిప్రాయాలను స్వీకరించామన్నారు. వీటిపై శాసనసభ, శాసనమండలిలో చర్చించి.. అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అభిప్రాయాలు కూడా తీసుకుంటామని చెప్పారు. గతంలో కొండలు, గుట్టలు, ఫాంహౌస్‌లు, రియల్ ఎస్టేట్ ప్లాట్లకు కూడా రైతుబంధు ఇచ్చినట్టుగా నివేదికలు చెబుతున్నాయని డిప్యూటీ సీఎం వెల్లడించారు. తమ ప్రజా ప్రభుత్వంలో అలాంటి అక్రమాలకు తావులేకుండా అర్హులైన రైతులకు రైతు భరోసా అందించడంపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టారని పేర్కొన్నారు. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్‌ను రాహుల్‌గాంధీ వరంగల్ నుంచే ప్రకటించారని గుర్తుచేస్తూ.. ఇక్కడి రైతులు చెప్పిన విలువైన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

ఆదాయ పన్ను చెల్లించే రైతులకూ రైతుభరోసా

ఆదాయ పన్ను (ఐటీ) చెల్లిస్తున్న రైతులకు రైతుభరోసా ఇవ్వరంటూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఐటీ చెల్లించడం వేరు.. రిటర్న్ దాఖలు చేయడం వేరు అని, ఈ విషయంలో తమ ప్రభుత్వానికి స్పష్టత ఉందని చెప్పారు. చిన్న చిన్న వ్యాపారాలతో, తక్కువ ఆదాయ పన్ను చెల్లించేవారిని రైతుభరోసాకు దూరం చేయకుండా విధి విధానాలు రూపొందించే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్న సమయంలో సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారని, అయినప్పటికీ పేదల కోసం ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తున్నారని తెలిపారు. సంక్షేమంతోపాటు అభివృద్ధిని కూడా వేగంగా పరుగెత్తించేందుకు సీఎం కృషి చేస్తున్నారని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం చెప్పినట్లుగానే ఆగస్టులో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుబంధు కింద రూ.7,562 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. అయితే రైతుబంధులో అనేక అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటివి రైతు భరోసాలో జరగకుండా ఉండేందుకే రైతుల అభిప్రాయాలు తీసుకుంటున్నామని చెప్పారు. పంట నష్టాలకు సంబంధించి బీమా కంపెనీలతో చర్చిస్తున్నామన్నారు.

ధరణి పేరుతో పేదల భూములు మాయం..

గత ప్రభుత్వం అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వలేదని మంత్రి కొండా సురేఖ అన్నారు. ధరణి పేరుతో పేదల భూములను దోచుకుందని, ఇందిరమ్మ ఇచ్చిన భూములను కూడా లాక్కుందని ఆరోపించారు. నాటి సీఎం కేసీఆర్ నాలుగు గోడల మధ్యే నిర్ణయాలు తీసుకునేవారని, కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల మధ్య చర్చ పెట్టి వారికి కావాల్సిన నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. పంటలకు బీమా చేసినట్లే.. పశువులకు కూడా బీమాను వర్తింపజేస్తే బాగుంటుందని మంత్రి అభిప్రాయపడ్డారు. మరో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రైతుబంధు పేరుతో అందించిన పథకంలో లోపాలున్నాయని, నిజమైన రైతులకు, కష్టపడే రైతులకు రైతుబంధుతో అన్యాయం జరుగుతోందని అన్నారు. రైతుభరోసాతో అలాంటి వాటికి తావుండదని, పేద రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని చెప్పారు.

పోలీస్ అధికారుల సంఘాన్ని రద్దు చేయండి

» కొత్త సంఘం కోసం ఎన్నికలు నిర్వహించండి

» డీజీపీకి సంఘం సభ్యుల వినతి

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తాత్కాలికంగా కొనసాగుతున్న పోలీస్ అధికారుల సంఘాన్ని రద్దు చేసి, కొత్త సంఘం కోసం ఎన్నికలు నిర్వహించాలని సంఘం రాష్ట్ర మాజీ కోశాధికారి, పీటీవో ఉపాధ్యక్షుడు జీఎస్ రాజు తదితరులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన ఆధ్వర్యంలో సంఘం ప్రస్తుత, మాజీ సభ్యులు పలువురు సోమవారం డీజీపీ జితేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సిబ్బంది ఆరోగ్య భద్రతకు సంబంధించి సుమారు రూ. 260 కోట్ల బిల్లులు బకాయిలు ఉన్నాయని, దాంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో పోలీస్ సిబ్బందికి చికిత్స నిరాకరిస్తున్నారని ఈ సందర్భంగా వారు డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. సుమారు 1,288 మంది సివిల్ హెడ్ కానిస్టేబుళ్లు ఏఎస్సై పదోన్నతి కోసం వేచి చూస్తున్నారని, అందుకు సంబంధించిన ఫైల్ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. పీటీవోలో సుమారు 15 సంవత్సరాలుగా పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయిందని, అలాగే పోలీస్ సిబ్బందికి సంబంధించి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ దశల వారిగా పరిష్కరించాలని డీజీపీని వారు కోరారు.

బాలికపై అత్యాచారం.. దోషికి 20 ఏళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, జూలై 15: అయిదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ వ్యక్తికి న్యాయస్థానం 20 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు న్యాయాధికారి కె. జయంతి సోమవారం తీర్పు వెల్లడించారు. జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని ఆల్విన్‌కాలనీకి చెందిన ఇటిక్యాల నవీన్(30) పక్క ఇంట్లో ఉన్న ఓ అయిదేళ్ల బాలికపై 2018లో అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ కేసులో నిందితుడు నవీన్‌పై నేరం రుజువు కావడంతో కోర్టు అతడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది జైలు శిక్ష అమలు చేయాలని ఆదేశించింది.

బదిలీలపై 'వ్యవసాయ' ఉద్యోగుల్లో అయోమయం

» తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బదిలీల ప్రక్రియపై వ్యవసాయ శాఖ ఉద్యోగులు అయోమయానికి గురవుతున్నారని తెలంగాణ అగ్రి అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాల్మన్ నాయక్, తిరుపతి నాయకుల్‌లతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు(ఏఈవో, ఏవో, ఏడీఏ) సోమవారం వ్యవసాయశాఖ డైరెక్టరేట్ కార్యాలయానికి వచ్చి డైరెక్టర్ గోపికి తమ అనుమానాలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవో ప్రకారం బదిలీలను ఉద్యోగుల్లో 40 శాతం వరకు మాత్రమే పరిమితం చేయాలని ఉండగా 60 నుంచి 80 శాతం మేరకు బదిలీలు చేసే ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నారని పేర్కొన్నారు. అలాగే సీనియారిటీ జాబితాలను తప్పుల తడకగా రూపొందించారని అన్నారు. జీతం పొందే స్టేషనుకి బదులుగా తాత్కాలిక డిప్యూటేషన్‌లో ఉన్న స్టేషనులను పరిగణనలోకి తీసుకున్నారని, వెబ్ కౌన్సెలింగ్ పేరుతో అప్షన్లు, ఖాళీల వివరాల్లో గందరగోళం సృష్టించారని తెలిపారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు ఆందోళన చెందుతున్నా ఉన్నతాధికారుల నుంచి స్పష్టత రావడం లేదన్నారు. జీతం పొందే స్టేషను, సీనియారిటీ ఆధారంగా ఉద్యోగుల జాబితా తయారు చేసి, మొదటి 40 శాతం ఉద్యోగుల్లోనే పరస్పర బదిలీలు చేయాలని, భౌతికంగా కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు.

డెంగీతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

వేములవాడ టౌన్, జూలై 15 : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఇమ్మడోజు రాజేశ్వర్(28) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ డెంగీతో సోమవారం మృతి చెందాడు. వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన రాజేశ్వర్ హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వారం రోజుల క్రితం అతని భార్య భవానీకి జ్వరం రావడంతో ఆసుపత్రిలో చికిత్స అందించగా పూర్తిగా నయమైంది. గురువారం రాజేశ్వర్‌కు జ్వరం రాగా స్థానికంగా ఉన్న ఆస్పత్రికి వెళ్లాడు. ప్లేట్‌లెట్‌లు తగ్గడంతో వైద్యులు డెంగీ పరీక్ష చేయగా పాజిటివ్ వచ్చింది. అదే రోజు గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం మృతి చెందాడు.

కొందరికే రుణమాఫీ చేసే కుట్ర

మార్గదర్శకాల పేరిట దగా యత్నం: మాజీ మంత్రి సింగిరెడ్డి

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టగానే డిసెంబరు 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని మాట తప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు మార్గదర్శకాల పేరిట రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. రుణమాఫీని కొందరికే పరిమితం చేయాలన్న ఉద్దేశంతోనే మార్గదర్శకాలు తెచ్చారని.. ఇది అభ్యంతరకరమని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రోజుల్లో ఐదెకరాల వ్యవసాయదారుడు, రూ.30వేల జీతం తీసుకునే ఉద్యోగి కూడా ట్యాక్స్ పరిధిలోకి వస్తున్నారని తెలిపారు. రేషన్‌కార్డు, పీఎం కిసాన్ యోజన పథకం మార్గదర్శకాలు వంటి కొర్రీలు పెట్టి.. కొందరికే రుణమాఫీ చేసేలా కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో రూ.2లక్షల రుణం పొందిన రైతులు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం ప్రకటించాలన్నారు. పీఎం కిసాన్ యోజన మార్గదర్శకాలను అనుసరించడం అంటే రుణమాఫీ లక్ష్యానికి గండికొట్టడమేనన్నారు. రేషన్‌కార్డు ప్రామాణికం కాదని ఇటీవల ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. నాలుగు రోజులు తిరగకముందే నాలుక మడతేశారని మండిపడ్డారు. రేషన్ కార్డులులేని రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రైతాంగాన్ని వంచించే ఉద్దేశంతోనే నిబంధనలు పెడుతున్నారని అన్నారు.

జడ్చర్లలో డీసీఎంను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

» 15 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

» ఘటనలో బస్సు దగ్ధం.. ముందే దిగేసిన ప్రయాణికులు

జడ్చర్ల/మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూలై 15: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలో 44వ నెంబరు జాతీయరహదారిపై ఆదివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. యూటర్న్ తీసుకుంటున్న డీసీఎంను ఏపీలోని ధర్మవరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు దగ్ధమైంది. 15 మంది ప్రయాణికులకు గాయాలు కాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సిద్దిపేట నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్లాల్సిన డీసీఎం.. జడ్చర్ల క్రాస్‌రోడ్డు గుండా వెళ్లాల్సి ఉంది. కానీ, జడ్చర్ల ఫ్లైఓవర్ మీదుగా ముందుకు వెళ్లిన డ్రైవర్ తిరిగి జడ్చర్ల వైపునకు వచ్చేందుకు బురెడ్డిపల్లి టీ జంక్షన్ వద్ద యూ టర్న్ తీసుకున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి 36 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లతో ఏపీ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డీసీఎంను ఢీకొట్టింది. బస్సు ఇంజన్‌లో నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు అత్యవసర ద్వారం నుంచి కిందకు దిగారు. స్టీరింగ్‌కు ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను స్థానికులు, ప్రయాణికులు 15 నిమిషాల పాటు కష్టపడి కిందకు దించారు. తర్వాత బస్సు ఇంజన్‌లో నుంచి మంటలు వచ్చి దగ్ధమైంది. బస్సులో గుత్తి, కర్నూల్, అనంతపురం, ధర్మవరం ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఉన్నారు.

మా హాస్టల్ మాకే కావాలి

» వేములపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థినుల ఆందోళన

వేములపల్లి, జూలై 15: జిల్లాలోని తిప్పర్తి కస్తూర్బా పాఠశాల బాలికలను తమ హాస్టల్‌లో ఉంచాలన్న ఆలోచనను విరమించుకోవాలని నల్లగొండ జిల్లా వేములపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థినులు అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా... వేములపల్లిలో 100 మంది విద్యార్థినులకు సౌకర్యవంతంగా ఉండేలా ఆదర్శ పాఠశాల, హాస్టల్‌ను ఏర్పాటు చేశారని, తిప్పర్తి పాఠశాలలో 250 మంది విద్యార్థినులు ఉంటారని, వారందరిని ఇక్కడికి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. హాస్టల్‌లోని ఒక్కో గదిలో సుమారు 30 నుంచి 35 మందిని ఇరికించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అలా అయితే ఒక్క మరుగుదొడ్డి 50 మంది వినియోగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కస్తూర్బా బాలికలను తమ హాస్టల్‌లో కాకుండా వేరే ప్రాంగణంలో ఉంచేందుకు ఏర్పాటు చేయాలన్నారు. డీసీడీవో(బాలికా సంరక్షణ విభాగం) సరిత, మండల విద్యాధికారి(ఎంఈవో) బాలాజీనాయక్‌లు వారితో చర్చించారు. ఆదర్శ హాస్టల్‌లో ఉంటున్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేసిన తర్వాతే కస్తూర్బా బాలికలను ఇక్కడికి తీసుకువస్తామన్నారు. దీంతో విద్యార్థినులు ఆందోళన విరమించి తరగతి గదులకు వెళ్లారు.

గిరిజన గురుకుల సీట్లలో అవకతవకలు

» దరఖాస్తుదారులకు ఇవ్వడం లేదని గిరిజన సంఘాల ఆరోపణ

» సంక్షేమభవన్ వద్ద మెరుపు ధర్నా



సంక్షేమ భవన్ దగ్గర ధర్నా చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజన గురుకులాల్లో విద్యార్థుల సీట్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని, దరఖాస్తు పెట్టుకున్న వారికి కాకుండా నిబంధనలకు విరుద్ధంగా మిగతా వారికి సీట్లను కేటాయిస్తున్నారని గిరిజన సంఘాలు ఆరోపించాయి. సోమవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ దగ్గరున్న తెలుగు సంక్షేమ భవన్ వద్ద గిరిజన సంఘాల నేతలు శ్రీరాంనాయక్, అంజయ్య నాయక్ సభ్యులతో కలిసి మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి మౌఖిక ఆదేశాల మేరకు అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యే పైరవీలతోనే సీట్లను కేటాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులంలో సీటు కోసం వేల మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాశారని, ఆ పరీక్షలో మొదటి కౌన్సెలింగ్‌లో ప్రవేశం దొరకని వారికి మరోసారి అవకాశం కల్పించడంలేదని అన్నారు. సీటు ఇవ్వాలని దరఖాస్తు పెట్టుకున్నవారిని కూడా పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ విద్యార్థికి సీటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీట్ల విషయంలో అధికారులు, దళారులు కలిసి అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. శాఖ కార్యదర్శి ఆదేశించారని ఒక్క నల్గొండ జిల్లాకే 150 సీట్లకు పైగా కేటాయించారని, ఇది నిబంధనలను ఉల్లంఘించడమేనని అన్నారు. ప్రభుత్వం దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

బీజేపీ, బీఆర్ఎస్ రహస్య ఒప్పందాలు

» ఢిల్లీలో కేటీఆర్, హరీశ్ సంప్రదింపులు: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్-బీజేపీ రహస్య ఒప్పందాలకు నెమ్మదిగా తెర లేపుతున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఢిల్లీలో కేటీఆర్, హరీశ్ రావు బీజేపీ నేతలతో సంప్రదింపులు జరిపారని ఆరోపించారు. కవిత బెయిల్ కోసమే బీజేపీకి బీఆర్ఎస్ నేతలు స్నేహ హస్తం అందిస్తున్నారన్నారు. అందుకే హరీశ్ రావు ప్రజా నేత అని కేంద్ర మంత్రి బండి సంజయ్ డబ్బా కొడుతున్నారని విమర్శించారు. హరీశ్‌ను పొగడ్తలతో ముంచెత్తడం వెనక ఆయనతో రాజీనామా చేయించి బీజేపీ తరఫున పోటీ చేయించే ఆలోచన ఉన్నట్లు కనిపిస్తోందని చెప్పారు. కేసీఆర్‌పై ఒత్తిడి తెచ్చి బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకు కేసీఆర్ ఒప్పుకోకపోతే హరీశ్‌ను అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్‌ను చీల్చే అవకాశాలున్నాయి. మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే ప్రయోగాన్ని ఇక్కడ బీఆర్ఎస్‌పైనా బీజేపీ చేస్తుందనే అనుమానాలున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటైనా కాంగ్రెస్‌కు ఏ ఇబ్బంది లేదు' అని వ్యాఖ్యానించారు.

కొందరు కృత్రిమ ఉద్యమాలు సృష్టిస్తున్నారు

» కేసీఆర్ చిల్లర రాజకీయాలు మానాలి: చిన్నారెడ్డి

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొంతమంది రాజకీయ నేతలు కృత్రిమ ఉద్యమాలు సృష్టిస్తున్నారని, వారి ప్రోద్బలంతో నిరుద్యోగులు ఆందోళనలు చేస్తున్నారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడొద్దని హితవు పలికారు. సోమవారం సచివాలయ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. అప్పట్లో లక్షా 7 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేసీఆర్ చెప్పారని, వాటిని భర్తీ చేయకపోవడంతోనే ఆయన అధికారం నుంచి దిగిపోవాల్సి వచ్చిందన్నారు. నిజంగా కేసీఆర్‌కు నిరుద్యోగులపై ప్రేమ ఉంటే ఖాళీలను ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ఇకనైనా తన చిల్లర రాజకీయాలు మానుకోవాలన్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని తమ కాంగ్రెస్ చెప్పిందని, ఆమేరకు ఇప్పటికే 30 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని చెప్పారు.

ఎమ్మెల్యే ఒత్తిడితోనే.. బీఆర్ఎస్ ఆఫీసు కూల్చివేతకు చర్యలు

» హనుమకొండ పార్టీ కార్యాలయంపై.. చర్యలు వద్దంటూ హైకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్

» కూల్చివేయకుండా అడ్డుకోవాలని విజ్ఞప్తి

» కలెక్టర్‌కు ఎమ్మెల్యే రాసిన లేఖ సమర్పించాలన్న హైకోర్టు

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పట్టణంలోని బీఆర్ఎస్ తాత్కాలిక కార్యాలయ నిర్మాణాలను కూల్చివేయకుండా ఆదేశాలు జారీ చేయాలంటూ ఆ పార్టీ నేత దాస్యం వినయ్‌భాస్కర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది టీవీ రమణారావు వాదనలను వినిపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఒత్తిడితో అధికారులు తమ పార్టీ కార్యాలయాన్ని కూల్చివేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు వివరించారు. పట్టణంలోని సర్వేనంబరు 1066లో ఉన్న తాత్కాలిక కార్యాలయంపై ఎమ్మెల్యే కలెక్టర్లును బెదిరిస్తున్నట్లుగా ఆదేశాలిస్తూ.. ఓ లేఖ రాశారని పేర్కొన్నారు. హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ భూకేటాయింపు రద్దు, తాత్కాలిక నిర్మాణాల కూల్చివేతపై ఎమ్మెల్యే ఒత్తిడి చేస్తుండడంతో.. అధికారులు చర్యలు చేపట్టారని వివరించారు. కలెక్టర్‌కు విషయం చెబుతున్నట్లుగా కాకుండా.. సదరు ఎమ్మెల్యే ఓ అల్టిమేటం జారీ చేసినట్లుగా లేఖ రాశారన్నారు. భూకేటాయింపు జరిగిన సమయంలో కొవిడ్ కల్లోలం కారణంగా శాశ్వత భవనం నిర్మించలేదని, తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేశారని వివరించారు. కొత్త మునిసిపల్ చట్టం ప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టకూడదని గుర్తుచేశారు. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. వివాదం కొనసాగుతున్న స్థలం ఫొటోలను సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. అదేవిధంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కలెక్టర్‌కు రాసిన లేఖ, కలెక్టర్ నుంచి ఆర్డీవోకు వెళ్లిన ఆదేశాల ప్రతులను సమర్పించాలని అడ్వొకేట్ జనరల్‌కు ఆదేశాలు జారీ చేసింది. విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రాజకీయ హింస!

మళ్ళీ అధికారంలోకి రావాలనుకుంటున్న అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌మీద శనివారం జరిగిన హత్యాయత్నం అక్కడి రాజకీయాన్ని మరింత వేడెక్కించింది, మిగతా ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. నలుగురు దేశాధ్యక్షులహత్య సహా ఈ తరహా హత్యాయత్నాలు అనేకం చూసిన అమెరికాకు రాజకీయ హింస కొత్తేమీ కాదు. కానీ, ట్రంప్ రాజకీయ ప్రవేశం తరువాత మరింతగా చీలిన అమెరికా సమాజాన్ని ఈ హత్యాయత్నం తీవ్రంగా ప్రభావితం చేస్తుంది, విద్వేషాలు పెంచుతుంది.

ఏవో కుట్రసిద్ధాంతాలు తెరమీదకు వస్తున్నాయి, భద్రతాసిబ్బంది వైఫల్యంమీద కూడా అనుమానాలు, ఆరోపణలు వినవస్తున్నాయి. వాటిని అటుంచితే, ఒక భయానకమైన హత్యాయత్నంనుంచి తృటిలో తప్పించుకున్న నాయకుడి పట్ల ప్రజల్లో సానుభూతి కలగడం సహజం. పైగా, తూటా తాకిన వెంటనే కిందకు వంగిన ఆయన ఆ తరువాత లేచి పిడికిలి బిగించాడు. ఫైట్ ఫైట్ ఫైట్ అంటూ ముమ్మారు నినదించాడు. చెవి పైభాగం చిట్లిపోగా మొఖమీదకు చిమ్మిన ఆ రక్తం, ఆయన వెనుక ఉన్న అమెరికా జెండా, చుట్టుముట్టివున్న సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లతో కూడిన ఆ దృశ్యం అమెరికన్ల మనస్సుల్లో బలంగా నిలిచిపోతుంది. భద్రతాసిబ్బంది ఎలా అనుమతించారో తెలియదు కానీ, బుల్లెట్ తగిలిన క్షణంనుంచి వాహనం ఎక్కే వరకూ పలుమార్లు ట్రంప్ ఆ రక్తమోడుతున్న మొఖాన్ని ప్రజలకు చూపించాడు, లొంగేది లేదంటూ నినాదాలు చేశాడు, తాను బెదిరిపోలేదని చాటిచెప్పాడు. మనకు కావాల్సింది ఇటువంటి యోధుడూ ధీరుడేనంటూ రిపబ్లికన్లు సాగిస్తున్న ప్రచారం కూడా తోడై ఈ హత్యాయత్నం ఆయనకు రాజకీయంగా మేలు చేయవచ్చు. ఆయనమీద ఉన్న కేసులు సైతం ఇక కదలకపోవచ్చునని అంటున్నారు. ఇప్పటికే జో బైడెన్ వెనుకబడి ఉన్నారని సర్వేలు చెబుతున్న తరుణంలో మొన్నటి తొలి అధ్యక్ష అభ్యర్థుల ముఖాముఖి చర్చలో సైతం బైడెన్ తడబడ్డారు, తప్పటడుగులు వేశారు. బైడెన్ తప్పుకోవాలంటూ ఆయన పార్టీలోనే ఒత్తిడి పెరుగుతోంది, కమలాహారిస్ సహా కొన్ని పేర్లు ముందుకు వచ్చాయి కూడా. తటస్థ ఓటర్లు ట్రంప్ వైపు తిరిగిపోతున్నారనీ, బైడెన్ తప్పుకోవాలని అత్యధికశాతం డెమోక్రాట్ ఓటర్లు సైతం కోరుకుంటున్నారని వార్తలు వస్తున్న తరుణంలో ట్రంప్ మీద ఈ హత్యాయత్నం జరిగింది. ఇప్పుడు అధ్యక్ష రేసునుంచి బైడెన్‌ను తప్పించినా కూడా ఫలితం ఏకపక్షంగానే ఉంటుందన్న విశ్లేషణలు కొట్టిపారేయలేనివి. అమెరికాని 'గ్రేట్ ఎగైన్' చేయడానికి సంకల్పించిన వ్యక్తిని చట్టసభలూ, న్యాయస్థానాలూ వేధిస్తున్నాయని ఇంతకాలం భావించినవారు, ఇప్పుడు భౌతికంగా అంతం చేయడానికి ప్రయత్నించారన్న ఆరోపణను ట్రంప్ అభిమానులతో పాటు తటస్థులు కూడా నమ్మవచ్చు. ఘటన జరిగిన తరువాత ట్రంప్ కుమారుడు ఇచ్చిన సందేశం పరమార్థం ఇదే.

తన పదవీకాలంలో మూడోమారు బైడెన్ ఓవల్ ఆఫీసునుంచి జాతినుద్దేశించి చేసిన ప్రసంగం ఉన్నతంగా ఉంది. దేశంలో రాజకీయ హింస పెరుగుతోందని, చల్లార్చుకోవాలని, ఎన్నికల వేడి శృతిమించకూడదని, విభేదాలు పరిష్కరించుకోవాల్సింది బ్యాలెట్‌తోనే కానీ, బుల్లెట్‌తో కాదనీ చాలామంచి మాటలు చెప్పారాయన. ఈ సందర్భంగా ట్రంప్ ఏలుబడిలో దేశం చవిచూసిన ఉద్రిక్త ఘట్టాలను, తిరుగుబాట్లను కూడా గుర్తుచేశారు. అధ్యక్ష ఎన్నికల్లో ఓడినప్పటికీ, అధికారం అప్పగించడానికి నిరాకరించి, తన అభిమానులను రెచ్చగొట్టి, అమెరికన్ కాంగ్రెస్ భవనాలపై దాడులను ప్రోత్సహించి, ప్రపంచంముందు ట్రంప్ దేశం పరువుతీసిన విషయం తెలిసిందే.

ట్రంప్‌మీద హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి నేరచరిత్ర ఏమీ లేదు. ఫలానాపార్టీతో బలమైన అనుబంధం ఉన్నదని చెప్పడానికి కానీ ఇప్పటి వరకూ ఏ ఆధారాలు లేవు. అతడిని వెంటనే కాల్చిచంపేయడం వల్ల కొన్ని విషయాలు వెలుగులోకి రాకపోవచ్చు కూడా. అతడు శ్వేతజాతీయుడు కావడం ఒక విధంగా అమెరికా సమాజాన్ని కాపాడింది. అతడి రంగు వేరయి ఉంటే, ఇప్పటికే పలురకాల వివక్షలతో రగులుతున్న దేశానికి విషం చిమ్మడానికి మరో అవకాశం వచ్చివుండేది. ఇక, ఈ రాజకీయ హింసకు ఆయుధంగా ఉపకరిస్తున్న 'గన్‌కల్చర్' మీద ఇప్పటికైనా పాలకులు దృష్టిసారించడం అవసరం. తుపాకులను నియంత్రించాలన్న బైడెన్ ప్రయత్నాలకు రిపబ్లికన్లు గతంలో ఎంతగా అడ్డుపడ్డారో తెలుసు. తుపాకులను నియంత్రించాలన్న ఉద్యమాలకు కేంద్రబిందువుగా ఉండే అత్యంత ప్రమాదకరమైన సామూహిక జనహనన ఆయుధం ఎఆర్–15 రైఫిల్‌ను ఓ సాదాసీదా వ్యక్తి ఇలా సులువుగా సంపాదించి, ప్రాణాలు తీయబోయిన నేపథ్యంలో, రేపు డోనాల్డ్ ట్రంప్, ఆయన పార్టీ అధికారంలోకి వస్తే గన్ కల్చర్ మీద దృష్టిపెట్టడం అవసరం.

చలన చిత్రోత్సవాలెక్కడ, బంగారు నందులేవి?

గౌరవనీయులయిన ముఖ్యమంత్రి గారికి,

తెలంగాణా ఏర్పడిన గత పదేళ్లుగా అత్యంత నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైన సాంస్కృతిక, సృజనాత్మక సినిమా రంగం గురించి కొన్ని సూచనలతో కూడిన విజ్ఞాపన ఇది. సహృదయంతో గమనిస్తారని ప్రోత్సాహకరమైన నిర్ణయాల్ని తీసుకుంటారని ఆశిస్తాను.

సినిమా సర్వకళా సమ్మిళితమనీ, అది సమాజానికి అద్దం పడుతుందనే భావన దాదాపు అంతరించి పోయిన కాలమిది. సినిమా వ్యాపారమా పరిశ్రమా లేక రెంటి సమన్వయ రూపమా అన్నది ఇవ్వాళ వెయ్యి డాలర్ల ప్రశ్న. కోట్లు పెట్టు, కొల్లగొట్టు అనేదే ఇవ్వాల్టి సినిమా నినాదంగా మారింది. ఇవన్నీ అట్లా ఉంచితే ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలోను, ఆ తర్వాతా దృశ్య మాధ్యమం చేసిన సేవల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. కానీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తర్వాత అర్థవంతమైన సినిమా, తెలంగాణ సినిమా లాంటి మాటలక్కూడా స్థానం లేని పరిస్థితిని చూసాం. హైదరాబాద్‌లో సినిమా రంగ ఎదుగుదలకు గాని లేదా యువతకు సినిమా రంగానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని అందించే ప్రయత్నాలు గాని జరగలేదు. ప్రభుత్వపరంగా ఆ దిశలో తీవ్రమైన నిరాదరణ నిర్లక్ష్యం కనిపించింది. నిజానికి ఎంతోమంది యువతీయువకులు సినిమా రంగంలో కాలు మోపేందుకు ఎంతో కష్టపడుతున్న సమయమిది. షార్ట్ ఫిలిమ్స్ తీస్తూ ప్రతిభను బయటపెడుతున్నారు. కాని గత ప్రభుత్వం చలనచిత్రాభివృద్ధి సంస్థకు చైర్మన్లను నియమించి చేతులు దులుపుకుంది తప్ప మరే అడుగూ ముందుకు వేయలేదు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు ఎన్నో ఉన్నాయి.

1985లో ఫిల్మ్ కౌన్సిల్ భావనను స్ఫూర్తిగా తీసుకుని బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం కోల్‌కత్తాలో నందన్ సినిమా కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసింది. అందులో పలు థియేటర్లను ఏర్పాటు చేసింది. కోల్‌కత్తా అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్ని కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నది. తర్వాత 1998లో కేరళ రాష్ట్ర ప్రభుత్వం, 2009లో కర్ణాటక ప్రభుత్వం చలన చిత్ర అకాడెమీల్ని ఏర్పాటు చేశాయి. ఈ రెండు రాష్ట్రాలూ ప్రధాన స్రవంతి సినిమాకు సమాంతరంగా అర్థవంతమైన సినిమాకు ఇతోధికంగా ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయి. కేరళ ఫిల్మ్ అకాడెమీ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణతో పాటు రాష్ట్రంలో పలుచోట్ల వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ మలయాళీ సినిమా ఎదుగుదలకు కృషి చేస్తున్నది. కర్ణాటక చలనచిత్ర అకాడెమీ కూడా కన్నడ సినిమాకూ అంతర్జాతీయ సినిమాకు వారధిగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. అదే రీతిలో తెలంగాణ ప్రభుత్వం కూడా తెలంగాణ ఫిల్మ్ అకాడెమీ ఏర్పాటు చేస్తే యువతకు శిక్షణ ఇచ్చే పని జరుగుతుంది. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న తెలంగాణ సినిమాకు ఎంతో ప్రోత్సాహంగా ఉంటుంది. సినిమా రంగం పట్ల అభిమానంతోనూ ఆసక్తితోనూ ఉన్న యువతీ యువకులకు గొప్ప అవకాశాలు వచ్చే అవకాశం మెరుగుపడుతుంది. ఇంకా అకాడెమీ నేతృత్వంలో ఇనిస్టిట్యూట్, ఆర్కైవ్స్ లాంటివి ఏర్పాటయితే తెలంగాణ టాలెంట్‌కు కొత్త ఊపు వస్తుంది.

హైదరాబాద్ ఇవ్వాళ మహానగరం. గతంలో ఈ నగరంలో అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు, బాలల కోసం ప్రత్యేక చిత్రోత్సవాలు జరిగేవి. అవన్నీ తెలంగాణ ఏర్పడిన తర్వాత అదృశ్యమైపోయాయి. వాటిని తిరిగి నిర్వహించడం వలన మంచి సినిమా సంస్కృతికి ప్రోత్సాహం లభిస్తుంది. మనవాళ్ళ దృష్టికోణం విస్తారమవుతుంది.

గతంలో మంచి సినిమాలకు ఇస్తూ వచ్చిన నంది అవార్డుల్ని గత ప్రభుత్వం రద్దు చేసింది. వాటిని పునరుద్ధరించి కళాకారుల ప్రతిభను ప్రోత్సహించాలి. ఇప్పుడు కేంద్రం ఆధ్వర్యంలో పూణే, కోల్‌కత్తాలలో మాత్రమే ఫిలిం ఇనిస్టిట్యూట్‌లు పనిచేస్తున్నాయి. హైదరాబాద్‌లో కూడా ఒక ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేస్తే కొత్త తరానికి ఎంతో మేలుచేసినవారవుతారు.

– వారాల ఆనంద్
ఫెడరేషన్ ఆఫ్ ఫిలిం సొసైటీస్ ఆఫ్ ఇండియా
పూర్వ కార్యదర్శి

మళ్లీ రగుల్కొంటున్న నిరుద్యోగుల అసంతృప్తి

రాష్ట్రంలో మళ్లీ ఒకసారి నిరుద్యోగుల ఆందోళన రగుల్కొంటున్నది. తమ నిరాశనూ, తమ కుటుంబాల అసంతృప్తినీ వాడుకొని, తమ ఉజ్వల ఉద్యోగ భవిష్యత్తు గురించి ఎన్నో వాగ్దానాలు చేసి, కొంతవరకు తమ భాగస్వామ్యం వల్లనే అధికారం పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు నెలలు గడిచినా నియామకాల ప్రక్రియలో చేస్తున్న తాత్సారం నిరుద్యోగులలో వ్యతిరేకతను కలిగిస్తున్నది. ఉద్యోగ నియామకాల విశాల సమస్య అట్లా ఉంచి, పరిష్కరించడం సాధ్యమూ సులభమూ అయిన చిన్న సమస్యల విషయంలో కూడా ప్రభుత్వ వైఖరి ఆ వ్యతిరేకతను పెంచుతున్నది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్ల నిరుద్యోగులలో వ్యక్తమైన నిరసన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి ప్రధాన కారణాలలో ఒకటి. రాష్ట్రంలో నిరుద్యోగులు, ఉద్యోగార్థుల సంఖ్య ముప్పై లక్షలనీ, వారి తల్లిదండ్రులతో కలుపుకుంటే అవి తొంబై లక్షల వోట్లనీ, పది సంవత్సరాల పాటు నియామకాల ప్రక్రియను సక్రమంగా అమలు జరపని బీఆర్ఎస్‌కు బుద్ధిచెప్పాలంటే ఈ తొంబై లక్షల వోట్లు చాలుననీ కాంగ్రెస్ నాయకులు చేసిన ప్రత్యక్ష, పరోక్ష ప్రచారాలు 2023 నవంబర్ ఎన్నికలలో కీలక పాత్ర నిర్వహించాయి. నిజానికి ఈ ఎన్నికలలో మాత్రమే కాదు, తెలంగాణ చరిత్రలో 1969 ఉద్యమం నాటి నుంచీ కూడా అన్ని కీలక పరిణామాలలో నిరుద్యోగ సమస్యదే ప్రధాన పాత్ర. నిరుద్యోగ సమస్యను నిర్లక్ష్యం చేసినా, దాని పరిష్కారంలో సవ్యంగా వ్యవహరించక పోయినా పరిణామాలు, ఫలితాలు ఎంత తీవ్రంగా ఉంటాయో తెలంగాణ చరిత్ర స్పష్టంగా చూపుతున్నది.

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రకటించిన అభయ హస్తం ఎన్నికల ప్రణాళికలో 'పారదర్శక ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు', 'నిరుద్యోగ నిర్మూలన', 'యువత – ఉపాధి కల్పన' అనే శీర్షికల కింద 'మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ', 'మొదటి ఏడాదిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ', 'నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేవరకూ ప్రతి నెలా రూ.4000 నిరుద్యోగ భృతి చెల్లింపు', 'ప్రభుత్వ రాయితీలు పొందిన ప్రైవేట్ కంపెనీల్లో తెలంగాణ యువతకు 75శాతం రిజర్వేషన్ కల్పన', 'యూత్ కమిషన్ ఏర్పాటు, రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణ సహాయం', 'తొలి క్యాబినెట్ సమావేశంలోనే మెగా డీఎస్సీ ప్రకటన, ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ పోస్టులు 6 నెలలలోనే భర్తీ', 'అన్ని ప్రభుత్వ కాంట్రాక్టుల్లో నిరుద్యోగ యువతకు అవకాశం', 'రూ.1000 కోట్ల నిధితో రూరల్ యూత్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు, యువతకు స్వయం ఉపాధి ప్రోత్సాహం' వంటి గంభీరమైన వాగ్దానాలెన్నో చేశారు. 'ప్రతి ఏడాది జూన్ 2న అన్ని శాఖల్లోని ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి, సెప్టెంబర్ 17 లోపు నియామకాలు పూర్తి చేస్తామ'ని కూడా వాగ్దానం చేశారు.

ఈ వాగ్దానాలలో దీర్ఘకాలికమైనవి అలా ఉంచి, ఆరు నెలలు, ఏడాది గడువున్నవి కూడా, అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా సగమో పావో అమలైన దాఖలా లేదు. కొన్ని అసలు ప్రారంభమే కాలేదు. కొన్నిటికి విధి విధానాలు రూపొందించే ప్రక్రియ సాగుతున్నదేమో తెలియదు, అందుకు సంబంధించిన ప్రభుత్వ ప్రకటనలైతే లేవు. పైగా నెరవేర్చని వాగ్దానాల గురించి అతిశయోక్తులతో కూడిన ప్రకటనలు వెలువడుతున్నాయి.

రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అని వాగ్దానం చేశారు గాని అందులో చాలా చిక్కుముడులున్నాయి. ఈ ఏడు నెలల్లో నాలుగుసార్లు నియామక పత్రాలు (జనవరి 31న 6,956 స్టాఫ్ నర్సులు, ఫిబ్రవరి 7న 441 సింగరేణి, ఫిబ్రవరి 14న 13,441 కానిస్టేబుళ్లు, మార్చ్ 4న 6,546 గురుకుల ఉపాధ్యాయులు, కానిస్టేబుళ్ల వగైరా) ఇచ్చిన మాట నిజమే గాని, ఈ 29,381 నియామకాలు ఈ ప్రభుత్వ ఖాతాలోకి, రెండు లక్షల వాగ్దానంలోకి రావు. వాటికి గత ప్రభుత్వంలోనే నోటిఫికేషన్లు వచ్చి, పరీక్షలు, ఇంటర్వ్యూలు జరిగి, కేవలం నియామక పత్రాలు ఇవ్వడం బాకీ ఉండింది. ప్రక్రియలో ఆ చివరి దశను పూర్తిచేయడం మొత్తం ప్రక్రియను చేసినట్టు కాదు. ఈ ప్రభుత్వం వచ్చాక ప్రక్రియ ప్రారంభమైన ఉద్యోగాల సంఖ్య ఇరవై వేలకు మించదు.

అసలింతకీ రెండు లక్షల ఉద్యోగాలు అనేది బ్రహ్మపదార్థం. ఎన్నికల వాగ్దానంగా చేసినదే గాని శాస్త్రీయంగా లెక్క తేల్చి చెప్పినది కాదు. సిఆర్ బిశ్వాల్ కమిటీ 2021లో ఇచ్చిన నివేదిక రాష్ట్ర ప్రభుత్వంలో అనుమతి ఉన్న (సాంక్షన్డ్) ఉద్యోగాలు 4,91,304 కాగా, 3,00,178 మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారని చెప్పింది. అందువల్ల 1,91,126 ప్రభుత్వోద్యోగాలు ఖాళీ ఉన్నాయనే అభిప్రాయం నిరుద్యోగుల్లో, సమాజంలో ఏర్పడింది. కాని ఈ 'సాంక్షన్డ్' ఉద్యోగాలు అనేది ఒక మాయ. అందులో ఎప్పుడో రద్దయిపోయిన టైపిస్టులు, స్టెన్సిల్ ఆపరేటర్లు, టెలిఫోన్ ఆపరేటర్లు వంటి ఉద్యోగాలూ, రెయిన్ షాడో ఏరియా అభివృద్ధి శాఖ, వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాల మీద లఘు చిత్రాలు నిర్మించి, గ్రామాలలో ప్రదర్శించే శాఖ వంటి కాలం చెల్లిన శాఖల ఉద్యోగులూ వంటి అసంగతాలెన్నో ఉన్నాయి. కాని గత ప్రభుత్వాలు ఈ సాంక్షన్డ్ స్ట్రెంత్ అనే మాటను క్షాళన చేయాలని అనుకోలేదు.

ఇక్కడ గుర్తించవలసిన మరొక రెండు అంశాలున్నాయి.

ఒకటి, దేశవ్యాప్తంగా వెయ్యి మంది జనాభాకు ఎన్ని ప్రభుత్వోద్యోగాలు ఉండాలి అనే లెక్క ఒకటి ఉంది. అది దేశ వ్యాప్తంగా 13.9 ఉండగా తెలంగాణలో దేశ సగటు కన్నా చాలా తక్కువగా 8.5గా ఉంది. తెలంగాణతో సమానమైన జనాభా ఉన్న కేరళలో సాంక్షన్డ్ స్ట్రెంత్ 5,45,423 ఉండగా తెలంగాణలో అది 54,000 తక్కువగా ఉంది. అందులోనూ దాదాపు రెండు లక్షలు ఖాళీలున్నాయి. లేదా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులున్నారు. ఈ అసంగతాలను సవరించడానికి ప్రయత్నమేమీ జరగలేదు.

రెండు, 1956 నుంచీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయం వల్ల, తెలంగాణలో ఉద్యోగాల సంఖ్య, అందులో తెలంగాణ బిడ్డల సంఖ్య ఎప్పుడూ నిర్దిష్టంగా, కచ్చితంగా చెప్పే పరిస్థితి లేకుండా పోయింది. ఉమ్మడి రాష్ట్రంలో పన్నెండు లక్షల ప్రభుత్వోద్యోగాలలో, తెలంగాణకు జనాభా రీత్యా అయినా, విస్తీర్ణం రీత్యా అయినా ఐదు లక్షల ఉద్యోగాలు దక్కాలని, కాని రెండున్నర, మూడు లక్షల కన్న ఎక్కువ మంది తెలంగాణ బిడ్డలు ప్రభుత్వోద్యోగాలలో లేరని కె. జయశంకర్ మలిదశ ఉద్యమ ప్రారంభంలో అన్నారు. అలా, రాష్ట్రం విడిపోతే రెండు నుంచి రెండున్నర లక్షల ఉద్యోగాలు తెలంగాణ వారికి దక్కుతాయనే అభిప్రాయం ఏర్పడింది. ఉద్యమ నాయకులలో కొందరు ఈ అంకెను మూడు లక్షల దాకా కూడా పెంచి చెప్పారు. కాని 2014 నుంచి 2023 దాకా పది సంవత్సరాలలో టీఆర్ఎస్ – బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ రెండు–రెండున్నర–మూడు లక్షల సంఖ్యలో నికరంగా లక్ష ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదు. ఆ పది సంవత్సరాలలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంఖ్యే సంవత్సరానికి ఐదు వేల చొప్పున యాభై వేలు ఉంటుంది గనుక నియామకాల విషయంలో తెలంగాణ మొదటి పది సంవత్సరాలలో సాధించినది అతి స్వల్పమని చెప్పాలి.

అందువల్లనే నిరుద్యోగ యువతలో గత ప్రభుత్వం పట్ల తీవ్రమైన అసంతృప్తి చెలరేగింది. ఆ అసంతృప్తిని వాడుకోవడానికి కాంగ్రెస్ అసాధ్యమైన, కష్టసాధ్యమైన వాగ్దానాలు చేసింది. ఏడు నెలలు గడిచినా ఆ వాగ్దానాలు అమలు చేసే దిశగా పెద్ద కదలిక లేదు. చెప్పిన అంకె ప్రకారం ఉద్యోగాలు కల్పించలేకపోవడానికి కారణాలు ఉండవచ్చు. జాబ్ క్యాలెండర్ రూపొందించడం సంక్లిష్టమైన పని గనుక ఆలస్యం అవుతున్నదని అనుకోవచ్చు. రాయితీలు పొందుతున్న కార్పొరేట్ సంస్థలకు స్థానికులకు ఉద్యోగ కల్పన షరతు పెడుతున్నారో లేదో, స్వయం ఉపాధి పథకాల ప్రణాళికలు తయారవుతున్నాయో లేదో తెలియదు.

ఆ పెద్ద కదలికల సంగతి అలా ఉంచి, నిరుద్యోగులు కోరుతున్న చిన్న కోరికలు, ఎటువంటి ఆర్థిక భారం పడని కోరికలు తీర్చడానికి కూడా ప్రభుత్వం సిద్ధపడడం లేదు. పైగా ఆ కోరికలన్నీ గత ప్రభుత్వ రోజుల్లో కూడా వెలువడినవే, అప్పుడు కాంగ్రెస్ నాయకులు శాసనసభలోనూ, బైటా సమర్థించినవే. ఉదాహరణకు గ్రూపు 1 పరీక్షల మెయిన్స్‌కు 1:100 సూత్రం పాటించాలనేదేమీ గొంతెమ్మ కోర్కె కాదు. దాదాపు పన్నెండు సంవత్సరాల తర్వాత జరుగుతున్న, తమ వయసు మించిపోయే లోపల మరొక అవకాశం వస్తుందో రాదో తెలియని పరీక్ష రాసే అవకాశం ఇమ్మనే అతి సాధారణమైన కోరిక. అలాగే జూన్ 18 నుంచి ఆగస్ట్ 5 దాకా జరిగే డీఎస్‌సీ ప్రక్రియ తర్వాత ఒక్క రోజు విరామంతో గ్రూప్ 2 పరీక్ష ఉండడం వల్ల, రెండు భిన్నమైన సిలబస్‌లతో పరీక్షలకు తయారు కావడం కష్టమనీ, అందువల్ల డీఎస్‌సీని కొద్ది కాలం వాయిదా వేయమనీ అభ్యర్థులు అధికారుల, మంత్రుల, ముఖ్యమంత్రి చుట్టూ తిరుగుతూ బతిమిలాడుతున్నారు. గ్రూప్ 2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచాలనేది మరొక కోరిక. నిరుద్యోగులను ప్రతిపక్షాలో, కోచింగ్ సంస్థలో రెచ్చగొడుతున్నాయని ఆరోపించి, పోలీసు అణచివేతను ఉపయోగించి ఈ న్యాయమైన సమస్యలను, తామే 2023 ఎన్నికలకు ముందు సమర్థించిన కోరికలను తోసివేయడానికి వీలు లేదు. తమ మాట నెగ్గించుకోవాలనే పంతం తప్ప ఈ చిన్న కోరికలను అంగీకరించకపోవడానికి ఏ కారణమూ లేదు.

నిరుద్యోగులు గత పది సంవత్సరాలుగా ఎన్నో వాయిదాలు, ఆశాభంగాలు, అసంతృప్తులు, నిరసనలు, ఆందోళనలు, ఆత్మహత్యలు అనే భయానక విషవలయం దాటుకుని ఇక్కడికి చేరారు. మరొకసారి వారిని ఆ విషవలయంలోకి నెట్టడం భావ్యం కాదు. భారీ వాగ్దానాలు నిలుపుకోవడం లాంటి పెద్ద విషయాలు సరే, ఈ చిన్న విషయాలైనా పట్టించుకోవడం ప్రభుత్వ బాధ్యత.



> నిరుద్యోగులు గత పది సంవత్సరాలుగా ఎన్నో వాయిదాలు, ఆశాభంగాలు, అసంతృప్తులు, నిరసనలు, ఆందోళనలు, ఆత్మహత్యలు అనే భయానక విషవలయం దాటుకుని ప్రస్తుత పరిస్థితికి చేరారు. మరొకసారి వారిని ఆ విషవలయంలోకి నెట్టడం భావ్యం కాదు. భారీ వాగ్దానాలు నిలుపుకోవడం లాంటి పెద్ద విషయాలు సరే, ఆర్థికభారం పడని నిరుద్యోగుల చిన్న కోరికలనైనా పట్టించుకోవడం ప్రభుత్వ బాధ్యత.

• ఎన్.వేణుగోపాల్

సుస్థిర ప్రతిపక్షమే ప్రజాస్వామ్యానికి బలం

రాజకీయ పార్టీలు తమ సిద్ధాంతాలకు, కార్యక్రమాలకు ప్రజాదరణ సాధించాలంటే, వాటి ఆధారంగా సుస్థిరమైన ప్రభుత్వాలు నడపాలంటే కచ్చితంగా ఇతర పార్టీలతో, వాటి సిద్ధాంతాలతో, కార్యక్రమాలతో విభేదించి, చర్చించి ప్రజాక్షేత్రంలో మన్నన పొందాలి! ఈ పోటీతత్వమే ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాలను తెరపైకి తెస్తుంది.

ఐతే ఈ మధ్య కాలంలో ఇలాంటి ప్రజాస్వామిక ప్రయత్నాలను ఒక వ్యూహం ప్రకారం వమ్ముచేసి, ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసి, తద్వారా తామే ఏకైక ప్రత్యామ్నాయమన్న భావనను ప్రజలలో అధికార దుర్వినియోగం ద్వారా, మీడియా ఆధిపత్యం ద్వారా నాటాలన్న ధోరణి పెరిగిపోయింది. దీని పర్యవసానమే నేడు పార్టీలలో దృఢంగా ఏర్పడ్డ నియంతృత్వ నిర్ణయాధికార శైలి. దీనికి అప్రజాస్వామిక పార్టీ ఫిరాయింపుల ప్రోత్సాహం తోడైంది. ప్రధాన పార్టీలలో ఈ ఫిరాయింపులు ఎంత శ్రుతిమించాయంటే– ఎన్నికలలో తాము ఏ పార్టీల తరఫున గెలిచామో ఆ పార్టీలు ప్రభుత్వాలను ఏర్పరచలేకపోతే ఆ నాయకులు అధికార పార్టీలోకి మారడం అత్యంత సహజమైపోయింది.

వీటన్నిటికీ కారణం పార్టీలలో నిర్దిష్టమైన సిద్ధాంతాలకు తిలోదకాలివ్వడం. సుస్థిరమైన అభివృద్ధిని పక్కనపెట్టి గెలుపు కోసం ఏదైనా చేసే ధోరణి. పోల్ మేనేజ్‌మెంట్ పదం చాటున తీవ్రంగా డబ్బు ప్రమేయం. పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం, క్రమశిక్షణ, ఆత్మవిమర్శ పూర్తిగా లోపించడం. రాజకీయ పార్టీలు, నాయకులు తమ నిర్దిష్ట సిద్ధాంతాల ద్వారా, కార్యక్రమాల ద్వారా ప్రజాదరణ సాధించాలంటే ముందుగా వారు వాటికి కట్టుబడి ఉండాలి. ఇతర పార్టీల సిద్ధాంతాలు, కార్యక్రమాలకు తమ పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలకు మధ్య లక్ష్మణరేఖ గీయాలి.

ఈ లక్ష్మణ రేఖే పార్టీల మధ్య ఉన్న వ్యత్యాసాలను బహిర్గతం చేసి రాజకీయ విభజనకు, సంఘర్షణకు తెరలేపుతుంది. 'పోలరైజేషన్' అనేది సామాజిక శాస్త్రవేత్తల ప్రకారం 'సమాజం లేదా రాజకీయ వ్యవస్థలో ప్రధాన సమూహాల మధ్య ఏర్పడే ఒక ప్రముఖ విభజన లేదా సంఘర్షణ. రెండు వ్యతిరేక ధ్రువాల వద్ద అభిప్రాయాలు, నమ్మకాలు'. ఇక్కడే ఒక ప్రధానమైన అంశాన్ని మనం గమనించాలి: ఎప్పుడైతే పార్టీల మధ్య విభజన స్పష్టంగా ఉంటుందో అప్పుడు ప్రజా తీర్పు కూడా స్పష్టంగా వచ్చే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో పార్టీల విభజన తారాస్థాయికి చేరింది. ప్రజాస్వామ్యానికి దేశ రాజ్యాంగానికి ముప్పు వాటిల్లుతుందన్న ప్రతిపక్షాల వాదనకు అనూహ్య మద్దతు లభించింది. కాబట్టే దేశంలో అత్యంత శక్తిమంతమైన పార్టీగా అవతరించిన బీజేపీ స్వతహాగా ఆధిక్యత సాధించలేకపోయింది. ప్రతిపక్షాలు సాధించగలిగిన ఈ ఒక్క పరిణామం ప్రభుత్వ నియంతృత్వ పరిపాలనాశైలికి అడ్డుకట్ట కాబోతున్నది.



> రాజకీయ వ్యవస్థలలో ప్రధాన సమూహాల మధ్య ఏర్పడే సైద్ధాంతిక విభజన లేదా సంఘర్షణను విస్మరించి కృత్రిమంగా కేవలం పార్టీ ఫిరాయింపుల ద్వారా బలాన్ని తాత్కాలికంగా పెంచుకొన్న పార్టీలు విశ్వసనీయతను కోల్పోయి, రాజకీయంగా నష్టపోతున్నాయన్నది స్పష్టమవుతున్నది.

ఇక తెలంగాణ విషయానికి వస్తే ఈ సమూహాల లేక పార్టీల మధ్య విభజన, సంఘర్షణలు రాష్ట్ర సాధన ఉద్యమంలోను, ఆ తర్వాత 2014 నుంచి 2018 దాకా తారాస్థాయికి చేరుకొని టీఆర్ఎస్ పార్టీకి రెండుసార్లు ఘన విజయాలు సాధించిపెట్టాయి. 2018 నుంచి 2024 కాలంలో సంభవించిన పరిణామాలు గత ఎన్నికలలో ప్రతికూల వాతావరణాన్ని కల్పించాయి. దశాబ్ద కాలం పాటు అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్ష పార్టీలతో, వాటి సిద్ధాంతాలతో, కార్యక్రమాలతో విభేదించి, ప్రజాక్షేత్రంలో ప్రజల మన్నన పొందడంలో సఫలీకృతం కాలేకపోయింది. గతంలో రాష్ట్రోద్యమ నేపథ్యంలో ప్రజామోదం పొందిన తమ నిర్దిష్టమైన పార్టీ సిద్ధాంతాలకు, పారదర్శకతతో కూడిన ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు కట్టుబడి ఉండలేకపోయింది.

దీనిని బట్టి రాజకీయ వ్యవస్థలలో ప్రధాన సమూహాల మధ్య ఏర్పడే సైద్ధాంతిక విభజన లేదా సంఘర్షణను విస్మరించి కృత్రిమంగా కేవలం పార్టీ ఫిరాయింపుల ద్వారా బలాన్ని తాత్కాలికంగా పెంచుకొన్న పార్టీలు విశ్వసనీయతను కోల్పోయి, రాజకీయంగా నష్టపోతున్నాయన్నది స్పష్టమవుతున్నది. అయితే ఈ పరిస్థితిని ఆత్మవిమర్శతో, అంతర్గత చర్చలతో ఎదుర్కోవాల్సింది పోయి, తమ ఉనికిని కాపాడుకోవడానికి అనుకూల మీడియా సాధనాల ద్వారా ప్రజాభిప్రాయాన్ని తారుమారు చేసే విషవలయంలో పార్టీలు చిక్కుకున్నాయి. ఈ పరిస్థితి ప్రజాస్వామ్యాన్నే అపహాస్యం చేస్తున్నది. వీటన్నిటి పర్యవసానంగా ప్రతిపక్షంగా ఉండటమంటేనే దయనీయ పరిస్థితి అనే భావన పార్టీలలో, నాయకులలో, దురదృష్టవశాత్తూ పౌర సమాజంలో కూడా నాటుకుపోతున్నది. ఒక్కసారి గతాన్ని జ్ఞాపకం చేసుకుంటే, స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రత్యేక రాష్ట్రోద్యమం, ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం, మార్క్సిస్టు లెనినిస్టు ఉద్యమ నేపథ్యాలతో పాటు దళిత, మహిళా, విద్యార్థి యువజనోద్యమాలను ప్రతిబింబించే ప్రతిపక్షనేతలుగా వివిధ సైద్ధాంతిక భావజాలాలు కలిగి ఉన్నప్పటికీ తమ బలగం ఏర్పడింది మౌలిక ప్రజా సమస్యలపై పోరాటం కోసమని నమ్మి పౌరసమాజంతో పాటు అధికారపక్షాల మన్ననలను సైతం పొంది రాణించిన పుచ్చలపల్లి సుందరయ్య, ఆరుట్ల కమలా దేవి, తరిమెల నాగిరెడ్డి, గౌతు లచ్చన్న, కొండా లక్ష్మణ్ బాపూజీ, జైపాల్ రెడ్డి, చెన్నమనేని రాజేశ్వరరావు, వెంకయ్యనాయుడు... ఇంకా ఎంతోమంది ఈ తరం యువ ప్రజాప్రతినిధులకు స్ఫూర్తి కావాలి.

ఉమ్మడి రాష్ట్రం, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల చరిత్రను గమనిస్తే సుమారుగా ప్రతి విశ్వసనీయతగలిగిన ప్రతి అధికారపక్ష నాయకుడు, ముఖ్యమంత్రి ముందుగా ప్రతిపక్షం నుంచి ఉద్భవించినవాడే. అందుకే, ప్రజాస్వామ్యంలో సుస్థిరమైన ప్రతిపక్షం లేనిదే రాష్ట్రానికి, దేశానికి ప్రజలు కోరుకునే రాజకీయ ప్రత్యామ్నాయమే లేదు!

○ డా. చెన్నమనేని రమేష్
మాజీ శాసనసభ్యులు

తగువు పెట్టి లాభపడే అమెరికాతో జాగ్రత్త!

'దలైలామాకి జూన్ 23 నాడు స్వాగతం పలికి, అమెరికన్ ప్రభుత్వ వాహనంలో ఆయన్ని పెద్ద హోటల్‌కి తీసుకెళ్లారు' – అని 'వాయిస్ ఆఫ్ అమెరికా' వార్త. 2017 తర్వాత దలైలామాకి ఇదే మొదటి విదేశీయాత్ర. మోకాలి చికిత్స కోసం జూన్ 21 నాడు బయలుదేరి, స్విట్జర్లాండ్‌లో మధ్యలో ఆగి, అమెరికా చేరారు. ఈ వార్త భారతీయ, తెలుగు మీడియాల్లో పెద్దగా ప్రచారం కాలేదు. ఇంత హఠాత్తుగా గుట్టుగా ఇప్పుడే ఈ యాత్ర ఎందుకు చేయాల్సి వచ్చింది? మోకాలి చికిత్స ఇండియాలో లేదా? 88 ఏళ్ల వృద్ధుడికి అమెరికా యాత్ర ఎందుకు? ఆయన అమెరికాకి వస్తున్నాడని తెలిసిన అమెరికన్ ఎంపీల బృందం ఇండియా దాకా ఎందుకు వచ్చింది? ఈ ప్రశ్నలకు జవాబు జూన్ 21న బ్రహ్మ చెల్లాని రాసిన వ్యాసంలో ఉన్నది. ఈ చైనా వ్యతిరేక నిపుణుడు ఈ అవకాశాన్ని తీసుకొని బైడెన్ దలైలామాని కలిస్తే బాగుంటుందని, జిన్‌పింగ్ పథకాలకు వ్యతిరేకంగా అమెరికా ఇండియాతో కలిసి ఒక 'బహుముఖ వ్యూహా'న్ని రూపొందించాలనీ తన వ్యాసంలో సూచించారు.

అమెరికన్ ఎంపీల బృందం జూన్ 19 నాడు ఇండియా వచ్చి ధర్మశాలకి వెళ్లి దలైలామాను, ఆ మర్నాడు ప్రధాని మోదీని కలిసింది ఇలాంటి వ్యూహంలో భాగంగానే. దలైలామాతో పాటు టిబెట్ ప్రవాస ప్రభుత్వ బృందాన్ని కూడా కలిసి వారు చర్చలు జరిపారు. అంతకుముందు జూన్ 12నాడు టిబెట్ సమస్య పరిష్కారానికై అమెరికా పార్లమెంటులో ఒక బిల్లుని రెండు పార్టీల వారు కలిసి ఆమోదించే ప్రక్రియ ముగిసింది. ఈ బిల్లు ప్రతిని ఫోటో ఫ్రేమ్ కట్టి తెచ్చి దలైలామాకు ఇచ్చి ఆయనకు అమెరికా మద్దతు గట్టిగా ఉంటుందని వాగ్దానం చేశారు. టిబెట్ సమస్యపై దలైలామాతో చర్చలు జరపాలని, ఆయన వారసుడి నియామకంలో చైనా ప్రభుత్వానికి ఎలాంటి పాత్ర ఉండరాదని ఆ బిల్లులో ప్రకటించారు. కొంత బడ్జెట్‌ను కూడా కేటాయించారు. అతి త్వరలో బైడెన్ ఈ బిల్లుకి ఆమోదం తెలుపుతారని వార్త. దలైలామా వారసుడి నియామకంలో అమెరికాకి ఏం పాత్ర ఉంది? ఇందులో వారి జోక్యం ఏమిటి? దాని కోసం ఇండియా రావటం ఏమిటి?

మోదీ ప్రభుత్వం ఈ వ్యూహానికి అనుకూలంగా ఉందని చెప్పటానికి ఇదంతా స్పష్టమైన సిగ్నల్ అని ఒక అమెరికన్ వ్యాఖ్యాత రాశారు. అందుకే ప్రధానమంత్రి అధికారిక ప్రకటనలో దలైలామా ప్రస్తావన లేదు; కానీ అమెరికాతో 'వ్యూహాత్మక మైత్రి ప్రగతి' ప్రస్తావన ఉంది. దానికి అమెరికాలోని 'ఉభయ పార్టీల గట్టి మద్దతు కొనసాగుతుంది' అన్న సంతోషం విదేశాంగమంత్రి జయశంకర్ చేసిన ట్వీట్లో ఉంది. జూన్ 17–18 తేదీల్లోనే అమెరికా భద్రత సలహాదారు జేక్ సుల్లివాన్ బృందం జయశంకర్‌ను, ఇండియా భద్రత సలహాదారు అజిత్ దోవల్ని కలిసింది. దలైలామా రహస్య యాత్ర ఏర్పాట్లను వారు చర్చించే ఉంటారు.

అమెరికా ప్రతినిధుల్లో నాన్సీ పెలోసి ధర్మశాలలో బహిరంగంగా మాట్లాడి దలైలామాని ఆకాశానికెత్తి, చైనా అధ్యక్షుడిని 'నువ్వు ఎంతోకాలం ఉండవు, పోతావ్, నువ్వు సాధించిందేమీ లేదు' అని బహిరంగంగా తిట్టిపోసింది. 2022లో ఆమె జరిపిన తైవాన్ పర్యటన పెద్ద కల్లోలాన్ని సృష్టించి, అమెరికా – చైనా సంబంధాల్ని చెడగొట్టింది. ప్రస్తుత పరిణామాలు భారత – చైనా సంబంధాలను, సరిహద్దుల్లో శాంతిని దెబ్బతీసే అవకాశం ఉందని అమెరికన్ నిపుణుడు మైకేల్ కుగెల్మాన్ సూచించారు. అమెరికాతో అక్రమ సంబంధాలే భారత సరిహద్దుల్లో ఘర్షణకి దారితీసి ఉంటాయని లోగడ రాశారు. భారత చైనాల మధ్య తగవుపెట్టి లాభపడే అమెరికా వైఖరిపట్ల జాగ్రత్తగా ఉండాలి అని చైనాపత్రిక గ్లోబల్ టైమ్స్ (2023 ఏప్రిల్ 26) లోగడ వ్యాఖ్యానించింది. భారత – చైనా సంబంధాల్లో దలైలామా పాత్ర గయోపాఖ్యానం వంటిదని ప్రముఖ విప్లవకవి జ్వాలాముఖి వివరించేవారు.

రానున్న అమెరికా ఎన్నికల తరుణంలో 'ఉభయుల' ప్రస్తావనకి ప్రాముఖ్యత ఉంది. పైకి ఎన్ని తగవులున్నా ఇండియా పాలకుల్లోనూ అమెరికా సేవ పట్ల ద్వైపాక్షిక ఐక్యత ఉంది: కాంగ్రెస్ ముఖ్యనేత శశి థరూర్ బృందం ఎన్నికల తుదిఘట్టంలో మే 30 నాడు వెళ్లి దలైలామా బృందాన్ని కలిశారు. ఆయన విదేశాంగ శాఖలో మంత్రిగానూ యునైటెడ్ నేషన్స్‌లోనూ పని చేశారు.

దలైలామా కేవలం ఒక ధార్మికగురువు, ఆయనకు రాజకీయ పాత్ర ఏమీలేదు, ఆ పాత్రకి అనుమతి లేదని విదేశాంగ శాఖ ప్రకటించింది. కానీ, పైదంతా రాజకీయమేకదా! అమెరికా ప్రతినిధులు దలైలామాను కలిసి రాజకీయం చేశారు కదా అంటే దానికి వారినే ప్రశ్నించాలి అని ఆ శాఖ ప్రతినిధి దాటవేసారు (టైమ్స్ ఆఫ్ ఇండియా, జూన్ 22).

భారత చైనాల మధ్య ప్రత్యక్ష మీడియా సంబంధాల్లేక, పాశ్చాత్య మీడియాపైనే మొత్తం ఆధారపడే పరిస్థితి ప్రస్తుతం ఉన్నది. చైనా వార్తా సంస్థ 'Xinhua'కు చెందిన ముగ్గురు విలేఖరులని 2016లో మన దేశం నుంచి పంపించేశారు. వీసాలను పొడిగించకుండా జర్నలిస్టులను పంపించివేసే పద్ధతిని అనుసరిస్తున్నారని, 2020 తర్వాత 14 మంది ఉండే చోట ఒక్కరే మిగిలారని చైనా నిపుణులు అనురాగ్ విశ్వనాథ్ ప్రకటించారు. ప్రభుత్వాన్నీ ఎండగట్టే వార్తలు వస్తే బీబీసీకైనా తిప్పలు తప్పలేదు.

కర్ణాటకలోని బైలెకుప్పలో బౌద్ధ ధార్మిక యూనివర్సిటీకి, ముండుగోడులో మరో బౌద్ధ పీఠంకి చెందిన టిబెటన్లను Xinhua విలేఖరులు 2016 ఏప్రిల్లో కలిశారట. ఒక బౌద్ధ తెగవారు దలైలామాను వ్యతిరేకిస్తున్నారని, ఈ తెగకి చెందిన వందలాదిమంది అనేక దేశాల్లో దలైలామా వ్యతిరేక ప్రదర్శనలు నిర్వహించారని వార్త. దలైలామాపై నిరంకుశత్వం, బంధుప్రీతి, మతవిద్వేషం, అవినీతి తదితర ఆరోపణలు చేశారు. అలాంటివారిని కలిసినందువల్ల భారతప్రభుత్వం Xinhua విలేఖరులను సాగనంపిందని, ఈ విషయంలో ఒక పాశ్చాత్య సంస్థ పాత్ర ఉందని ఎకనామిక్ టైమ్స్ పత్రిక (2016 జులై 28) వెల్లడించింది.

టిబెట్టుని ఒక దేశంగా ప్రపంచంలో – అమెరికా ఇండియా యూరోపుల్లో ఏ ఒక్కరూ – గుర్తించరు. అయినా చాటుమాటు సంబంధాలు పెట్టుకుని చైనాని వ్యతిరేకించటానికి దలైలామాను పావుగా వాడుకుంటూ ఉంటారు. 2010 ఫిబ్రవరి 19నాడుదలైలామా అధ్యక్షుడు ఒబామాను కలిసి దొడ్డిదారిగుండా బయటికి వెళుతున్న ఫోటోని అమెరికా పత్రిక 'క్రిస్టియన్ సైన్స్ మానిటర్' ప్రచురించింది. అలాంటి దొడ్డిదారి సంబంధాలే ప్రభుత్వాలతో ఆయనకి నేటికీ ఉన్నాయి. ఇప్పుడు బైడెన్ కూడా అలాగే దలైలామాను కలవాలి అని బ్రహ్మ చెల్లాని సూచించారు. దలైలామా అమెరికా చేతిలో పావు అని; సీఐఏ సంబంధాలు, నిధులు ఉన్నాయని వారే అంగీకరించిన వార్తలు వెలువడ్డాయి. యుద్ధం దాకా వెళ్లకపోయినా 'టిబెట్ కార్డు'ని ఇండియా ప్రయోగించాలి అని నిపుణులు చెబుతూ ఉంటారు. అది మంచిది కాదని, కాశ్మీర్‌ని ఈశాన్యం సమస్యని ఉపయోగించుకొని ఒక్క టిబెట్టు కార్డుకి ప్రతిగా చైనా ఆరు కార్డుల్ని ఉపయోగించగలదని చైనా నిపుణులు అల్కా ఆచార్య (జేఎన్‌యూ) లోగడ వ్యాఖ్యానించారు. అయినా ఈ వ్యవహారంలో మోదీ ప్రభుత్వం ఒకడుగు ముందుకు వేసిందని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని వ్యాఖ్యాతలు చెప్పారు.

అమెరికా భద్రతాశాఖ అధికారి జాన్ కిర్బీ జూన్ 17నాడు వాషింగ్టన్‌లో 'ఇదంతా మన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టపరుస్తుంది. ఇంకా ఇండో–పసిఫిక్ ప్రాంతాన్ని మరింత సంపద్వంతం చేస్తుంది' అన్నారు. అమెరికా వ్యూహం ఆయుధ రంగ మృత్యుబేహారులకు వేలాదికోట్ల లాభం చేకూర్చదా మరి! అందులో మన అంబానీ, అదానీ, టాటాలు ఉంటారు. అందుకే రక్షణ రంగంలో ఎఫ్‌డీఐని ప్రైవేటురంగాన్ని వందశాతం అనుమతించారు. అమెరికా ఇండియాలది చైనాతో ప్రస్తుతానికి వాణిజ్య సమరమే; అయితే దానికి దోహదకారిగా రక్షణ మౌలిక వసతులతో పాటు ఏటా 7లక్షల కోట్ల రూపాయల రక్షణ బడ్జెట్ ఉన్నది. లక్ష కోట్ల రూపాయల రక్షణ శాఖ ఎగుమతి లక్ష్యం ఉన్నది. ప్రపంచంలోనే నెంబర్ త్రీగా భారత్ ఎదగటానికి ఇది దోహదం చేస్తుంది మరి!

అమెరికా, కొన్ని యూరప్ దేశాలూ తమ ఆయుధవ్యాపారాల్ని – ఉక్రెయిన్, ఇజ్రాయెల్ యుద్ధాలు, చైనాతో కయ్యం ద్వారా – కొనసాగించుకుంటూనే, చైనాతో వ్యాపారాలూ చేస్తున్నాయి. అమెరికా వ్యూహానికి మన దేశ విధానాల్ని లోబరచి, చైనాతో వైరం కొనసాగించి, మన పాలకులు ఇక్కడా అదే పని చేయాలనుకొంటున్నారు. ఇది మన దేశానికీ, ప్రజలకూ, అభివృద్ధికీ, దక్షిణాసియాలో శాంతికీ హానికరం. ఈ విధానాల్ని గట్టిగా వ్యతిరేకించాలి.

> అమెరికా, కొన్ని యూరప్ దేశాలూ తమ ఆయుధవ్యాపారాల్ని – ఉక్రెయిన్, ఇజ్రాయెల్ యుద్ధాలు, చైనాతో కయ్యం ద్వారా – కొనసాగించుకుంటూనే, చైనాతో వ్యాపారాలూ చేస్తున్నాయి. అమెరికా వ్యూహానికి మన దేశ విధానాల్ని లోబరచి, చైనాతో వైరం కొనసాగించి, మన పాలకులు ఇక్కడా అదే పని చేయాలనుకొంటున్నారు. ఇది మన దేశానికీ, ప్రజలకూ, అభివృద్ధికీ, దక్షిణాసియాలో శాంతికీ హానికరం.



■ ఎమ్. జయలక్ష్మి
'ఆప్కాబ్' రిటైర్డ్ ఏజీఎం


రైతుభరోసాపై ఉమ్మడి జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రులు, తదితరులు

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పకడ్బందీగా.. పారదర్శకంగా..

- అర్హులైన అన్నదాతలందరికీ రైతు భరోసా
- అందుకే రైతుల నుంచి అభిప్రాయ సేకరణ
- వారు చెప్పిందే అమలవుతుంది.. జీవోగా వెలువడుతుంది
- గత ప్రభుత్వంలో రైతుబంధు దుర్వినియోగం
- రైతు భరోసా సదస్సులో డిప్యూటీ సీఎం, మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ భట్టి విక్రమార్క
- హనుమకొండ కలెక్టరేట్‌లో రైతు భరోసాపై సదస్సు
- హాజరైన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు
- పలువురు ఉమ్మడి జిల్లా రైతుల నుంచి అభిప్రాయాల సేకరణ
- రెండున్నర గంటల పాటు సాగిన సమావేశం

హనుమకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకాన్ని పారదర్శకంగా.. పకడ్బందీగా అమలు చేసి అర్హులైన రైతులందరికీ భరోసాను అందిస్తామని, గత ప్రభుత్వ హయాంలో జరిగినట్టు కాకుండా ప్రజాధనం దుర్వినియోగం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి, రైతు భరోసా మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రైతు భరోసా అమలుపై మంత్రివర్గ ఉపసంఘం నిర్వహిస్తున్న ఉమ్మడిజిల్లాల స్థాయి విస్తృత సమావేశాల్లో భాగంగా సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో వరంగల్ కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సుమారు 250 మంది రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సదస్సుకు భట్టి విక్రమార్కతో పాటు మంత్రి వర్గ ఉపసంఘం సభ్యులైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. తొలుత ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల నుంచి వచ్చిన రైతులు, రైతు సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల నుంచి నిర్ణీత ఫారమ్‌లో పేర్లు, వివరాలు తీసుకున్నారు. వారిలో నుంచి ర్యాండమ్‌గా ఎంపిక చేసిన వారి నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఒక గుంట భూమి కలిగిన రైతు నుంచి 10ఎకరాల వరకు ఉన్న రైతులందరికీ రైతుభరోసా అమలు చేయాలని, కౌలు రైతులకు కూడా పథకాన్ని వర్తింపజేయాలని మెజారిటీ రైతులు తమ అభిప్రాయాలు వినిపించారు. వారి అభిప్రాయాలను మంత్రివర్గ ఉపసంఘం నమోదు చేసుకుంది. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రైతు భరోసా అమలుపై క్షేత్ర స్థాయిలో రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్న ఉపసంఘం రైతులు చెప్పిన అభిప్రాయాలన్నిటినీ క్రోడీకరించి అసెంబ్లీలో ప్రవేశపెడుతుందని, అక్కడ కూలంకశంగా చర్చించిన తర్వాత అమలు చేస్తుందన్నారు. అభిప్రాయసేకరణ సందర్భంగా రైతులు ఏం చెప్పారో అదే అమలవుతుందని, అదే జీవోగా వస్తుందన్నారు. రైతు భరోసా అమలు విషయంలో ఎలాంటి ఆంక్షలు ఉండవని, ఈ విషయంలో ప్రభుత్వం


సమావేశానికి హాజరైన ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు, సంఘాల ప్రతినిధులు

మిగతా 7వ పేజీలో..



అర్హులెందరో?

రైతు రుణమాఫీకి ప్రభుత్వ మార్గదర్శకాల జారీతో మొదలైన చర్చ

- అమలుకు రేషన్‌కార్డు ప్రామాణికంపై రైతుల్లో ఆందోళన
- ప్రతీ కుటుంబానికి అసలు, వడ్డీ కలిపి రూ.2లక్షలు మాఫీ
- ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు చెల్లించేలా సర్కారు ప్రణాళిక
- సహకార సంఘాలు, ప్రభుత్వ బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులకు వర్తింపు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8.90లక్షల మందికి పైగా రైతులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రైతు రుణమాఫీపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పంద్రాగస్టులోపు ఒక రైతు కుటుంబానికి రూ.2 లక్షల రుణాన్ని మాఫీ చేసే కసరత్తును సర్కారు మరింత వేగిరం చేసింది. దీంతో సహకార సంఘాలు, జాతీయ బ్యాంకుల్లో 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ వరకు పంట రుణాలు తీసుకున్న రైతుల్లో ప్రతీ కుటుంబానికి అసలు, వడ్డీ కలిపి రూ.2లక్షల రుణం మాఫీ కానుంది. దీనిపై సోమవారం ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కావడంతో అధికారులు అర్హులను గుర్తించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా.. రుణమాఫీకి రేషన్‌కార్డును ప్రామాణికంగా పెట్టడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అసలు ఈ మాఫీ పథకానికి ఎవరెవరు అర్హులవుతారు? ఎంతమంది అర్హులుగా గుర్తించబడతారనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 8.90లక్షల మంది రైతులు ఉండగా, ప్రభుత్వ విధివిధానాల మేరకు ఎంతమందికి రుణమాఫీ వర్తిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

ప్రభుత్వ మార్గదర్శకాల్లో కీలకమైనవి ఇవే..

ఎన్నికల హామీని నెరవేర్చడమే లక్ష్యంగా కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పంద్రాగస్టులోపు పక్కాగా రూ.2లక్షల రుణమాఫీ చేయాలనే పట్టుదలతో

మిగతా 7వ పేజీలో..

మత్తుకు బానిసలు కావొద్దు : సీపీ


మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

శంభునిపేట, జూలై 15 : గంజాయి లాంటి మత్తు పదార్థాలకు యువత బానిసై, బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై మామునూరు పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో సదస్సు నిర్వహించారు. సీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ.. క్షణికానందం కోసం మత్తు పదార్థాలను అలవాటు చేసుకోవద్దన్నారు. కొందరు డబ్బు సంపాదన కోసమే గంజాయి లాంటి మత్తు పదార్థాలను విక్రయించొద్దని హితవు పలికారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై దృష్టిపెట్టాలని సీపీ సూచించారు. గంజాయి, మత్తుపదార్థాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో గంజాయి నియంత్రణకు డ్రగ్స్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మత్తు పదార్థాలు అమ్మినా, సేవించినా 87125 84473 మొబైల్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఈస్ట్‌జోన్ డీసీపీ పి.రవీందర్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో మామునూరు, ఎస్‌బీ ఏసీపీలు తిరుపతి, జితేందర్‌రెడ్డి, మామునూరు, ఏనుమాముల సీఐలు రవికుమార్, పులి రమేష్, వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ సయ్యద్ ముస్తాక్ అహ్మద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతి, మామునూరు, సంగెం ఎస్‌లు శ్రీకాంత్, సురేష్ పాల్గొన్నారు.


వాననీటితో చెరువును తలపిస్తున్న హనుమకొండ బస్టాండ్

విస్తారంగా వాన

- ఉమ్మడి జిల్లాలో పలు చెరువులకు జలకళ
- పలుచోట్ల ఉప్పొంగిన వాగులు

దీప్తా కుల సుందరి అలంకారంలో భద్రకాళి

పదో రోజుకు చేరిన శాకంబరీ ఉత్సవాలు

వరంగల్ కల్చరల్, జూలై 15: భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో అంగరంగ వైభవంగా శాకంబరీ ఉత్సవాలు సాగుతున్నాయి సోమవారం వేడుకలు పదో రోజుకు చేరాయి. అమ్మవారిని దీప్తా కుల సుందరిగా అలంకరించారు. శాకంబారీ ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ ఎండీ కృష్ణవేణి, ఉప కమిషనర్ టి.కాంతారావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శేషుభారతి అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని వారికి అందజేశారు. ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రాయల సునీత, ఆలయ సిబ్బంది విజయ్, కూచన హరినాథ్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం వస్తారని హడావిడి..

అమ్మవారి దర్శనార్థం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వస్తారని సమాచారం రావడంతో ఆదివారం రాత్రి నుంచి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాట్ల హడావిడి చేశారు. ఉదయం 10 గంటలకు దర్శించుకుంటారని షెడ్యూల్ సమాచారం ఇచ్చారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మంత్రి పర్యటన ఆలస్యం కావడంతో ఆలయానికి వచ్చే ప్రోగ్రాం రద్దయింది. గర్భాలయం ముందువీఐపీల రాకదృష్ట్యా భక్తుల దర్శన లైన్లను మరికొంత వెనక్కి జరిపి వీఐపీలు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయాన్ని అందంగా తీర్చి దిద్ది రెడ్ కార్పొరేట్లు సైతం ఏర్పాటు చేశారు. మీడియా, పోలీసులు కూడా మంత్రుల రాక కోసం ఎదురు చూసి ప్రోగ్రాం రద్దయిందని తెలవడంతో వెళ్లిపోయారు.


దీప్తా కులసుందరి అలంకారంలో అమ్మవారు

గ్రేటర్ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ షురూ

- హాజరైన 134 మంది ఉద్యోగులు
- మరో రెండు రోజులు పత్రాలు పరిశీలన


ఉద్యోగ బదిలీల ప్రక్రియలో పాల్గొన్న బల్దియా సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, జూలై 15 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని వరంగల్ బల్దియా కార్యాలయం, కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు సోమవారం ఉద్యోగ బదిలీలకు కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలైంది. హనుమకొండ కుడా కార్యాలయం ఆవరణలోని రాష్ట్ర పురపాలక శాఖ రిజినల్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ జరిగింది. ముందుగా సీనియర్ అసిస్టెంట్లు, తర్వాత సీనియర్ అకౌంటెంట్లు, హెల్త్ ఆఫీసర్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్టు వరంగల్ ఆర్‌డీఎంఏ షాహిద్ మసూద్ వెల్లడించారు. ఈ సందర్భంగా షాహిద్ మసూద్ మాట్లాడారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 94మంది సీనియర్ అసిస్టెంట్లు, 10మంది సీనియర్ అకౌంటెంట్లు, 30మంది హెల్త్ అసిస్టెంట్లకు మొత్తంగా 134మందికి కౌన్సెలింగ్ నిర్వహించినట్టు వెల్లడించారు. బల్దియా పరిధిలో పని చేసిన వంద శాతం ఉద్యోగులలో 40శాతం ఉద్యోగులను హైదరాబాద్ అధికారుల ఆదేశాల మేరకు బదిలీలు జరుగుతాయని తెలిపారు. అంతే కాకుండా ఒకే చోట మూడు నుంచి ఆపైన ఎక్కువ సంవత్సరాలు పని చేసిన ఉద్యోగులకు సీనియారిటీ ఆధారంగా బదిలీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కౌన్సెలింగ్‌లో భాగంగా ఉద్యోగుల నుంచి డాటా ఎంట్రీ, సీనియారిటీని ఆప్షన్ పత్రాల ద్వారా తీసుకుని హైదరాబాద్ సీడీఎంఏకు పంపిస్తామని చెప్పారు. వారి మార్గదర్శకాల మేరకు ఉద్యోగుల బదిలీలు జరుగుతాయన్నారు. ఇంకా వైద్య పరమైన మేజర్ సమస్యలు ఉన్నవారికి, ప్రభుత్వ గుర్తింపు కలిగిన యూనియన్ ముఖ్య నాయకులకు బదిలీల నుంచి ఉపశమనం కలిగించే అవకాశాలు ఉన్నట్టు తెలిపారు. మరో రెండు రోజుల పాటు బల్దియా ఉద్యోగుల బదిలీలకు సంబంధించి వివరాల పరిశీలన చేసిన తర్వాత హైదరాబాద్‌కు జాబితాను పంపించడం జరుగుతుందని షాహిద్ మసూద్ తెలిపారు. ఈ బదిలీల ప్రక్రియలో ఆర్‌డీఎంఏతో పాటు కార్యాలయ పర్యవేక్షణాధికారి శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

జయహో.. జగన్నాథ..

- నగరంలో శోభాయమానంగా కొనసాగిన రథయాత్ర
- హనుమకొండ నుంచి వరంగల్ వరకు సాగిన శోభాయాత్ర

వరంగల్ కల్చరల్, జూలై 15: జై జగన్నాథ్.. జైజై జగన్నాథ్ అంటూ బలరామ, సుభద్ర, జగన్నాథుడు సహిత జగన్నాథ రథయాత్ర సోమవారం ఘనంగా సాగింది. ఇస్కాన్ వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి వరంగల్ వెంకటేశ్వర గార్డెన్ వరకు రథయాత్ర సాగింది. ప్రధాన రహదారి నుంచి భజనలతో జై జగన్నాథ్ నామస్మరణతో మార్మోగింది. ఇస్కాన్ ప్రధాన కేంద్రం నుంచి స్వామి సుఖదేవ్ మహారాజ్ హాజరయ్యారు. వెంకటేశ్వర గార్డెన్‌లో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు రథయాత్రలో పాల్గొన్న అనంతరం వెంకటేశ్వర గార్డెన్‌లో జరిగిన ఆధ్యాత్మిక సత్‌సంఘంలో పాల్గొన్నారు. మహా మంగళహారతి, నైవేద్యాల నివేదన నిర్వహించిన అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. రథయాత్ర సందర్భంగా శ్రీకృష్ణుడికి సంబంధించిన పుస్తకాలు, ఫొటోలను ప్రత్యేక స్టాల్‌లో ఏర్పాటు చేశారు. పోలీసులు రథయాత్ర బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నిర్వాహకులు ప్రభుపాదదాస పాల్గొన్నారు.


వెంకటేశ్వర గార్డెన్‌లో జగన్నాథుడికి ప్రత్యేక పూజలు


శోభాయాత్రలో పాల్గొన్న స్వామి సుఖదేవ్ మహారాజ్

బీఈడీ, డైట్ ప్రిన్సిపాల్‌గా వాసంతి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 15 : హనుమకొండలోని ప్రభుత్వ బీఈడీ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలను డి. వాసంతికి అప్పగిస్తూ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీఈడీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి. అబ్దుల్ హై అనారోగ్య కారణాల రీత్యా రెండు నెలల పాటు సెలవులో వెళ్లగా, డైట్ ప్రిన్సిపాల్ కె. నారాయణరెడ్డి సెలవులో వెళ్లారు. దీంతో వాసంతికి రెండు కళాశాలల ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, ఇప్పటికే ఆమె వరంగల్, హనుమకొండ జిల్లాల విద్యాశాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

బాలుడి మృతిపై విచారణకు ఆదేశం

వరంగల్ మెడికల్, జూలై 15 : కుక్క కాటుకు ఆర్ఎంపీ చేసిన వైద్యం వికటించి ఓ పదేళ్ల బాలుడు మృతి చెందడంతో విచారణకు ఆదేశించారు. వరంగల్ జిల్లా ముదిగొండ గ్రామానికి చెందిన బాలుడు మణిదీప్(10)కు కుక్క కరవడంతో స్థానికంగా ఉండే ఆర్ఎంపీ అశోక్ దగ్గరకు తీసుకెళ్లగా ఇంజక్షన్ వేశారు. వెంటనే బాలుడు కుప్పకూలడంతో హుటాహుటినా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన ఎంజీఎం వైద్యులు బాలుడు మృతి చెందినట్లు ధృవీకరించారు. వైద్యుడు, ఆర్ఎంపీ అశోక్ యాంటీ రాబిస్ వ్యాక్సిన్ ఇంజక్షన్ వేయడంతో వికటించి మణిదీప్ మృతి చెందాడు. దీంతో వివిధ మాధ్యమాల ద్వారా తెలుసుకున్న తెలంగాణ వైద్య మండలి (టీజీఎంసీ) వెంటనే స్పందించి సుమోటోగా స్వీకరించింది. వరంగల్ జిల్లా యాంటీ క్వాకరీ బృందానికి సంఘటనపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని చైర్మన్ డాక్టర్ మహేశ్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య ఆదేశాలు జారీ చేశారు. వరంగల్ టీజీఎంసీ సభ్యులు డాక్టర్ శేషుమాధవ్, పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వి.నరేశ్ కుమార్, రాష్ట్ర ఐఎంఏ వైస్ ప్రసిడెంట్ డాక్టర్ అశోక్‌రెడ్డి, వరంగల్ ఐఎంఏ ప్రసిడెంట్ డాక్టర్ అన్వర్‌మియా, వరంగల్ హెచ్ఆర్‌డీఏ అధ్యక్షులు డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రాకేశ్ నేతృత్వంలోని వైద్య బృందం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి త్వరలో విచారణ చేయనుంది.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల జీవో జారీ

బాలసముద్రం, జూలై 15: రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌శాఖలో బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు శాఖ కమిషనర్ బుద్ధ ప్రకాష్ సోమవారం జీవో జారీ చేశారు. జూనియర్ అసిస్టెంట్, క్యాషియర్, టైపిస్టు, అటెండర్లకు మాత్రమే బదిలీలకు షెడ్యూల్ విడుదల చేశారు. ఒకే స్థానంలో రెండు సంవత్సరాలు సర్వీసు కలిగిన ఉద్యోగులు బదిలీలకు అర్హులు. నాలుగు సంవత్సరాల సర్వీసు ఒకే స్థానంలో పూర్తి చేసుకున్నవారికి తప్పనిసరిగా స్థానచలనం ఉంటుంది. కాగా, మంగళవారం లోగా ఉద్యోగులు జాబితా పంపించాలని జీవోలో పేర్కొన్నారు. 20వ తేదీ వరకు బదిలీల ప్రక్రియ పూర్తి చేయనున్నారు. మిగతా క్యాడర్ల బదిలీల జీవో ఒకటి, రెండు రోజుల్లో జారీ అయ్యే అవకాశం ఉంది.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గొడవ

ఓ భూమి విషయంలో హనుమకొండ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం గొడవ జరిగినట్లు సమాచారం. నగరంలోని సుబేదారి ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు ఆలయ నిర్మాణం కోసం ప్రైవేట్ వ్యక్తి వద్ద 300 గజాల స్థలం కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకుని కొంత డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. మిగతా డబ్బులు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. అగ్రిమెంట్ చేసుకున్నవారు రిజిస్ట్రేషన్ చేసుకునే విషయంలో జాప్యం చేయడంతో పట్టాదారు వేరే వారికి ఆ స్థలం విక్రయించినట్లు సమాచారం. సోమవారం రిజిస్ట్రేషన్ ఉందని సమాచారం ఇచ్చినట్లు సమాచారం తెలుసుకొని మొదట అగ్రిమెంట్ చేసుకున్నవారు కార్యాలయానికి వచ్చి పట్టాదారులు, అధికారులతో గొడవకు దిగినట్లు తెలిసింది. వారించినా వినకపోవడంతో అధికారులు కాజీపేట పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు సమాచారం. పోలీసులు కార్యాలయానికి వచ్చి గొడవచేసిన వారిని పంపించినట్లు తెలిసింది. గొడవ చేసినవారిపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కాజీపేట స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గొడవ చేస్తున్నప్పుడు తీసిన వీడియో రికార్డింగ్‌లను పోలీసులకు ఇచ్చినట్లు శాఖ అధికారులు తెలిపారు.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో జేఆర్ఎఫ్ సాధించిన రవిస్వామి

కేయూ క్యాంపస్, జూలై 15: కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో జాతీయ స్థాయి జేఆర్ఎఫ్, నెట్ సాధించి అత్యున్నత ప్రతిభ చూపిన నామాల రవిస్వామికి వర్సిటీ పీహెచ్‌డీ అడ్మిషన్ కల్పించింది. ఈ మేరకు సోమవారం కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కేయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్ఆర్ఎం విభాగాధిపతి డాక్టర్ పెదమల్ల శ్రీనివాసరావులు యూజీసీ నెట్, జేఆర్ఎఫ్ విభాగంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పీహెచ్‌డీ అడ్మిషన్ పత్రాన్ని అందచేసి అభినందించారు. నామాల రవిస్వామి 'ప్రాబ్లమ్స్ అండ్ ప్రాస్పెక్ట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజబిలిటీ (పీడబ్ల్యూడీ)స్టూడెంట్స్ ఇన్ హైయర్ ఎడ్యుకేషన్-ఏ స్టడీ ఆఫ్ సెలక్ట్ యూనివర్సిటీస్ ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై ప్రొఫెసర్ పెదమల్ల శ్రీనివాసరావు పర్యవేక్షణలో పరిశోధన చేయనున్నారు. ఆదిలాబాద్‌కు చెందిన రవిస్వామి చిన్ననాటి నుంచి చూపు సమస్యను ఎదుర్కొని పట్టుదలతో జాతీయ స్థాయి నెట్, జేఆర్ఎఫ్ సాధించడం పట్ల వర్సిటీ ప్రొఫెసర్లు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేర్చాలి

రెడ్డికాలనీ, జూలై 15: తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర కో ఆర్డినేషన్ కన్వీనర్ గోధుమల కుమారస్వామి అన్నారు. సోమవారం ములుగురోడ్‌లోని ముస్లిం మైనార్టీ ఫంక్షన్‌హాలులో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన తొలితరం ఉద్యమకారుడు డాక్టర్ అనీక్ సిద్ధికి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కళాకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ రంగాల కార్మికులు, మేధావులు, సబ్బండ వర్గాలు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా ఉద్యమాన్ని నిర్మించాయన్నారు. ఆత్మ బలిదానాలతో ఆనాటి ప్రభుత్వ అణచివేతను ఎదుర్కొని ప్రత్యేక రాష్ట్రం సాధించడం జరిగిందన్నారు. ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక గ్రేటర్ వరంగల్ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మాజీ కార్పొరేటర్ మహ్మద్ నయీం, అధ్యక్షులుగా డాక్టర్ కేడల ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మీర్జా అంజాద్, గోపనబోయిన రాజు, దుర్గాదాస్, నవరత్న ఆనంద్, నాగపురి శ్రీనివాస్, ధర్మపురి రామారావు, తెలంగాణ కొమురయ్య, ఐతం నగేష్, చెరుకు ప్రవీణ్ కుమార్, ప్రకాశ్, సుధాకర్, పోలేపాక సతీష్ ఎన్నికయ్యారు.

గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా

ఏటూరునాగారం రూరల్, జూలై 15: గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరించి వారికి మెరుగైన సేవలందించేందుకు సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్‌ను నిర్వహించారు. గిరిజనుల నుంచి పీవో వినతులు స్వీకరించారు. మొత్తం 42మంది గిరిజనులు తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఐఐటీ హైదరాబాద్‌లో ఇంజనీరింగ్‌లో తనకు సీటు వచ్చిందని, చదువు కోసం ఆర్థికసాయం అందించాలని ములుగు మండలం అన్నంపల్లి గ్రామానికి చెందిన పోరిక రాహుల్ వినతిపత్రం అందజేశారు. మహాదేవపూర్ మాడ పరిధిలో అత్యధికంగా నివాసం ఉంటున్న గిరిజనులకు ఇసుక సొసైటీ ఏర్పాటుచేసి తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని పలిమెల మండలం పంకెన గ్రామానికి చెందిన సుధాకర్ విన్నవించారు.



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న పీవో చిత్రమిశ్రా

గ్రామంలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఏటూరునాగారం మండలం గుర్రాలబావికి చెందిన గొత్తికోయ వాసులు సోలం దేవయ్య వినతిపత్రం అందించారు. మంగపేట మండలం మల్లూరులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ధర్మకర్తలుగా గిరిజనులనే నియమించాలని ఆ గ్రామానికి చెందిన యాలం రాజశేఖర్ కోరారు. కాకతీయ మహిళా పొదుపు సంఘం ఆధ్వర్యంలో వైటీసీ ఏటూరునాగారంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఇచ్చిన శిక్షణ కాలంలో భోజనాలు అందించామని, వాటికి సంబంధించిన బిల్లులు ఇవ్వాలని సంఘం సభ్యులు కోరారు. జీఎన్ఎం కోర్సు పూర్తి చేశానని, ఏదైనా వైద్యశాలలో ఏఎన్ఎంగా ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగం ఇప్పించాలని వాజేడు మండలం కొంగాల గ్రామానికి చెందిన తాటి దేవిక, గడ్డం రాధిక విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఏవో దామోదరస్వామి, ఎస్‌వో రాజ్‌కుమార్, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా.. పారదర్శకంగా..



5వ పేజీ తరువాయి

పూర్తిగా ఓపెన్‌మైండ్‌తో ఉందన్నారు. కౌలు రైతులకు కూడా పూర్తి న్యాయం చేస్తామని, అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, ఆరు గ్యారెంటీలైన మహిళలకు ఉచిత బస్సు రవాణా, రూ.500కే గ్యాస్‌సిలిండర్, జీరో కరెంట్ బిల్లు అమలవుతున్నాయని, ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం కూడా మొదలవుతోందన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక దఫా పంట సాయం చెల్లించామని, ప్రస్తుతం రైతు భరోసా అమలుకు కసరత్తు జరుగుతోందని, తమది ప్రజాప్రభుత్వమని, ప్రజల సొమ్ము.. ప్రతీ పైసా వారికే చెందుతుందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు మళ్లీ జరగకుండా తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళతోందన్నారు.

వ్యవసాయానికి పెద్దపీట : మంత్రి తుమ్మల



రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్ద పీట వేస్తోందని, సోనియా, రాహుల్ గాంధీల సూచనల మేరకు రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. తాము అధి కారంలోకి వచ్చాక రైతుల ఖాతాల్లో రూ.7662 కోట్లను పెట్టుబడిసాయంగా జమ చేశామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే వరంగల్‌లో రైతు డిక్లరేషన్ జరిగిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన.. ఆ డిక్లరేషన్‌లో పేర్కొన్న ప్రతీ అంశం అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వంలో రైతు బంధు అమలులో జరిగిన అవకతవకలను ప్రభుత్వం సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. సదస్సులో పాల్గొన్న రైతులు, రైతు సంఘాల ప్రతినిధుల నుంచి సూచనలు సలహాలను అడిగిన తుమ్మల.. గత ప్రభుత్వం పంటలు నష్ట పోయిన రైతులకు పరిహారంగా ఒక్క పైసా ఇవ్వలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎకరాకు రూ.10వేల చొప్పు పరిహారం అందచేసిందన్నారు. ఇక నుంచి నష్ట పోయిన పంటలన్నిటికీ బీమా వర్తింపజేస్తామని, రైతులకు పెట్టుబడి సాయంతో పాటు ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల కొరత లేకుండా చూస్తామని చెప్పారు.

గత అవకతవకలను సరిదిద్దేందుకే సదస్సులు : మంత్రి సీతక్క



గత ప్రభుత్వం పంటలకు పెట్టుబడి కాకుండా పట్టాకు పెట్టుబడి ఇచ్చిందని, కొన్ని చోట్ల ఒక్కరికే రెండేసి సార్లు రైతు బంధు ఇచ్చారని, గతంలో జరిగిన అవకతవకలను సరిదిద్దడానికే రైతులతో సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. నిజమైన రైతులకు ఎప్పుడూ అన్యాయం జరగదని, క్షేత్రస్థాయిలో అర్హులైనవారిని గుర్తించి వారందరికీ రైతు భరోసా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అప్పులను సాకుగా చూపబోం : మంత్రి పొంగులేటి



పేదోడి రాజ్యం రావాలని, మంచి ప్రభుత్వం కావాలని ప్రజలు కోరుకున్నారని, గత ప్రభుత్వం ఎడాపెడా చేసిన రూ. 7లక్షల కోట్ల అప్పులను సాకుగా చూపి సంక్షేమ పథకాలను అమలు చేయడంలో వెనుకాడబోమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రైతును రాజును చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, గత ప్రభుత్వం విస్మరించిన ప్రాధమ్యాలు, సంక్షేమ కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని భరోసా ఇచ్చారు. గత సర్కారులా నాలుగు గోడల మధ్య కూర్చుని నిర్ణయాలు తీసుకోకుండా ప్రజలకు ఏం కావాలో.. ఏం చేయాలో క్షేత్రస్థాయికి వెళ్లి తెలుసుకోవడం ద్వారానే తగిన నిర్ణయాలను తీసుకొని అమలు చేస్తుందన్నారు. రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణకు నిర్వహించిన సమావేశంల్లో ఇది నాలుగోదని, పది ఉమ్మడి జిల్లాల్లో సదస్సులు నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు తమ రాజకీయ పబ్బంగడుపుకోవడానికి నిరుద్యోగులను రెచ్చగొడుదున్నారని, ఇప్పుడు తప్పుడు అభిప్రాయాలను కల్పించడం ద్వారా రైతులను కూడా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పాన్‌కార్డు కలిగి ఉన్న, ఆదాయం పన్ను చెల్లించిన రైతులకు రైతు భరోసా ఇవ్వరని చేస్తున్నది దుష్ప్రచారమేనని, రైతులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నాడు రైతు బంధు కింద పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని, అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఉండేందుకు వర్క్‌షాపులను నిర్వహిస్తుంటే బీఆర్‌ఎస్ అనవసర చర్చను లేవనెత్తుతూ వక్రమార్గం పట్టించేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు.

రైతుభరోసాపై సీఎం చిత్తశుద్ధితో ఉన్నారు : మంత్రి సురేఖ



రైతు భరోసా అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారని, అర్హులైన రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలనే సంకల్పంతో ఉన్నారని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గత రైతుబంధు విషయంలో కటాఫ్ పెట్టాలని తాను చెప్పినా గత ప్రభుత్వం వినకపోగా వందల ఎకరాల భూములున్న వారికి కూడా రైతుబంధు వర్తింపజేయడంతో ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. ఇందిరాగాంధీ నిరుపేదలకు అందించిన భూములు ధరణి రాకతో గల్లంతయ్యాని ఆవేదన వ్యక్తం చేసిన ఆమె.. అర్హులైన రైతులకు రైతు భరోసా ఇచ్చేందుకే ఈ అభిప్రాయసేకరణ జరుపుతున్నామన్నారు. గత ప్రభుత్వం సాగులోలేని వందల ఎకరాల భూమికి కూడా రైతు బంధు కింద రూ.లక్షలు ఇచ్చిందని, బడాభూస్వాములు, ఎన్‌ఆర్‌ఐలు కూడా రైతుబంధు తీసుకున్నారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పంట నష్టపోయిన రైతులకు పూర్తి పరిహారం అందగా బీఆర్‌ఎస్ సర్కార్ పాలనలో ఒక్కపైసా ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణాయాల వల్ల రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలు అనేక ఇక్కట్లు పడ్డారన్నరు. రైతు సంతోషంగా ఉంటేనే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని, సీఎం రేవంత్‌రెడ్డి ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. పశువులు కూడా రైతులకు సంపదతో సమానమని, వాటికి కూడా బీమా వర్తింపజేయాలని ఈ సందర్భంగా మంత్రి సురేఖ తన అభిప్రాయాన్ని తెలిపారు.



ఈ సదస్సులో మహబూబాబాద్, వరంగల్ ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కెఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, మురళీనాయక్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఆరుజిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, రిజ్వాన్ బాషాషేక్, అద్వైత్ కుమార్ సింగ్, రాహుల్ శర్మ, దివాకర, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల అధికారులు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

‘రైతుభరోసా’పై అన్నదాతల అభిప్రాయాలు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 15 : రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణలో భాగంగా సోమవారం మంత్రివర్గ ఉప సంఘం హనుమకొండ కలెక్టరేట్‌లో సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై రైతుల అభిప్రాయా లు సేకరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన సుమారు 250 మంది తమ అభిప్రాయాలు వెల్లడించారు. వారిలో కొందరివి..

పదెకరాల వరకున్న రైతులకు రైతుభరోసా ఇవ్వాలి

మచ్చ సందీప్ కుమార్, బచ్చన్నపేట, జనగామ జిల్లా



ప్రభుత్వం రైతు భరోసాను పదెకరాల వరకు భూములున్న రైతులకు ఇవ్వాలి. కౌలు రైతులకు రైతు భరోసా పథకాన్ని వర్తింపచేస్తే వారి బాధలు కూడా తీరుతాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యుత్‌కు ఎలాంటి ఆటంకం ఉండటం లేదు. యువ రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సాగు చేసే వారికి ఇవ్వాలి

రమాదేవి, హసన్‌పర్తి, హనుమకొండ జిల్లా



కష్టపడి సాగు చేసే రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలి. అది కూడా ఐదెకరాల్లోపు భూమి ఉన్న వారికి ఇవ్వడం వల్ల ప్రజాధనం దుర్వినియోగం కాదు. బంగారం, వజ్రాలు ఉన్న కోటీశ్వరులైనా మా లాంటి రైతులు పంట పండిస్తేనే తిండి తినగలుగుతారు. చిన్న సన్నకారు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందనే నమ్మకం ఉంది. కౌలు రైతులకు కూడా వర్తింపజేస్తే బాగుంటుంది.

ఐదెకరాల వరకు సాయం ఇవ్వాలి

తోటకూర నర్సయ్య, ఖిలా వరంగల్



ఐదు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలి. భూ స్వాములకు ఇస్తే ప్రభుత్వం అప్పుల పాలవుతుంది. ఒక గుంట నుంచి 5 ఎకరాలలోపు ఉన్న రైతులకు ఇస్తే పేద రైతులకు న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులే నేరుగా రైతులతో సమావేశం నిర్వహించి పథకం అమలుపై అభిప్రాయాలు సేకరించడం బాగుంది.

రైతు భరోసా కంటే ప్రతీ పంటకు బోనస్ ఇవ్వాలి

కూర వెంకటరాజిరెడ్డి, టేకుమట్ల, భూపాలపల్లి జిల్లా



రైతు భరోసా పథకం ఇవ్వడం కంటే రైతులు పండించే ప్రతీ పంటకు బోనస్ ఇస్తే బాగుంటుంది. బోనస్ ఇస్తే యువకులు కూడా వ్యవసాయంవైపు ఆసక్తి చూపుతారు. యువతను ప్రోత్సహిస్తే రాబోయే తరాలకు కూడా వ్యవసాయం అంటే తెలుస్తుంది. లేదంటే యువత సాగురంగానికి దూరమయ్యే ప్రమాదం ఉంది. ఇక రైతు భరోసా ఇవ్వాల్సి వస్తే పదెకరాలలోపు ఉన్న రైతులకే ఇవ్వాలి.

గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదు

ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదు. 10 సంవత్సరాల బీఆర్‌ఎస్ హయాంలో 8వేల మంది రైతులు చనిపోతే ఏ ఒక్క రాజకీయ నాయకుడు కూడా చూడటానికి రాలేదు. బిచ్చం వేసినట్టు రైతుబంధు ఇచ్చారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి. రైతుల సమస్యల పరిష్కారానికి రైతు కమిషన్ ఏర్పాటు చేయాలి. రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు వీలుగా ప్రధాన రహదారుల నుంచి మంచి రోడ్లు వేయించేలా నిర్ణయాలు తీసుకోవాలి.

నాడు ప్రత్యర్థులు.. నేడు మిత్రులు



పక్కపక్కనే కూర్చున్న రేవూరి, దొంతి

హనుమకొండ కలెక్టరేట్, జూలై 15 : రైతు భరోసా అమలుపై మంత్రివర్గ ఉప సంఘం ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో అభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో పలు ఆసక్తికర సంఘటనలు చోటు చేసుకున్నాయి. నర్సంపేట నియోజకవర్గంలో దశాబ్దకాలం పాటు రాజకీయ ప్రత్యర్థులుగా టీడీపీ నుంచి రేవూరి ప్రకాశ్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి దొంతి మాధవరెడ్డి హోరాహోరీగా పోటీ పడ్డారు. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో రేవూరి టీడీపీ నుంచి బీజేపీలోకి అక్కడి నుంచి కాంగ్రెస్‌లో చేరి గత ఎన్నికల్లో పరకాల ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక దొంతి మాధవరెడ్డి నర్సంపేట నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే వీరిద్దరు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన రైతుభరోసా సమావేశంలో పక్కపక్కనే కూర్చోవడం ఆసక్తిగా మారింది.

పక్కపక్కన డీసీసీబీ మాజీ, ప్రస్తుత చైర్మన్లు..



జంగా, మార్నేని

గతంలో చాలా సంవత్సరాలు డీసీసీబీ బ్యాంకు చైర్మన్‌గా జంగా రాఘవరెడ్డి పని చేయ గా.. ప్రస్తుతం మార్నేని రవీందర్‌రావు చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల మార్నేని టెస్కాబ్ చైర్మన్‌గా ఎన్నికవగా.. జంగా రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితుల య్యారు. అయితే వీరిద్దరు రైతు భరోసా సదస్సులో పక్కపక్కనే కూర్చున్నా.. కాస్త ఎడమొహం.. పెడమొహంగానే ఉన్నారన్న చర్చ జరిగింది.

అర్హులెందరో?

5వ పేజీ తరువాయి

ఉంది. సోమవారం ఇచ్చిన విధివిధానాల మేరకు.. ప్రధానంగా 2018 డిసెంబరు 12వ తేదీ నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ వరకు పంట రుణం తీసుకున్న రైతులకే రుణమాఫీ వర్తిస్తుంది. అలాగే 2023 డిసెంబరు 9వ తేదీ వరకు తీసుకున్న అన్ని రకాల పంట రుణాలకు సంబంధించి అసలు, వడ్డీ కలిపి రూ.2లక్షల వరకు మాఫీ చేస్తారు.

దీనికి ఆహారభద్రత (రేషన్)కార్డును ప్రామాణికంగా తీసుకుని భూమి ఉన్న ప్రతీ రైతు కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ చేయనున్నారు. షెడ్యూల్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, ప్రాథమిక సహకార సంఘాల నుంచి తీసుకున్న పంట రుణాలకే మాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. రీషెడ్యూల్ చేసిన రుణాలతో పాటు ఎస్‌హెచ్‌జీ, జేఎల్‌జీ, ఎల్‌ఈసీఎస్ రుణాలకు మాఫీ వర్తించదని ప్రభుత్వం పేర్కొంది. అలాగే రుణమాఫీ అమలుకు ప్రతీ బ్యాంకులో నోడల్ అధికారిని నియమిస్తారు.

రుణమాఫీ ఎందరికంటే..?

వ్యవసాయంపైనే ఆధారపడిన రైతులు అత్యధికంగా ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లాలో రుణమాఫీ రైతులకు ఉపశమనం కలిగించనుంది. అయితే ప్రభుత్వం తొలుత కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో లబ్ధిదారులుగా ఉన్న వారిని అర్హులుగా గుర్తించి వారికి తొలుత రుణమాఫీ చేయనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా 3,81,890 మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. వీరికి మొదట రుణమాఫీ చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా అమలు చేస్తున్న ఈ పథకంలో కూడా కుటుంబంలో ఒక్కరికి మాత్రమే పెట్టుబడి సాయాన్ని అందిస్తుంది. ఇందులో అర్హుల జాబితాను ప్రభుత్వం సేకరించి తొలి విడతలో నిబంధనల ప్రకారం అర్హులైన వారికి రూ.2లక్షల వరకు మాఫీ చేయనున్నారు. అలాగే రైతుబంధు పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,787మంది రైతులు లబ్ధిపొందుతున్నారు.

అయితే వీరిలో మాత్రం ఒక్క కుటుంబం నుంచి ఒక్కరి కంటే అధికంగా ఉన్నారు. దీంతో రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవటంతో పాటు కటాఫ్ డేట్‌ను కూడా అమలు చేస్తే రూ.2లక్షల రుణమాఫీ వర్తించే అర్హుల జాబితా వచ్చే అవకాశం ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 34 సహకార బ్యాంకుల్లో 78,432మంది రైతులకు రూ.529.44కోట్ల రుణమాఫీ కానుంది. ఇప్పటికే డీసీసీబీ బ్యాంకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 5లక్షల నుంచి 6లక్షల మంది రైతులకు రూ.2లక్షల రుణమాఫీ వర్తించవచ్చునని సమాచారం.

రేషన్‌కార్డు లింకుపై రైతుల్లో ఆందోళన..

ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనలు రైతుల్లో కొంత ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రధానంగా కుటుంబం మొత్తానికి రూ.2లక్షల వరకు మాఫీ ప్రకటించిన ప్రభుత్వం దీనికి రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నట్లు ప్రకటించింది. అయితే ఒక కుటుంబ నుంచి వేరు పడిన అనేక మంది రైతుల్లో ఇది ఆందోళన కలిగిస్తోంది. పదేళ్లుగా ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులను జారీ చేయలేదు. వేర్వేరుగా ఉంటున్నా రేషన్‌కార్డు మాత్రం ఉమ్మడిగా ఉండటంతో ఈ రెండు లక్షల రుణమాఫీ ఎవరికి వర్తిస్తుందనే చర్చ జరుగుతోంది.

ఒక కుటుంబంలో ఇద్దరుముగ్గురు అన్నదమ్ముళ్లు ఉండి.. వారికి బ్యాంకుల్లో అప్పులు ఉంటే ఎవరివి మాఫీ అవుతాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కుటుంబ పెద్దకే రుణమాఫీ జరిగితే మిగతా సభ్యుల పరిస్థితేంటన్న చర్చ జరుగుతోంది. అలాగే చాలా మందికి రేషన్‌కార్డులు లేవు.

రేషన్‌కార్డులనే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకోవటంతో తమ పరిస్థితేంటని మరి కొందరు రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఐదారు ఎకరాల భూమి ఉంటే పింక్ కార్డులు ఇచ్చారు. వీటిపై రేషన్ కాకుండా కిరోసిన్ మాత్రమే ఇచ్చేవారు. కాలక్రమేణా ఆ కార్డులు కూడా ప్రస్తుతం లేవు. దీంతో వీరి పరిస్థితేంటని ఆవేదన చెందుతున్నారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన రైతు భరోసా సదస్సులో పలువురు రైతులు ఇదే అంశాన్ని మంత్రుల ఎదుట లేవనెత్తారు.

ఒక కుటుంబాన్ని ప్రామాణికంగా తీసుకోవద్దని, ఒక రైతును తీసుకోవాలని సూచించారు. పల్లెల్లో ఉమ్మడి కుటుంబాలు కలిసే ఉంటాయని, ఈ రుణమాఫీతో విబేధాలు వచ్చే అవకాశాలున్నాయని రైతులు అభిప్రాయ పడుతున్నారు. రేషన్‌కార్డును కాకుండా ఆధార్‌కార్డు ప్రామాణికంగా రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతుబంధు, పీఎం కిసాన్‌సమ్మాన్ నిధి పథకం ద్వారా లబ్ధిపొందుతున్న రైతులు..

జిల్లా	రైతుబంధు రైతులు	పీఎంకేఎస్‌నిధి రైతులు
వరంగల్	1,54,822	65,361
హనుమకొండ	1,45,044	56,409
జనగామ	1,79,735	81,487
మహబూబాబాద్	2,14,685	90,978
భూపాలపల్లి	1,16,171	48,496
ములుగు	79,330	39,159
మొత్తం	8,89,787	3,81,890

విస్తారంగా వాన

- ఉమ్మడి జిల్లాలో పలు చెరువులకు జలకళ
- పలుచోట్ల ఉప్పొంగిన వాగులు



బయ్యారంలో అలుగు పారుతున్న కాకతీయుల నాటి పెద్ద చెరువు

హనుమకొండ / భూపాలపల్లి / జనగామ (ఆంధ్రజ్యోతి)/ బయ్యారం , జులై 15 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో చెరువులు, వాగులు జలకళను సంతరించుకుంటున్నాయి. మెట్టపంటలు వేసిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా వాగులు ఉప్పొంగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం హనుమకొండ జిల్లాలో సరాసరి 25.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా నడికూడ మండలం కంఠాత్మకూరు దగ్గర తాత్కాలిక రోడ్డు వరద ఉధృతికి తెగిపోయింది. ఇక్కడ వాగుపై వంతెనను నిర్మించే క్రమంలో ఈ తాత్కాలిక రోడ్డు వేయగా అది కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే వరంగల్, హనుమకొండ నగరాల్లోనూ వర్షం కారణంగా పలురోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దామెర మండలంలో అత్యధికంగా 51.7 మిమీ వాన పడింది. నడికూడ మండలం కంఠాత్మకూరు దగ్గర తాత్కాలిక రోడ్డు వరద ఉధృతికి తెగిపోయింది. భీమదేవరపల్లిలో 20.4మిమీ, వేలేరులో 9, ఎల్కతుర్తిలో 23.4, కమలాపూర్‌లో 36.7, హసన్‌పర్తిలో 43.7, ధర్మసాగర్‌లో 9.2, కాజీపేటలో 18.1మిమీ, హనుమకొండలో 29.6, పరకాలలో31.5, ఆత్మకూరులో30.3, శాయంపేటలో 31, నడికూడలో 23.8 మిమీ, ఐనవోలులో 2.3, వర్షపాతం నమోదైంది. భూపాలపల్లి జిల్లాలోని కాటారం, మహదేవపూర్, మల్హర్ మండలాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో కాటారం మండలంలో పలు లోతట్టు ప్రాంతాలు, పంటలు నీటమునిగాయి. ఓ ఇంటి ప్రహరీ నేలమట్టమైంది. వీరాపూర్ శివశంకర్ ప్రాజెక్టు చెరువు కట్టపై నుంచి నీరు ప్రవహించగా కట్ట తెగిపోకుండా అధికారులు, రైతులు చర్యలు చేపట్టారు. రేగులగూడెం జీపీ పరిధిలోని గోపాల్‌పూర్ వద్ద వాగు పొంగి ఇటీవలే వేసిన వరినార్లు నీట మునిగాయి. జాదరావుపేట శివారులోని బ్రిడ్జి సమీపంలో వరద నీటితో తారురోడ్డు కోతకు గురై కుంగిపోవడంతో వా హనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గంగారం అలుగువాగు, పోతులవాయి బొర్రవాగు, ఒడిపిలవంచ బండల వాగు, మల్లారం మిడిచెరువు అలుగువాగు, వట్లోని వాగు పొంగిపొర్లడంతో ఆయా మార్గాల్లోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దామెరకుంట, మల్లారం, గంగపురి, గుండ్రాత్‌పల్లి పరిధిలోని పెద్ద వాగు ఉప్పొంగడంతో వందల ఎకరాల్లోని పత్తి చేలల్లో వరద నీరు నిలిచింది. మల్హర్ మండలంలోని కొండంపేట కుంబంమాటు వాగు అలుగు పడింది. మహదేవపూర్‌లోనూ పంటలు నీట మునగ్గా.. కొన్ని రోడ్లపై వాన నీరు చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. మహదేవపూర్‌లో 109.4 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది. పలిమెల మండలంలో 34.2, మహాముత్తారం 24.8, కాటారం 101.6, మల్హర్ 42.8, చిట్యాలలో 37.2, టేకుమట్లలో 85.8, మొగుళ్లపల్లిలో 28.6, రేగొండలో 7.4, గణపురంలో 6.2, భూపాలపల్లిలో 6.6 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది. జనగామ జిల్లాలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. దేవరుప్పుల మండలం కోలుకొండలో 39 మి.మీ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 30.3, పాలకుర్తి మండలం గూడూరులో 29, పాలకుర్తిలో 28.8, కొడకండ్లలో 17.8, జఫర్‌గడ్‌లో 16.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మరోవైపు ఏజెన్సీ జిల్లాలైన ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోనూ విస్తృతంగా వానలు పడుతున్నాయి.

అలుగు పడిన బయ్యారం పెద్ద చెరువు

కాకతీయుల నాటి మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం పెద్ద చెరువు సోమవారం అలుగు పడింది. 16.03అడుగుల నీటి సామర్థ్యం గల ఈ చెరువులోకి 16.05 అడుగుల నీరు వచ్చి చేరడంతో సోమవారం ఉదయం నుంచి మత్తడి దుంకుతోంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ సాగు పనులను ముమ్మరం చేశారు. మహబూబాబాద్ జిల్లాలోనే ప్రప్రథమంగా మత్తడి పారుతున్న బయ్యారం మండల కేంద్రంలోని పెద్ద చెరువును చూసేందుకు సమీప ప్రాంతాల ప్రజలు తరలివస్తున్నారు.

మూడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

ఇదిలా ఉంటే రానున్న ఐదు రోజుల్లో హనుమకొండతో పాటు వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. జనగామ జిల్లాలోనూ మోస్తరు వానలు పడతాయని తెలపడంతో ఆయా జిల్లాల యంత్రాంగం అప్రమత్తమైంది. క్షేత్రస్థాయిలో అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశాలిచ్చింది.

19 అడుగులకు చేరిన పాకాల నీటిమట్టం

ఖానాపురం : జిల్లాలోనే సాగునీటి వనరుల్లో పెద్దదైన పాకాల సరస్సు నీటి మట్టం సోమవారం నాటికి 19 అడుగులకు చేరుకుంది. పాకాల సరస్సు పూర్తి నీటి సామర్థ్యం 30 అడుగులు. గత యాసంగి పంటకు సాగి నీటి వినియోగం పూర్తయ్యేసరికి సరస్సులో 16 అడుగుల నీరు నిలువ ఉంది. కాగా ఈ వర్షాకాలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సులోకి కొత్తగా 3అడుగుల నీరు చేరడంతో సరస్సు నీటిమట్టం ప్రస్తుతం 19 అడుగులకు చేరుకుంది. దీంతో పాకాల ఆయకట్టులోని రైతులు వరిసాగు కోసం నార్లు పోస్తూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.



అలుగు పోస్తున్న భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని కుంబంమాటు



నడికూడ మండలం కంఠాత్మకూరు వాగు వద్ద తెగిపోయిన తాత్కాలిక బైపాస్ రోడ్డు

కుట్టుకూలి నిధులు విడుదల

లింగాలఘణపురం, జూలై15: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల యూనిఫాం కుట్టుకూళ్లు ఈ ఏడాది గతేడాదితో పోల్చుకుంటే ముందస్తుగా విడుదలయ్యాయి. గతంలో యూనిఫాం కుట్టిన మహిళా సంఘాలు, సంబంధిత ఏజెన్సీలు కుట్టుకూళ్ల డబ్బుల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసేవారు. ఒక్కో జతకు గతంలో రూ. 50 చెల్లించిన ప్రభుత్వం ఈసారి కుట్టుకూళ్లను మరో 50శాతం పెంచి ఒక్కో జతకు రూ. 75 లెక్కన ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే మొదటిసారిగా విడుదలైన కుట్టుకూళ్లు మాత్రం జతకు రూ. 50 లెక్కన పాతపద్ధతిలోనే విడుదల చేయడం గమనార్హం. పెరిగిన అదనపు చెల్లింపులను రెండోదశ విడుదల చేయనున్నారు. అంతేకాకుండా మొదటి జత దుస్తులు అందించిన నెలరోజుల వ్యవధిలోనే కుట్టుకూళ్లను విడుదల చేయడం పట్ల మహిళా సంఘాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రెండో జత దుస్తులను కూడా ఈ నెలాఖరు కల్లా విద్యార్థులకు అందించే పనిలో అటు అధికారులు, ఇటు కుట్టు కేంద్రాలకు చెందిన మహిళా సంఘాలు సన్నద్ధమవుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 3,195 పాఠశాలలకు చెందిన 1,66,795 మంది విద్యార్థులకు సంబంధించిన రూ.83,39,750 లను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

జిల్లాల వారీగా నిధుల మంజూరు వివరాలు..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	రూ.లు
జనగామ	484	28116	14,05,800
మహబూబాబాద్	852	39781	19,89,050
జయశంకర్	416	19129	9,56,450
ములుగు	414	17845	8,92,850
హన్మకొండ	474	29623	14,81,150
వరంగల్	555	32301	16,15,050
మొత్తం	3195	1,66,795	83,39,750

పోలీస్‌స్టేషన్ ఎదుట మృతుడి బంధువుల రాస్తారోకో

నాగరాజు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్



కేసముద్రం పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన మృతుడి బంధువులు

కేసముద్రం, జూలై 15 : కేసముద్రం విలేజిలో ఆదివారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన జిలుకర నాగరాజు కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మృతుడి బంధువులు మాట్లాడుతూ కుటుంబానికి ఆసరాగా ఉన్న నాగరాజును హత్య చేశారని ఆరోపించారు. నిరుపేద అయిన నాగరాజు తల్లిదండ్రులను ఆదుకోవాలని కోరారు. నాగరాజు మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు రాకముందే పోస్టుమార్టంకు తరలించారని ఆరోపిస్తూ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుమారు అర్ధగంటకుపైగా వరంగల్-మహబూబాబాద్ రహదారిపై బైఠాయించడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య రాస్తారోకో జరుగు తున్న ప్రాంతానికి చేరుకొని నాగరాజు మృతికి కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆందోళనకారులకు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఇదిలా ఉండగా రాస్తారోకో నిర్వహిస్తున్న సమయంలో ఉద్రిక్త పరిస్థితులుండడం తో ముందుజాగ్రత్తగా పోలీసులు అప్రమత్తమై అదనంగా గూడూరు సీఐ బాబురావు, కేసముద్రం, కురవి, కొత్తగూడ, గూడూరు ఎస్‌ఐలు వంశీధర్, గోపి, దిలీప్, నగేష్‌తోపాటు ఆయా పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు తరలివచ్చి మోహరించారు.

'ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి'

వడ్డెపల్లి, జూలై 15: ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను కల్పించి ఉద్యోగాల భర్తీని వెంటనే చేపట్టాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన డీఎస్ఎస్ఎస్ ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మామునూరు ఎయిర్‌పోర్టును వెంటనే పునరుద్ధరించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, వ్యాగన్ పరిశ్రమను నెలకొల్పి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని పార్లమెంట్ భవనానికి డాక్టర్ బీఆర్ అంబేద్క ర్ పేరు పెట్టడంతో పాటు కరెన్సీపై అంబేద్కర్ ఫొటోను ముద్రించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో డీఎస్ఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నపెల్లి బాబు, జిల్లా నాయకులు కందికట్ల తిరుమలేష్, రాజేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రిని కలిసిన
టీఎన్‌జీవోలు, రెవెన్యూ అధికారులు



ఉపముఖ్యమంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న టీఎన్జీవో నాయకులు



ఉపముఖ్యమంత్రితో రెవెన్యూ అసోసియేషన్ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 15 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన సందర్భంగా జిల్లా టీఎన్జీవోస్ నాయకులు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ నాయకులు ఉప ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికి మెమొంటో అందజేశారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, కార్యదర్శి బైరి సోమయ్య, కోశాధికారి పనికెల రాజేష్, పృథ్వీలు ఉపముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

రెవెన్యూ అధికారుల వినతి

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను రెవెన్యూ అసోసియేషన్ నాయకులు కలిశారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన వారిలో తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, అసోసియేట్ అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, ఫణికుమార్ తదితరులు ఉప ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

మడికొండలో ఘనస్వాగతం

మడికొండ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు మడికొండలో సోమవారం ఘన స్వాగతం లభించింది. ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతించారు. పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. అనంతరం మంత్రులు నగరానికి తరలివెళ్ళారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నమిండ్ల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, వస్కుల శంకర్, కుర్ల మోహన్, బిల్ల రవీందర్, బైరి లింగమూర్తి, వస్కుల శ్రీను, దువ్వ విజయ్, కొప్పుల నవీన్‌యాదవ్, పల్లపు అర్జున్, శివ పాల్గొన్నారు.

కేయూకు రూ.వెయ్యి కోట్ల నిధులు ఇప్పించాలి

కేయూ క్యాంపస్, జూలై 15 : హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు ఇప్పించేలా కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్ కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీ కావ్యను కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. హనుమకొండలోని విద్య రంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని పారిశుధ్య కార్మికులను మళ్ళీ విధుల్లోకి తీసుకోవాలని విన్నవించారు. టీచర్లు మొదలుకుని వర్సిటీ ప్రొఫెసర్ల స్థాయిలో రిక్రూట్‌మెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట'

మడికొండ, జూలై 15: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అంగన్ వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించేందుకు మడికొండలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జిల్లా సంక్షేమ అధికారిణి మధురిమ, 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికా రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఎన్జీవోలతో కలిసి వాడవాడలా తిరుగుతూ పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలని తల్లిదండ్రులలో అవగాహన పెంపొందించారు.

మూడు రోజులు నీటి సరఫరా బంద్

వరంగల్ కార్పొరేషన్, జూలై 15 : గ్రేటర్ వరంగల్ పరిధిలో 56వ డివిజన్ జవహర్‌కాలనీ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో మూడు రోజుల పాటు నీటి సరఫరాల బంద్ చేస్తున్నట్టు బల్దియా ఈఈ రాజయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రిడ్జి నిర్మాణంతో పాటు పైపు లైన్ ఏర్పాటు చేస్తున్న నైపథ్యంలో మంగళ, బుధ, గురువారాల్లో నీటి సరఫరా బంద్ చేస్తున్నట్టు వెల్లడించారు. ప్రజలు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

కుల గణన చేసే వరకు సర్కారుపై సమరమే..

బీసీ సంక్షేమ సంఘం
రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్



ప్రెస్‌క్లబ్‌లో కులగణన సాధన యాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

వడ్డెపల్లి, జూలై 15: రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేసే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచే వరకు తమ ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డిలో జరిగిన సభలో తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణన చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీల రిజర్వేషన్లను పెంచుతామని స్పష్టమైన హామీని ఇచ్చిందని చెప్పారు. ఇచ్చిన హామీని ఎన్నికల్లో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను ప్రభుత్వానికి గుర్తు చేయడానికి నిరంతరం ఒత్తిడి పెంచడానికి బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి నుంచే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమగ్ర కుల గణన సాధన యాత్రను నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ యాత్ర ఈ నెల 14న కామారెడ్డిలో ప్రారంభమై కరీంనగర్ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 18న హనుమకొండ హంటర్‌రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో సమగ్ర కులగణన సాధన యాత్ర సభ ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా సాధన యాత్ర సభకు సంబంధించిన కరప త్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనందం, తొటం రవీందర్, తమ్మల శోభారాణి, కాసగాని అశోక్‌గౌడ్, పంజాల మధు, డాక్టర్ వొడితెల రాము, శ్రీనివాస్ గౌడ్, నాగరాజు, రాధిక పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

పెన్షనర్ల జేఏసీ నేతల డిమాండ్



కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేస్తున్న పెన్షనర్లు

సుబేదారి, జూలై 15 : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పెన్షనర్ల జేఏసీ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల జేఏసీ భాగస్వామ్య సంఘాల బాధ్యులు ఇ. నర్సింహారెడ్డి , తూపురాణి సీతారాం, గుండా వీరస్వామి, పులి సారంగపాణిలు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేకుంటే ఈ నెల 30న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద సామూహిక మౌన దీక్ష చేపడుతామని హెచ్చరించారు. నాలుగు విడతల కరువు భత్యం వాయిదాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో జేఏసీ నేతలు తక్కళ్లపెల్లి పరుషోత్తం, రమేష్, నన్నపునేని సంజీవరావు, కరేటి శంకర్‌రావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జంగాను కలిసిన
కాకతీయ రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 15 : రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన జంగా రాఘవరెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా కాకతీయ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాధారపు సంజీవరెడ్డి కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. సోమవారం హనుమకొండలోని జంగా నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లాలో రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధి కోసం ప్రత్యేక భవనం ఏర్పాటు చేయాలని అంతే కాకుండా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. రెడ్డి సామాజిక అభివృద్ధి కోసం వెయ్యి కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జంగాను కలిసిన వారిలో జిల్లా సంఘం నాయకులు ఉన్నారు.

19న ఒకేషనల్ కళాశాలలో జాబ్‌మేళా

కేయూ క్యాంపస్, జూలై 15 : ఈనెల 19న హనుమకొండ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో 2021- 22, నుంచి 2023-24లో ఇంటర్మీడియేట్ ఒకేషనల్ కోర్సు లు పూర్తి చేసిన అభ్యర్థులకు అప్రెంటిషిప్ జాబ్‌మేళా-2024 నిర్వహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ బెడుదం శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాల ఆవరణలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాబ్‌మేళాలలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.7 చొప్పున ఆర్‌డీఎస్‌డీ ఈ సంస్థ వారు శిక్షణ కాలంలో ఇస్తారని పేర్కొన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులందరూ రెండు జతల బయోడెటాతోపాటు రెండు ఫోటోలు, ఇంటర్, ఎస్సెస్సీ, ఆధార్‌కార్డుతో పాటు ఇతరవిద్యార్హతల ధృవపత్రాలను తీసుకునిరావాలని సూచించారు.

కేయూ అదనపు
పరీక్షల నియంత్రణాధికారిగా నాగరాజు

కేయూ క్యాంపస్, జూలై 15 : కాకతీయ యూనివర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా డాక్టర్ బి.నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ నాగరాజు ఇప్పటి వరకు అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ చాడ రాధికారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు.. నాగరాజును పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా రాధికారెడ్డి

కాకతీయ యూనివర్సిటీ కో-ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల నూతన విభాగాలను ఏర్పాటు చేస్తూ సోమవారం వర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా డాక్టర్ చాడ రాధికారెడ్డిని మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాల అధిపతిగా నియమించారు. ఈ మేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

పీఎం స్వానిధి వార్షికోత్సవానికి నిఖితాంజలి ఎంపిక



వరంగల్ కార్పొరేషన్, జూలై 15 : నేషనల్ అర్బన్ లైవ్ లీ ఉడ్ మిషన్ (దీన్ దయాల్ అంత్యోదయ యోజన) ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగే పీఎం- స్వానిధి కార్యక్రమంలో పాల్గొనడానికి వరంగల్ బల్దియాకు చెందిన స్వయం సహాయక బృందం సభ్యురాలు నిఖితాంజలి ఎంపికయింది. సోమవారం నిఖితాంజలిని ఎంపిక చేసినట్టు బల్దియా కార్యాలయానికి సమాచారం అందింది. ఈ నెల 18న దేశ రాజధాని ఢిల్లీలోని ఇండియా హబిటాట్ సెంటర్‌లోని స్టెయిన్ ఆడిటోరియంలో ఉత్కృష్టతా కీ ఓర్ బడే కదం కార్యక్రమం జరుగనుంది. ఐతే వరంగల్ బల్దియాలో స్వయం సహాయక బృందం నాయకురాలిగా (ఎస్‌హెచ్‌జీ) పని చేస్తున్న నిఖిలాంజలి ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆమె సేవలకు గాను ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసినట్టు జిల్లా మెప్మా అధికారులు వెల్లడించారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన కార్పొరేటర్

జూలైవాడ, జూలై 15: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను గ్రేటర్ 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. రైతు భరోసా పథకం విధివిధానాలపై సోమవారం హనుమకొండ కలెక్టరేట్ నిర్వహించిన సమావేశానికి విచ్చేసిన ఉప ముఖ్యమంత్రికి పూలమొక్క అందజేశారు. కార్యక్రమంలో కుసుమ శ్యాంసుందర్, వీసం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు ఫ్లెక్సీల ఏర్పాటు



కాజీపేటలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బాలసముద్రం, జూలై 15: గంజాయి నిర్మూలనకు వరంగల్ పోలీసులు నడుం బిగించగా, కాజీపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వేముల చంద్రమోహన్ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా కాజీపేటలోని ప్రధాన కూడలైన అయినటువంటి ఫారెస్టు ఆఫీస్, నిట్ అలాగే ప్రతిరోజు కొన్ని వేల మంది రాకపోకలు సాగిస్తున్న కాజీపేట రైల్వేస్టేషన్లో భారీ సైజులో అవగాహన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గంజాయి, మాదకద్రవ్యాలకి బానిస అయినటువంటి వారి జీవితాలు ఏవిధంగా నాశనం చేసుకుంటున్నారు. యువత భవిష్యత్తు ఎలా అంధకారమవుతుంది అనే టటువంటి సామన్య మానవుడికి సైతం సులభంగా అర్థమయ్యేలా చక్కటి చిత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గంజాయి నిర్మూలనకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్‌ను నగర ప్రజలు అభినందిస్తున్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ఎంపీ కడియం కావ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

ధర్మసాగర్ ,జూలై 15: విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. సోమవారం ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పేద విద్యార్థులకు విద్యారంగ, ఉన్నత విద్యా కోసం సహాయం చేయడానికి కడియం ఫౌండేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కడియం ఫౌండేషన్‌ను గత 2016 .సంవత్సరంలో ప్రారంభించి గత నాలుగు ఏళ్ల నుంచి ఎంతో మంది విద్యార్థులకు సహాయం అందించడం జరిగిందన్నారు. పేదరికంలో ఉన్న వారిని ఉన్నత స్థాయికి తీసుక పోయేది విద్యకు మాత్రమే సాధ్యం అవుతుందన్నారు. చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగాక సేవాగుణాన్ని అలవర్చుకొని ఇతరులకు సహకారాలు అందించాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల, పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ మహిళా విద్యార్థులకు హెల్త్ కిట్స్‌ను ఎంపీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ మహేందర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్

హనుమకొండ టౌన్, జూలై 15 : ముదిరాజ్‌లను బీసీ-ఏ లో చేర్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లెబోయిన అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ తహసీల్దార్ కార్యాలయంలో ముదిరాజ్‌ల సమస్యలపై సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. తెలంగాణలో అధిక జనాభా గల ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించి మత్స్యకారులకు 50 యేళ్లకే ఆసరా పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ముదిరాజ్‌లకు ఉచిత చేప పిల్లల పథకం కొనసాగిస్తూ జనాభా ప్రతిపాదికన నామినేటెడ్ పదవులు కల్పించి ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేశబోయిన శ్రవణ్, భయ్యా శోభన్, ఇప్ప సాంబమూర్తి, పులి ప్రభాకర్, రామరాజ్, సమ్మయ్య నర్సింగరావు, శంకర్, రమేష్, ప్రకాష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ మేకింగ్ పోటీల విజేతలకు బహుమతులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 15 : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 11న లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోస్టర్ మేకింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుతులు అందజేశారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో ఎం. రాంకిషన్‌రాజు చేతుల మీదుగా విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి, స్కూల్ ఇంచార్జి హెడ్మాస్టర్ పద్మ, జ్యూరీ మెంబర్లు విజయభాస్కర్, కుమారస్వామి, సురేందర్, అశోక్‌కుమార్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులు

అనుమతులు లేని
పాఠశాలలను మూసివేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 15 : జిల్లాలో అనుమతులు లేని పాఠశాలలను వెంటనే మూసివేయాలని వడుప్సా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హనుమకొండలో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, హనుమకొండ డీఈవో వాసంతిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రీప్రైమరీ పాఠశాలలు నిర్వహిస్తూ తల్లితండ్రులను మోసం చేస్తున్న యాజమాన్యాలపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలల వల్ల అన్ని నిబంధనలు పాటిస్తూ నడుపుతున్న పాఠశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వడుప్సా నాయకులు సతీష్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి

మడికొండ, జూలై 25 : పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి అన్నారు. మడికొండలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1950 సంవత్సరం బ్యాచ్ పూర్వ విద్యార్థులు సీహెచ్. మధుసూదన్ రెడ్డి, సీహెచ్. రఘువీరారెడ్డి, ఆవాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి కార్పొరేటర్ పాఠశాల ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు శుభ్రమైన వాతావరణాన్ని అందించడానికి చెట్లను విరివిగా పెంచాలన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీఎస్ ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షానికి నేలకొరిగిన భారీ వృక్షం



బాలసముద్రంలో రోడ్డుపై పడిన భారీ వృక్షం

బాలసముద్రం, జూలై 15: హనుమకొండ బాలసముద్రంలో శుక్రవారం కురిసిన వర్షానికి భారీ వృక్షం నేలకూలింది. బాలసముద్రం నుంచి అంబేద్కర్ జంక్షన్‌కు పోయే దారిలో వర్షం కురవడంతో భారీ వృక్షం వేర్ల కింద వరదనీరు చేరి మట్టి కుంగి భారీ వృక్షం రోడ్డు మధ్యలో కూలిపోయింది. చెట్టు కూలుతున్న సమయంలో ప్రయాణికులు రాకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. రోడ్డు మధ్యలో చెట్టు కూలి ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తికి రిమాండ్

ధర్మసాగర్, జూలై 15: వివిధ ప్రాంతాల్లో బ్యాట్రీల దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని రిమాండ్ చేసినట్టు సీఐ మహేందర్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రంగనాయకపురం తాళ్లరేవు మండలానికి చెందిన మెడిశెట్టి నాగేశ్వర్‌రావు తల్లిదండ్రులతో కలిసి సికింద్రాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. జల్సాలు, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి అధిక డబ్బులు సంపాదించాలని లక్ష్యంతో హైదరాబాద్‌లో లాంగ్ డ్రైవ్ కార్స్‌లో కారును కిరాయికి తీసుకొన్నాడు. రాత్రి వేళల్లో ధర్మసాగర్, చిలుపూర్, రఘునాథ్‌పల్లి, జనగామ, బచ్చన్నపేట, చౌటుప్పల్ పోలీసుస్టేషన్ల పరిధిలో ఆగి ఉన్న ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్లకు చెందిన 25 బ్యాట్రీలను దొంగతనానికి పాల్పడ్డాడు. దొంగతనం చేసిన బ్యాట్రీలను రాంపూర్ ఇండస్ట్రీయల్‌లోని ధనలక్ష్మి రైస్‌మిల్ వెనుకల గల చెట్ల పొదల్లో దాచిపెట్టాడు. 12 బ్యాట్రీలను కారులో తీసుకొని హైదరాబాద్‌కు తరలిస్తుండగా సీఐ మహేందర్ ,పోలీసులు రాంపూర్ హైవేపై పెట్రోలింగ్ చేస్తుండగా కారును పోలీసులు తనిఖీ చేసే ప్రయత్నం చేయగా కారును అప కుండా వెళ్లుతున్న క్రమంలో పోలీసులు కారును వెంబడించి పట్టుకున్నారు. కారును తనిఖీ చేయగా అందులో బ్యాట్రీలు ఉండడంతో నాగేశ్వర్ రావును పోలీసులు అదుపులోకి విచారించగా బ్యాట్రీలను దొంగతనానికి పాల్పడ్డట్టు నేరాన్ని అంగీక రించారు. అదుపులోకి తీసుకొని 1.50లక్షల విలువ చేసే మొత్తం 20బ్యాట్రీలను స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ మహేందర్ తెలిపారు.

రైతు భరోసా సభ ఏర్పాట్లలో నిర్లక్ష్యం

అధికారులు, రైతులు, ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్ల మధ్య వాగ్వాదం

హనుమకొండ కలెక్టరేట్, జూలై 15 : రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణ కార్యక్రమం హనుమకొండ కలెక్టరేట్‌లోని ఐడీవోసీ భవన సముదాయంలో సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 250 మంది రైతులకు ఆహ్వానం పలికారు. 250 మంది రైతులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ల పీఏలు, ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా రిపోర్టర్లు రావడంతో సమావేశ మందిరం సరిపోలేదు. అయితే మంత్రులు కూర్చున్న వేదికకు ముందు రైతులు కూర్చోవడానికి కుర్చీలు వేశారు. వెనకాల ప్రెస్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. దీంతో ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్‌లు కెమెరాలు పెట్టడంతో వెనుక ఉన్న రైతులు కనిపించడం లేదంటూ కెమెరాలు తీయమని అధికారులు చెప్పడంతో వాగ్వాదం నెలకొంది. దీంతో కొద్దిసేపు సమావేశంలో అంతరాయం ఏర్పడింది. ఇరుకైన సమావేశ మందిరం ఏర్పాటు చేయడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేశారు.

'డీటీపై చర్యలు తీసుకోవాలి'

ఐనవోలు, జూలై 15: కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం రికార్డు అసిస్టెంట్ తెడ్డు శ్రీకాంత్ ఆత్మహత్యకు కారకుడైన అక్కడి డిప్యూటీ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని ట్రెంగా జిల్లా అధ్యక్షుడు మరుపట్ల మల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగా) నిరసనలో భాగంగా ఐనవోలు తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఆత్మహత్యకు పాల్పడిన శ్రీకాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సూరజ్, సీనియర్ అసిస్టెంట్ గోపి, జూనియర్ అసిస్టెంట్‌లు బి.రమేష్, సాంబరాజు, మోహినుద్దీన్, విజయ పాల్గొన్నారు.

సులువైన చికిత్సలు

- నీటి సంబంధ రుగ్మతలు దరి చేరకుండా వేడి చేసిన నీరే తాగాలి.
- వానాకాలంలో అత్యంత సాధారణమైన గొంతు నొప్పి నుంచి ఉపశమనం పొందడం కోసం గోరువెచ్చని పాలలో పసుపు కలుపుకుని తాగాలి.
- తులసి నీళ్లలో పసుపు కలిపి, కషాయం తయారుచేసుకుని నోరు పుక్కిలిస్తున్నా గొంతు నొప్పి తగ్గుతుంది.
- కషాయాలతో వర్ష రుతువు రుగ్మతలు దూరం!



గుడ్ ఫుడ్

పదార్థాలు- ప్రత్యామ్నాయాలు

తోచింది, నచ్చింది తినడం కాదు. ఆరోగ్యానికి మేలు చేసేదీ, పోషకభరితమైనదీ తినాలి. అందుకోసం వీలున్న ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి.

- **జంక్ ఫుడ్:** పిజాలు, బర్గర్లు మొదలైన జంక్ ఫుడ్స్‌లో అత్యధిక క్యాలరీలుంటాయి. వీటిలోని రిఫైన్డ్ దినుసులు ఆరోగ్యానికి హానికరం కాబట్టి వీటికి బదులుగా తక్కువ క్యాలరీలున్న సలాడ్లు, మొలకలు ఎంచుకోవాలి.
- **పునుగులు, బజ్జీలు:** ఈ స్నాక్స్ తరచూ తింటూ ఉంటాం. ఇంట్లో తయారుచేసుకున్నవే తిన్నా వీటి ద్వారా అధిక మొత్తాల్లో కొవ్వులు శరీరంలోకి చేరతాయి. కాబట్టి వీటికి బదులుగా నట్స్, సీడ్స్ తినాలి. వేరుసెనగలు, బాదం లాంటి వాటిలో ఆరోగ్యకరమైన కొవ్వులుంటాయి.
- **బిస్కెట్లు, కేకులు:** ఈ స్నాక్స్‌లో అత్యధికంగా పాలిష్ పట్టిన దినుసులుంటాయి. అలాగే అత్యధిక కొవ్వులు, చక్కెరలు ఉంటాయి. వీటికి బదులుగా సంప్రదాయ తీపి పదార్థాలైన వేరుసెనగ చిక్కీలు, పల్లీ ముద్దలు, మిల్లెట్ ఉండలు లాంటివి తినాలి.



- **కూల్ డ్రింక్స్:** వీటిలో చక్కెర ఎక్కువ. ఎనర్జీ డ్రింక్‌లు, జీరో షుగర్ డ్రింకులు కూడా హానికరమే! కాబట్టి వీటికి ప్రత్యామ్నాయంగా కొబ్బరినీళ్లు, మజ్జిగ, తాజా చెరకు రసాలు తాగాలి.
- **పళ్ల రసాలు:** వీటిని ఇంట్లో తయారుచేసుకునే అలవాటు ఉండదు కాబట్టి బయట దొరికే పండ్లరసాల మీదే ఆధారపడుతూ ఉంటాం. వీటిలో చక్కెరలు ఎక్కువ. పైగా పండ్ల రసాలతో తగిన పీచు శరీరానికి అందకుండా పోతుంది. కాబట్టి పండ్ల రసాలకు బదులుగా నేరుగా పండ్లనే తినడం అలవాటు చేసుకోవాలి.
- **జామ్స్, సాస్, డిప్స్:** వీటిలో ఉప్పు, చక్కెరలు, నిల్వ పదార్థాలు, కృత్రిమ రంగులు ఎక్కువ. వీటికి బదులుగా ఇంట్లో తయారుచేసిన పచ్చళ్లు ఎంచుకోవాలి.

ఆయుర్వేదం

వర్షాకాలం చల్లని వాతావరణం ఆహ్లాదాన్ని కలిగించడంతో పాటు, కొన్ని రుతుపరమైన ఇబ్బందులనూ తెచ్చి పెడుతూ ఉంటుంది. కాబట్టి వాటి మీద ఓ కన్నేసి ఉంచి, మెలకువగా వ్యవహరించాలి.



వానల్లో హాయ్.. హాయ్

సూర్యభగవానుని కదలికల ఆధారంగా, ఉత్తరాయణం, దక్షిణాయణాలు రెండింట్లోనూ చెరో ఆరు నెలలు చొప్పున ఏడాది కాలం సాగుతుంది. ఈ ఏడాది కాలంలో శిశిరం, వసంత, గ్రీష్మ, వర్ష, శరద్, హేమంతం.. ఆరు రుతువులు సాగుతూ ఉంటాయి. ఉత్తరాయణంలో సూర్యుడు భూమి, దాని మీద ఉన్న జీవరాశిలో ఆవరించి ఉన్న చల్లదనాన్ని, శక్తినీ సంగ్రహించేస్తాడు. దక్షిణాయణంలో ఇందుకు విరుద్ధంగా, భూమి మేఘాల చేత ఆక్రమించేలా చేసి, చల్లని గాలులు, వానలతో చల్లబరుస్తాడు. ఫలితంగా శిశిరం, వసంతం, గ్రీష్మ రుతువుల్లో కోల్పోయిన శక్తి తిరిగి వర్ష రుతువులో పొందడం జరుగుతూ ఉంటుంది. అయితే ఈ కాలంలో వాత, పిత్త దోషాలు కలిగిన వారికి వివిధ రకాల రుగ్మతలు తిరగబెడుతూ ఉంటాయి.

వాత: వేసవి ఫలితంగా భూమిలో బిగదీసుకుపోయిన వాయువులు, ఆమ్లసహిత వాతావరణం మూలంగా, వాతం పెరిగి, వానాకాలంలో జీర్ణశక్తి సన్నగిల్లుతుంది.

పిత్త: వానాకాలంలో క్షీణించిన జీర్ణశక్తి మూలంగా వేసవిలో వేడి పెరగడంతో పాటు, పిత్తం కూడా పెరుగుతుంది. వానాకాలం చల్లని వాతావరణం చెలరేగిన వెంటనే లక్షణాలు ఇబ్బంది పెట్టడం మొదలుపెడతాయి. కాబట్టి వర్ష రుతువులో వాతం పెరగడం, పిత్తం పేరుకుపోవడం మూలంగా ఈ కాలంలో కొన్ని రకాల సమస్యలు విపరీతంగా వేధిస్తాయి.

కాబట్టి వాతం, పిత్తాలను సమతుల్యం చేసే ఆహారపు టలవాట్లు, జీవనశైలి మార్పులను స్వాగతించాలి. లేదంటే వర్ష రుతువులో వేధించే టైఫాయిడ్, కలరా, కామెర్లు, జలుబు, దగ్గు మొదలైన ఇబ్బందులు తప్పవు. ఈ రుగ్మతలు దరి చేరకుండా ఉండాలంటే అభ్యంగనం లేదా నూనెతో మర్దన, స్వేదనం, బస్తి చికిత్సలను క్రమంతప్పక అనుసరించాలి.

అభ్యంగనం

వర్షాకాలంలో పెరిగే కీళ్ల నొప్పులు, ఎముకల నొప్పుల నుంచి విముక్తి పొందడానికి అభ్యంగనం ఆచరించాలి. వర్షాకాలంలో వన్నె తగ్గి, నిర్జీవంగా తయారయ్యే చర్మానికి కూడా ఈ చికిత్స ఎంతో మేలు చేస్తుంది. చర్మానికి తేమ, మెరుపులను ఇవ్వడంతో పాటు ఎముకలు బలపడేలా చేస్తుంది అభ్యంగనం. నూనెతో మర్దన తర్వాత తీసుకునే ఆవిరి స్నానం వల్ల చర్మ రంధ్రాలు తెరుచుకుని విషతుల్య వ్యర్థాలు శరీరం నుంచి బయటకు వెళ్లిపోతాయి. ఫలితంగా వాపులు, నొప్పులు తగ్గడంతోపాటు బిగుసుకుపోయిన కీళ్లు వదులవుతాయి.

స్వేదనం

దీన్లో రెండు రకాల చికిత్సలు ఉంటాయి. ఔషధ మొక్కల ఆకులను ఉడికించి ఉపయోగించే 'పత్ర స్వేదనం' చికిత్స వల్ల ఆర్థ్రయిటిస్ నొప్పులతో పాటు, ఎముకలు, కీళ్లకు సంబంధించిన వెన్ను సంబంధ స్పాండిలోసిస్ సమస్యలు కూడా అదుపులోకి వస్తాయి. రుక్ష స్వేదనం అనే ఉష్ణ చికిత్స వల్ల రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ నొప్పులు తగ్గుముఖం పడతాయి.

బస్తి (ఎనీమా)

ఈ చికిత్సలో వాడే నూనెలు, ఇతర కషాయాలు వాత దోషాన్ని హరిస్తాయి. వాత దోషం మూలంగా శరీరంలో చేరుకున్న మలినాలు నూనె లేదా కషాయ ఎనీమాల వల్ల బయటకు వెళ్లిపోతాయి.

జలుబు, దగ్గులకు ఆయుర్వేద చికిత్స!

వర్షాకాలం జలుబు, దగ్గు అత్యంత సహజం. ఈ రుగ్మతలను తేలికగా వదిలించుకోవాలంటే....

- కొన్ని చుక్కల నిమ్మరసం, చిటికెడు దాల్చినచెక్క పొడి, అర చెంచా తేనెలను కలిపి రోజూ రెండు పూటలా తీసుకోవాలి.

మూలికలు, పత్రాలు, సుగంధద్రవ్యాలతో తయారయ్యే కషాయాలు వర్ష రుతువు వేధించే పలు రుగ్మతలకు దివ్యౌషధంలా పని చేస్తాయి. అవేంటంటే...

- **రోగనిరోధకశక్తి:** ఈ రుతువులో సన్నగిల్లే వ్యాధి నిరోధకశక్తిని మెరుగు పరుచుకోవడం కోసం యాలకులు, దాల్చినచెక్క, తెల్ల మిరియాలు వేసిన నీటిని మరిగించి తాగాలి. రుచి సహించక పోతే కొద్దిగా తేనె కలుపుకోవచ్చు. ఈ కషాయం ప్రతి రోజూ తీసుకుంటే వ్యాధినిరోధకశక్తి మెరుగ్గా ఉండి, వ్యాధులు దరి చేరకుండా ఉంటాయి.
- **అజీర్తి:** వానాకాలం తగ్గే అజీర్తిని సరిచేయడం కోసం నీటిలో వాము, సోంపు వేసి మరిగించి, తేనె కలిపి తీసుకోవాలి. భోజనం చేసిన ప్రతి సారీ ఈ కషాయం తాగుతూ ఉంటే, అజీర్తి సమస్య తలెత్తదు.
- **సాధారణ జ్వరం:** ఏడు తులసి ఆకులు, ఐదు లవంగాలు తీసుకుని దంచాలి. వీటిని మరిగించిన నీటిలో కలిపి, కొద్దిగా సముద్రపు ఉప్పు చేర్చి, రెండు రోజులపాటు రోజుకు రెండుసార్లు తాగాలి. ఇలా చేస్తే వర్ష రుతు సంబంధ సాధారణ జ్వరాలు తగ్గుతాయి.



- రోజంతా గోరువెచ్చని నీళ్లు తాగుతూ ఉండాలి. వేడి నీళ్లు జలుబు, దగ్గు, గొంతునొప్పులకు కారణమయ్యే వైరస్‌లతో పోరాడే శక్తినిస్తాయి. అలాగే శరీరంలోని ఇన్‌ఫెక్షన్లను బయటకు తోలి, శరీరానికి సరిపడా హైడ్రేషన్‌ను అందిస్తాయి.
- రోజుకొక ఉసిరి కాయ తింటూ ఉన్నా కాలేయం ఆరోగ్యం భేషుగ్గా ఉండి, రక్త ప్రసరణ మెరుగై వ్యాధి కారక క్రిముల నుంచి రక్షణ పొందగలుగుతాం!
- అవిసె గింజలను నీళ్లలో చిక్కబడేవరకూ ఉడికించి, వడకట్టాలి. ఈ కషాయంలో నిమ్మరసం, తేనెలను కలిపి తీసుకున్నా జలుబు, దగ్గులు తగ్గుతాయి.
- నల్లమిరియాలు, బెల్లం, జీలకర్ర నీళ్లలో మరిగించి, తీసుకున్నా జలుబు, దగ్గు వల్ల పట్టేసిన ఛాతీ వదులై ఊపిరి అందుతుంది.
- క్యారట్ రసం తాగడం వల్ల జలుబు దరి చేరకపోగా, వచ్చిన జలుబు కూడా త్వరగా తగ్గిపోతుంది.

ఆయుర్వేద చికిత్సలతో జ్వరాలు బలాదూర్!

ఆయుర్వేదం జ్వరాలను రెండు రూపాల్లో అంచనా వేస్తుంది. జ్వరాన్ని జ్వరంగానూ లేదా ఇతర రుగ్మతల లక్షణంగానూ పరిగణించి, తదనుగుణ చికిత్స అందిస్తే రుగ్మత అదుపులోకి వస్తుంది. రుతువును బట్టి ఆ కాలంలో వచ్చే జ్వరాలకు ఆయుర్వేదంలో వేర్వేరు పేర్లు ఉన్నాయి. వర్ష రుతువులో వచ్చే జ్వరాలకు ఆయుర్వేదంలో 'వతజ జ్వరం' అని పేరు. ఈ జ్వరాలకు ఆయుర్వేదంలో చక్కని చిట్కాలు ఉన్నాయి.

- గ్లాసుడు నీళ్లలో చిటికెడు దాల్చినచెక్క పొడి, చిటికెడు మిరియాలపొడి కలిపి వేడి చేసి, నిమ్మరసం కలుపుకుని తాగితే జ్వరంతోపాటు, గొంతు నొప్పి కూడా తగ్గుతుంది.
- జీలకర్ర అద్భుతమైన యాంటీసెప్టిక్! జీలకర పొడి కలిపి మరిగించిన నీటిలో తేనె కలుపుకుని తాగితే వర్షాకాల సంబంధ జ్వరాలు తగ్గుముఖం పడతాయి.
- జ్వరంతోపాటు విపరీతమైన జలుబు, దగ్గు కూడా ఉంటే గోరువెచ్చని తేనెలో పావు చెంచా దాల్చిన చెక్క పొడి కలిపి రోజుకు మూడు సార్లు తీసుకోవాలి.

డెంగ్యు జ్వర చికిత్స

ఆయుర్వేదంలో ఈ జ్వరాన్ని 'దండక జ్వరం' అంటారు. ఈ జ్వరం వేధిస్తున్నప్పుడు తేలికగా అరిగే గంజి ఆహారంగా ఇవ్వాలి. తులసి, యాలకులు వేసి కాచిన కషాయాన్ని ఇవ్వాలి. కారాలు, నూనెలు తగ్గించి వండిన ఆహారం ఇవ్వాలి. పునర్నవ మూలికతో తయారైన కషాయంతో డెంగ్యు జ్వరం అదుపులోకి వస్తుంది. అలాగే వ్యాధినిరోధకశక్తిని పెంచడం ద్వారా పరోక్షంగా ఈ జ్వరం తగ్గేలా చేయవచ్చు. కాబట్టి రోగనిరోధశక్తిని పెంచే తులసి నీళ్లను రోజంతా తాగించాలి. అలాగే రోజు మొత్తంలో 10 నుంచి 15 తులసి ఆకులు నమిలించాలి. డెంగ్యు జ్వరాన్ని తగ్గించే 'ధతుర' మూలికను ఆయుర్వేద వైద్యుల పర్యవేక్షణలో వాడాలి. మెంతి ఆకులతో తయారు చేసిన తేనీరు తాగుతూ, ద్రాక్ష, దానిమ్మ రసాలు తీసుకున్నా డెంగ్యు జ్వరం తగ్గుముఖం పడుతుంది.

ఎన్నెన్ని వర్ణాలో..

కూరగాయలను వాటి వాటి రంగులను బట్టి వర్గీకరించవచ్చు. ఒక్కో రంగు వర్గానికి చెందిన కూరగాయలు నిర్దిష్టమైన ఆరోగ్యప్రయోజనాలకు కలిగి ఉంటాయి. వాటి గురించి అవగాహన ఏర్పరుచుకుంటే ఆరోగ్యానికి మేలు చేసే కూరగాయలను అవసరాన్ని బట్టి ఎంచుకోవచ్చు. రంగుల ఆధారంగా కూరగాయలను ఎలా వర్గీకరించుకోవచ్చో చూద్దాం.

తెలుపు

ఈ రంగు కూరగాయలు శరీరానికి వ్యాధినిరోధకశక్తిని అందిస్తాయి. తెల్లచిక్కుళ్లు, బంగాళాదుంపలు, ముల్లంగి, కాలిఫ్లవర్, పుట్టగొడుగులు ఈ కోవలోకి వస్తాయి. తెల్ల చిక్కుళ్లు, బంగాళాదుంపలు రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రిస్తాయి. పుట్టగొడుగుల్లో ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు ఎక్కువ. కాలిఫ్లవర్లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. గర్భిణిలు, ఇతర మహిళలకు వీటి అవసరం ఎక్కువ.

ఆకుపచ్చ

ఈ రంగుతో కూడిన కూరగాయలు శరీరం నుంచి విషాలను బయటకు వెళ్లగొట్టడానికి తోడ్పడతాయి. బఠాణీ, చిక్కుళ్లు, పాలకూర, క్యాప్సికం, కివి..ఇలా ఆకుపచ్చ రంగులో ఉన్న కూరగాయలన్నిటికీ ఈ గుణం ఉంటుంది. శరీర జీవక్రియలకు అవసరమైన పోషకాలతోపాటు, శక్తిని అందించే పోషకాలు, శరీరం నుంచి విషాలను హరించి, బయటకు వెళ్లగొట్టే తత్వం ఆకుపచ్చ రంగు కూరగాయలకు ఉంటుంది.

పసుపుపచ్చ

ఇవి సౌందర్యపోషణకు అవసరం. అరటి, పసుపుపచ్చని క్యాప్సికం, మొక్కజొన్నల్లో ఉండే కెరోటినాయిడ్లు, బైఫ్లేవనాయిడ్లు- చర్మం,ఎముకలు, దంతాలకు మేలు చేస్తాయి.

నారింజ

ఈ రంగులో పండే నారింజ, క్యారెట్లలో కేన్సర్ నుంచి రక్షణ కల్పించే పోషకాలు ఉంటాయి. ఇవి గుండెకు మేలు చేయడంతోపాటు కళ్లకు ఆరోగ్యాన్ని అందించి, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి.

ఎరుపు

టమాటో, ఎరుపు క్యాప్సికం, పండుమిరప, చెర్రీ, యాపిల్స్, దానిమ్మ మొదలైనవన్నీ ఈ కోవకు చెందినవి. ఈ పళ్లు, కూరగాయలన్నీ గుండెకు మేలు చేసేవే!

వంకాయ రంగు

ఈ రంగులో మనకు వంకాయలు పండుతాయి. ద్రాక్ష, బ్లాక్ బెర్రీ పళ్లు దొరుకుతాయి. ఇవన్నీ పొట్టలో అల్సరను తగ్గిస్తాయి. కేన్సర్ వృద్ధికి అడ్డుకట్టవేసి, మూత్రనాళ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్గిస్తాయి.

రంగుల్లో పోషకాలు

ఎరుపు

ఈ రంగు కూరగాయలు, పళ్లలో లైకోపీన్, ఎల్లాజిక్ ఆమ్లం, క్వెర్సిటిన్, హెస్పరిడిన్ మొదలైన పోషకాలు ఉంటాయి. ఇవి ప్రోస్టేట్ కేన్సర్ నుంచి రక్షణ కలిగించడంతో పాటు, కణితి పెరుగుదలను నియంత్రించి, చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తాయి. కీళ్ల మధ్య ఉండే మృదులాస్థిని ఆరోగ్యంగా ఉంచుతాయి.

నారింజ, పసుపుపచ్చ

ఈ రంగు కూరగాయలు, పళ్లలో - జీగ్జాంథిన్, బీటాకెరోటిన్, పొటాషియం, లైకోపీన్, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు వయసు పైబడే క్రమంలో వేధించే ప్రోస్టేట్ కేన్సర్, అధిక రక్తపోటు, కీళ్ల అరుగుదలను నియంత్రిస్తాయి. శరీరంలో ఆమ్ల స్థాయిని సరిచేసి, ఎముకల దారుఢ్యానికి అవసరమైన క్యాల్షియం, పొటాషియంలను శరీరం సక్రమంగా శోషించుకునేందుకు తోడ్పడతాయి.

ఆకుపచ్చ

ఈ రంగు కూరగాయలు పళ్లలో పత్రహరితం, పీచు, ల్యూటిన్, క్యాల్షియం, ఫోలేట్, విటమిన్ సి, బీటా కెరోటిన్ ఎక్కువగా ఉంటాయి. జీర్ణప్రక్రియ మెరుగుపరిచి, దృష్టిలోపాలు తలెత్తకుండా, ఫ్రీర్యాడికల్స్ శరీరం మీద దాడి చేయకుండా చేస్తాయి.

నీలం, వంకాయ

ఈ రంగుల్లోని కూరగాయలు, పళ్లలో ల్యూటిన్, క్జియాంథిన్, రెస్వెరెట్రాల్, విటమిన్ సి, పీచు, ఫ్లేవనాయిడ్లు, ఎల్లాజిక్ యాసిడ్, క్వెర్సెటిన్ అనే పోషకాలు ఎక్కువ. ఇవి కంటి చూపు మెరుగుకు ఉపయోగపడతాయి. వ్యాధినిరోధకశక్తిని పెంచుతాయి. జీర్ణప్రక్రియ మెరుగు పరచడంతోపాటు కేన్సర్ కణాల పుట్టుకను అడ్డుకుంటాయి.

తెలుపు

వీటిలో బీటాగ్లూకాన్లు ఉంటాయి. ఇవి రోగనిరోధకశక్తిని పెంచుతాయి. పెద్దపేగు, రొమ్ము, ప్రోస్టేట్ కేన్సర్లు తలెత్తకుండా చేస్తాయి. హార్మోన్ వ్యవస్థను బలోపేతం చేసి, సంబంధిత రుగ్మతలు దరి చేరకుండా అడ్డుపడతాయి.

ఇవే అవి...

అత్యధిక ఆరోగ్యపరమైన పోషకాలు కలిగి ఉండే వివిధ రంగుల్లోని పళ్లు, కూరగాయలు ఇవే...

ఆకుపచ్చ: అవకాడొ, బ్రకోలి, చైనీస్ క్యాబేజి, ఆకుపచ్చ యాపిల్స్ పియర్స్ కివి.



తెలుపు: తెల్ల మొక్కజొన్న, టర్నిప్, తెల్ల పీచ్ పళ్లు.
ఎరుపు: బీట్రూట్, ఎర్రని జామ, పంపరపనస, ఎర్రని ద్రాక్ష, స్ట్రాబెర్రీ.
పసుపు: గోల్డెన్ కివి, నిమ్మ, మామిడి, పైనాపిల్, చిలకడ దుంప, అత్తిపళ్లు
నీలం, వంకాయ: బ్లాక్ కరెంట్, వంకాయలు, ద్రాక్ష, వంకాయ రంగు క్యాబేజీ, ఎండుద్రాక్ష.

పేగులు జారితే.. ప్రమాదమే

ఏదైనా అంతర్గత అవయవం తన స్థానం నుంచి బయటకు చొచ్చుకురావటాన్నే 'హెర్నియా' అంటారు. దీన్లో ఎన్నో రకాలున్నా అత్యంత సాధారణంగా కనిపించే సమస్య...' ఇంగ్వైనల్ హెర్నియా'. దీన్లో పొత్తికడుపులోని పేగులు పొట్ట దగ్గరున్న కణజాలాన్ని నెట్టుకుంటూ చర్మం అడుగున ఓ మూటలాగా బయటకు చొచ్చుకొని కనిపిస్తాయి. ఈ రకం హెర్నియా పొత్తికడుపు, గజ్జల దగ్గర స్పష్టంగా కనిపిస్తుంది.

ఎవరిలోనైనా హెర్నియా లక్షణాలు ఒకేలా ఉంటాయి. అవేంటంటే...

- దగ్గినప్పుడు, వంగినప్పుడు, వ్యాయామం చేస్తున్నప్పుడు నొప్పి ఎక్కువవుతుంది.

పసికందుల్లో

తల్లి గర్భంలో ఏడునెలల వయసు మగపిండంలో బీజాలు పొత్తికడుపులో ఉండి ప్రసవానికి ముందు కిందకి జారతాయి. ఒకవేళ బిడ్డ ముందుగానే ఏడు నెలలకే పుడితే బీజాలు కిందకి రాక లేదా పేగులు, కొవ్వు, ద్రవం పొత్తికడుపులోని బలహీన ప్రదేశంలోకి చొచ్చుకొచ్చి హెర్నియా తయారవుతుంది. దాంతో ఈ పిల్లలు బొడ్డు లేదా గజ్జల్లో వాపుతో పుడతారు. బొడ్డు వాచినట్టు కనిపిస్తుంది కాబట్టే ఈ రకం హెర్నియాను 'అంబెలికల్ హెర్నియా' అంటారు. ఈ సమస్య బిడ్డ పుట్టిన కొన్ని నెలల్లో కూడా కనిపించవచ్చు. ఇలాంటప్పుడు లాప్రోస్కోపీ టెక్నిక్‌తో ఆ ప్రదేశాన్ని చేరుకుని చర్మపు తిత్తికి దారంతో ముడి వేసి వదిలేస్తారు. ఇలా ముడివేయటం వల్ల పేగులు మళ్లీ తిత్తిలోకి చేరుకోకుండా ఉంటాయి.

- నొప్పి సూదిదో గుచ్చినట్టు ఉంటుంది.
- గజ్జల్లో బరువుగా ఉంటుంది.
- పురుషుల్లో బీజాల వాపు కనిపిస్తుంది.

ఎందుకొస్తుంది?

హెర్నియాకు ఎన్నో కారణాలున్నాయి. పుట్టుకతోనే మన పొత్తికడుపులో 'ఇంగ్వైనల్ కెనాల్' అనే సహజసిద్ధమైన ఓపెనింగ్ ఉంటుంది. ఏడవ నెల గర్భంలో మగపిల్లల్లోనైతే ఈ కెనాల్‌లో బీజాలు చోటు చేసుకుని ఉండి ప్రసవానికి ముందు కిందకి జారతాయి. ఆడపిల్లల్లోనైతే ఈ కెనాల్‌లో మూత్రాశయ లిగ్మెంట్లు ఉండి ప్రసవానికి కొద్ది రోజుల ముందు కిందకి జారతాయి. ఈ రకమైన శారీరక లక్షణం కారణంగా స్వతస్సిద్ధంగానే స్త్రీపురుషుల పొత్తికడుపుల్లో ఖాళీ ప్రదేశం ఉంటుంది. ఈ కెనాల్స్ ఉన్న చోట కణజాలం కూడా కాస్త బలహీనంగా ఉంటుంది.

స్త్రీలల్లో...

స్త్రీలల్లో కనిపించే వెంట్రల్ హెర్నియాకు ప్రధాన కారణం 'సిజేరియన్ ఆపరేషన్'. ఈ సర్జరీకి ఎక్కువ సమయం పట్టినా, సర్జరీ కోత నిలువుగా ఉన్నా, చర్మపు పొరలకు కుట్లు సరిగా వేయకపోయినా, కుట్లు ఇన్‌ఫెక్షన్‌కు గురయినా హెర్నియా వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అలాగే ఎక్కువ ప్రసవాల ఫలితంగా పొత్తికడుపు కండరాలు పటుత్వం తగ్గినా ఈ సమస్య తలెత్తవచ్చు. కాబట్టి సిజేరియన్ చేయించుకున్న స్త్రీలు హెర్నియా రాకుండా ఉండటం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. సర్జరీ నుంచి కోలుకున్న రెండు నెలల నుంచే పొత్తికడుపును బలపరిచే వ్యాయామాలు చేయాలి. సాధారణ ప్రసవమైన స్త్రీలు ప్రసవమైన రెండు వారాలనుంచే వ్యాయామాలు మొదలుపెట్టాలి.




వృద్ధుల్లో...

వయసు పెరిగేకొద్దీ కండరాల పటుత్వం తగ్గుతుంది. అలాగే చర్మం అడుగునుండే కణజాలం పటుత్వం కూడా! దాంతో ఆ ప్రదేశం ఒత్తిడికి లోనైనప్పుడు హెర్నియా వచ్చే అవకాశాలు పెరుగుతాయి. పిల్లలు దగ్గినంత బలంగా వృద్ధులు దగ్గలేరు. బలంగా దగ్గి కళ్లెను బయటకు తీసుకురాలేక తక్కువ శక్తితో దగ్గుతూ ఉంటారు. దాంతో పొత్తికడుపు ఒత్తిడికి గురై హెర్నియా వస్తుంది. కొందరిలో ప్రొస్టేట్ గ్రంథి వ్యాధులకు గురై పరిమాణం పెరుగుతుంది. దీని వల్ల కూడా హెర్నియా తలెత్తుతుంది. వృద్ధుల్లో మధుమేహం అదుపు తప్పినా హెర్నియా వచ్చే అవకాశాలు పెరుగుతాయి. వృద్ధుల్లో మలబద్ధకం సమస్య ఉంటుంది. దాంతో మల విసర్జన కోసం గట్టిగా ముక్కటం వల్ల కూడా హెర్నియా వస్తుంది.

నిర్లక్ష్యం చేస్తే?

చర్మపు తిత్తిలోకి పేగులు దిగిపోయి పొత్తికడుపు లేదా గజ్జల్లో హెర్నియా కనిపిస్తే వీలైనంత తొందరగా వైద్యుల్ని సంప్రతించి చికిత్స మొదలుపెట్టాలి. లేదంటే పొట్టలో చర్మం అడుగున ఏర్పడిన రంధ్రం పెద్దదైపోతూ సమస్య మరింత జటిలమవుతుంది. కొన్ని సందర్భాల్లో ఈ తిత్తిలోకి చేరుకున్న పేగులకు రక్త ప్రసరణ అందక కుళ్లిపోవచ్చు కూడా! ఇలాంటప్పుడు ఆ పేగులు సెప్టిక్ అవుతాయి. ఇన్‌ఫెక్షన్ పెరిగి ప్రాణాలకే ప్రమాదం సంభవించవచ్చు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేసే కొంతమందిలోనైతే పేగుల పనితీరు తలకిందులై మలం, ఆహారం కలిసిపోయి అవి వెళ్లే మార్గాలు తారుమారవ్వచ్చు. ఇది ఎంతో ప్రమాదకరమైన పరిస్థితి. ఇలా జరగకుండా ఉండాలంటే హెర్నియా లక్షణాలు కనిపించగానే ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి.

మనం ఎంత దూరం నడుస్తున్నామో.. మన గుండె ఎంత వేగంగా కొట్టుకుంటుందో.. బీపీ.. సుగర్‌లు ఎంత ఉన్నాయో చెప్పే పరికరాలు ఇప్పటికే మనకు మార్కెట్లో అందుబాటులోకి వచ్చేశాయి. మన చర్మం లోపల నుంచి సెన్సర్ల ద్వారా సమాచారాన్ని సేకరించి ఇవి మనకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తూ వస్తాయి. మన శరీరంలో ఉన్న అవయవాలు ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకోవాలంటే ఎక్స్‌రేలు, అల్ట్రాసౌండ్, ఎంఆర్‌ఐలు అవసరమవుతాయి. అల్ట్రాసౌండ్ పరికరాలు- ఒక రకమైన ధ్వని తరంగాలను (సోనార్లు) శరీరంలోకి పంపి.. అవి వెనక్కి తిరిగి వచ్చినప్పుడు- వాటి ద్వారా శరీరంలోని అవయవాల పరిస్థితిని తెలియచెబుతాయి. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న అల్ట్రాసౌండ్ పరికరాలను ఒక చోట మాత్రమే ఉంచి ఉపయోగించగలుగుతాము. తాజాగా ఈ విషయంలో వైద్య శాస్త్రవేత్తలు జరుపుతున్న పరిశోధనలు విజయవంతమయ్యాయి. శరీరంపై టేపుల్లా అతికించుకొనే అల్ట్రాసౌండ్ పరికరాలు సమీప భవిష్యత్తులో అందుబాటులోకి రానున్నాయి. ఈ పరికరాలు ఎలా పనిచేస్తాయో తెలుసుకుందాం..



జయశంకర్ వర్సిటీలో బీటెక్, బీఎస్సీ ఆనర్స్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)-ఎంపీసీ స్ట్రీమ్ కింద నిర్వహిస్తున్న డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్, బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కేటగిరీల్లో సీట్లు ఉన్నాయి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బీటెక్‌లో గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం అలాగే బీఎస్సీ ఆనర్స్‌లో రూరల్ కోటా కింద 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. స్థానికులకు 85 శాతం సీట్లు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.


బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్): సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో మొత్తం 29 సీట్లు ఉన్నాయి. ఫార్మర్స్ కోటా కింద 20 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 9 సీట్లను నిర్దేశించారు.

బీటెక్(ఫుడ్ టెక్నాలజీ): నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మొత్తం 15 సీట్లు ఉన్నాయి. ఫార్మర్స్ కోటా కింద 10 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 5 సీట్లను నిర్దేశించారు.

బీఎస్సీ ఆనర్స్(కమ్యూనిటీ సైన్స్): హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో మొత్తం 42 సీట్లు ఉన్నాయి. వీటిలో 37 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. మూడేళ్ల డిప్లొమా(హోమ్ సైన్స్) అభ్యర్థుల కోసం అదనంగా 8 రెగ్యులర్ సీట్లు కేటాయించారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

- ఫార్మర్స్ కోటాలో రిజర్వేషన్ సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే అభ్యర్థులు గ్రామీణ రైతు కుటుంబాలకు చెందినవారై ఉండాలి. తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్ (కమ్యూనిటీ సైన్స్) ప్రోగ్రామ్‌లో రూరల్ కోటా కింద అప్లయ్ చేసుకోవాలంటే కూడా గ్రామాల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 17
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **దరఖాస్తులో కరెక్షన్స్:** ఆగస్టు 19.
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ), పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ(పీవీఎన్ఆర్‌టీవీయూ), సిద్దిపేట-ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) ఉమ్మడిగా వ్యవసాయ ఆధారిత డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి. బైపీసీ స్ట్రీమ్ కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరీల సీట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అగ్రికల్చరల్, వెటర్నరీ, హార్టికల్చర్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. ప్రొఫెసర్ జయశంకర్, శ్రీ కొండా లక్ష్మణ్ వర్సిటీల పరిధిలో ఒక్కోదానిలో 40 శాతం సీట్లు; పీవీ నరసింహారావు వర్సిటీ పరిధిలో 25 శాతం సీట్లను గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ప్రత్యేకించారు. మొత్తమ్మీద 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

తెలంగాణ వ్యవసాయ కళాశాలల్లో డిగ్రీ ప్రవేశాలు

బీఎస్సీ ఆనర్స్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్, హార్టికల్చర్ విభాగాలు ఉన్నాయి.
- పీజేటీఎస్ఏయూ పరిధిలోని రాజేంద్రనగర్, అశ్వారావుపేట, పొలాస, పాలెం, వరంగల్ అర్బన్, సిరిసిల్లా, ఆదిలాబాద్, తోర్నాల అగ్రికల్చరల్ కాలేజీల్లో మొత్తం 615 రెగ్యులర్ సీట్లు, 227 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. సైఫాబాద్ కమ్యూనిటీ సైన్స్ కాలేజీలో 38 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.
- ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ పరిధిలోని రాజేంద్రనగర్, మోజెర్ల, మల్యాల్ హార్టికల్చర్ కాలేజీల్లో మొత్తం 200 రెగ్యులర్ సీట్లు, 34 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.

బీటెక్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. స్పెషలైజేషన్ 'ఫుడ్ టెక్నాలజీ'.
- పీజేటీఎస్ఏయూ పరిధిలోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(నిజామాబాద్ జిల్లా-రుద్రూర్)లో 25 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.
- బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో 20 శాతం సీట్లను ఐకార్ కోటా కింద ప్రత్యేకించారు. వీటిని 'సీయూఈటీ(ఐకార్-యూజీ)2024' ఎగ్జామ్ స్కోర్, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ఐకార్ భర్తీ చేస్తుంది.

బీవీఎస్సీ & ఏహెచ్

- ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో వెటర్నరీ సైన్స్ ప్రధాన విభాగం.
- పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని రాజేంద్రనగర్, కోరుట్ల, మామునూర్ వెటర్నరీ సైన్స్ కాలేజీల్లో మొత్తం 184 సీట్లు ఉన్నాయి.

బీఎఫ్ఎస్సీ

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో ఫిషరీ సైన్స్ ప్రధాన విభాగం.
- పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని పెబ్బేర్ ఫిషరీ సైన్స్ కాలేజీలో 28 సీట్లు, నెల్లూరు జిల్లా-ముత్తుకూరు ఫిషరీ సైన్స్ కాలేజీలో 11 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఇంటర్ స్థాయిలో ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులందరూ తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లలో చేరాలంటే అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/hY129nKలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

రాజ్‌తరుణ్ ఎపిసోడ్‌లో కొత్త ట్విస్ట్





రాజ్‌తరుణ్, లావణ్య, హీరోయిన్ మాల్వీ మల్హోత్రా ఎపిసోడ్ సోమవారం సరికొత్త మలుపు తిరిగింది. ఈ ఎపిసోడ్‌లోకి కొత్త పాత్ర ఎంటర్ అయింది. తన కుమారుణ్ని ట్రాప్ చేసి, మాల్వీ ఆస్తి కాజేసిందని ముంబై నిర్మాత యోగేశ్ తల్లి సంచలన ఆరోపణలు చేస్తూ ఓ వీడియో విడుదల చేశారు. యోగేశ్, మాల్వీ కాల్ లిస్ట్‌ను కూడా ఆమె బయట పెట్టారు. ఆమె వెల్లడించిన సమాచారం ప్రకారం యోగేశ్ ముంబైలో ఓ చిన్న నిర్మాత. తన చిత్రంలో నటించడానికి వచ్చిన మాల్వీతో ప్రేమలో పడ్డారు యోగేశ్. వీళ్లిద్దరూ రెండేళ్ల సహజీవనం కూడా చేశారు. ఆ తర్వాత ఏమైందో ఏమో, తనని పెళ్లి చేసుకోవడానికి యోగేశ్ నిరాకరించాడనీ, కత్తితో తనపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించాడనీ ఆరోపిస్తూ మాల్వీ కేసు పెట్టడంతో యోగేశ్‌ను ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాలుగేళ్లుగా మాల్వీ తమ కుటుంబాన్ని ఇబ్బంది పెడుతోందని, తప్పుడు కేసులు పెట్టి తన కుమారుడిని జైలుకి పంపించిందని యోగేశ్ తల్లి వెల్లడించారు. రాజ్‌తరుణ్, లావణ్య కేసులో మాల్వీ ఇన్‌వాల్వ్ అయిన విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్నాననీ, అందుకే మాల్వీ బండారం బయటపెట్టాలని వీడియో విడుదల చేస్తున్నాననీ, తన కొడుకు ఇంకా జైలులోనే ఉన్నాడనీ, మాల్వీ అతని కెరీర్‌ను సర్వనాశనం చేసిందని చెబుతూ కన్నీళ్లు పెట్టుకున్నారు యోగేశ్ తల్లి.



ఆ లోటు తీర్చేలా 'డార్లింగ్'

నాని

ప్రియదర్శి నభానటేశ్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉపశీర్షిక. అశ్విన్‌రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా ఈ నెల 19న విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాని మాట్లాడుతూ "ఈ మధ్య కామెడీ చిత్రాలు తక్కువైపోయాయి. ఆ లోటు తీర్చేలా వచ్చే చిత్రమే 'డార్లింగ్'. ఈ సినిమా ఘనవిజయం సాధించాలి చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్. త్వరలోనే జగదీశ్ అనే కొత్త డైరెక్టర్‌తో మా నిర్మాణ సంస్థలో కొత్త చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఇందులో ప్రియదర్శినే హీరో" అని చెప్పారు. "ఈ సినిమా హిలేరియస్ ఎంటర్టైనర్. నాకు నటన పరంగా నానినే రోల్ మోడల్" అని ప్రియదర్శి అన్నారు. "కపుల్స్ మధ్య జరిగే సరదా సంఘటనల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాకు అందరూ కనెక్ట్ అవుతారు" అని దర్శకుడు అశ్విన్‌రామ్ చెప్పారు. "ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని నిర్మాత కె.నిరంజన్ రెడ్డి తెలిపారు.

మేడమ్ టుస్సాడ్స్‌లో రామ్‌చరణ్ విగ్రహం?



లండన్‌లో ఉన్న మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో మన హీరో రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారా? అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. రామ్‌చరణ్ పాపులారిటీ, ఆయన ఫాలోయింగ్‌ను గమనించిన మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తన విగ్రహం తయారీలో సహకరించడం కోసం రామ్‌చరణ్ లండన్‌లోనే ఉన్నారు. ఈ విగ్రహానికి ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే.. రామ్‌చరణ్ ఫ్రెంచ్ బార్బెట్ జాతికి చెందిన ఓ కుక్క పిల్ల రైమ్‌ను పెంచుకుంటున్నారు. ఎక్కడికి వెళ్లినా, ఏ దేశం సందర్శించినా తమతో పాటు రైమ్‌ను తీసుకెళ్లడం రామ్‌చరణ్ దంపతులకు అలవాటు. అందుకే రైమ్‌ను ఎత్తుకుని ఉన్న రామ్‌చరణ్ మైనపు బొమ్మనే మేడమ్ టుస్సాడ్స్‌లో ఏర్పాటు చేయనున్నారని సమాచారం.



అందుకే ఆ పెళ్లికి వెళ్లలేదు

తాప్సీ

అపర కుబేరుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ వివాహం రాధికతో జరిగిన సంగతి విదితమే. అంగరంగ వైభవంగా జరిగిన ఈ వివాహ వేడుకలకు భారతీయ చిత్ర పరిశ్రమలోని ప్రముఖులందరూ హాజరయ్యారు. ఆడారు, పాడారు. నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు. అయితే ఈ పెళ్లికి వివిధ కారణాల వల్ల హాజరు కాని సినీ ప్రముఖులు కూడా ఉన్నారు. వారిలో హీరోయిన్ తాప్సీ ఒకరు. తను ఆ పెళ్లికి ఎందుకు వెళ్లలేదో ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడిస్తూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు కూడా చేసింది. 'నాకు వాళ్లతో వ్యక్తిగత పరిచయం లేదు. నా ఉద్దేశంలో పెళ్లి అనేది అనుబంధాలతో కూడిన వేడుక. ఆతిథ్యం ఇచ్చే కుటుంబానికి, అతిథికి మధ్య ఏదో రకమైన అనుబంధం ఉండి తీరాలి. అటువంటి వివాహాలకే నేను హాజరవుతా. తెలియని వారి ఇంట జరిగే పెళ్లికి వెళ్లి ఇబ్బంది పడలేను' అని తాప్సీ చెప్పింది. ఏ విషయం గురించైనా నిర్మొహమాటంగా మాట్లాడడం మొదటినుంచీ తాప్సీకి అలవాటు. అందుకే అంబానీ ఇంట పెళ్లి గురించి కామెంట్ చేయడానికి ఆమె వెనుకాడలేదు.

ఓ మంచి సినిమా మీకు ఇవ్వబోతున్నా



'క' అనే ఒకే ఒక్క పదం టైటిల్‌తో హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న చిత్రం ట్రేడ్‌లో ఇప్పుడు ఆసక్తిగా మారింది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు సుజిత్, సందీప్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం త్వరలో తెలుగు సహా తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'మూడు 'క' లను నమ్ముకుని ఈ 'క' చిత్రం తీశాను. మొదటి క.. కథ. చాలా కథలు విని విభిన్నంగా ఉన్న ఈ చిత్రకథను ఎన్నుకున్నాం. రెండో క.. కిరణ్ అబ్బవరం., మూడో క.. కల. ఒక మంచి సినిమా తీసి పదిమందికి తోడుగా ఉండాలన్నది నా కల, అది ఈ సినిమాతో నెరవేరుతోంది. దర్శకులుగా పరిచయమవుతున్న సందీప్, సుజిత్ తొలి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకుంటారు' అని తెలిపారు.

'ఎటువంటి కథనైనా తెర పైకి తీసుకురావడానికి ధైర్యం కావాలి. కిరణ్ మాకు సపోర్ట్ ఇచ్చారు. మంచి టీమ్‌ను ఇచ్చారు. కొత్త డైరెక్టర్స్‌కు అలాంటి టీమ్ దొరకడం అదృష్టమే' అన్నారు దర్శకుల్లో ఒకరైన సుజిత్. మరో దర్శకుడు సందీప్ మాట్లాడుతూ 'ఎంతో రిసెర్చ్ చేసి, 80ల కాలం నాటి వస్తువులను సేకరించి, హై స్టాండర్డ్స్‌లో ఈ సినిమా తీశాం. ఫ్యామిలీ వాతావరణాన్ని క్రియేట్ చేసి మేం టెన్షన్ లేకుండా పని చేసే అవకాశాన్ని కిరణ్ కల్పించారు. 'క' అంటే కిరణ్ అబ్బవరం కాదు.. ఇందులో ఒక ప్రధాన పాత్ర ఉంది. అదేమిటో థియేటర్లలోనే చూడాలి' అన్నారు.

హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ' 'వీడి పని అయిపోయింది' అని ఎవరైనా అంటే నమ్మకండి. మన పని అయిందా లేదా అనేది మనకు మాత్రమే తెలుసు. అలాగే నా పని అయిపోయిందా లేదా అనేది నాకు తెలుస్తుంది. అలా అనిపించినప్పుడు సినిమాలు చేయను. 'క' సినిమా మొదలై ఏడాదిన్నర అయింది. ఒక మంచి సినిమా కోసం మేమంతా కష్టపడ్డాం. ఒక మంచి సినిమాను మళ్లీ మీకు ఇవ్వబోతున్నా. మీ ప్రేమను పొందడానికి ఎదురు చూస్తున్నా. 'క' ప్రొడక్షన్ వర్క్ అంతా రహస్య చూసుకుంది. సినిమా రీచ్ అయ్యాక మాట్లాడతా అని చెప్పింది. అందుకే ఇక్కడికి రాలేదు' అన్నారు.

థౌజండ్ వాలా టపాసులు



ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక సినిమా హిట్ అనిపించుకుంటే సరిపోదు.. కలెక్షన్లలో సునామీ సృష్టించి.. నిర్మాతలకు లాభాల పంట పండించాల్సిందే. వసూళ్ల పరంగా ఒకప్పుడు రూ.వంద కోట్ల కలెక్షన్స్ సాధించడమే అద్భుతమనిపించేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. పెరిగిన టికెట్ రేట్ల కారణంగా కలెక్షన్ల లెక్కలు మారిపోయాయి. రూ.వంద కోట్లు .. రూ.రెండు వందల కోట్లు.. రూ.మూడు వందల కోట్లు.. రూ..నాలుగు వందల కోట్లు.. రూ.ఐదొందల కోట్లు... ఇదీ లెక్క ఇప్పుడు. అలా పెరుగుతూ వచ్చిన కలెక్షన్ల లెక్కలకు తాజా టార్గెట్ రూ. వెయ్యి కోట్లు. తాజాగా 'కల్కి' చిత్రం రూ. వెయ్యి కోట్ల రికార్డును సాధించడంతో తెలుగు సినిమా సత్తా మరోసారి చాటిచెప్పినట్లయింది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇంతవరకు రూ. వెయ్యికోట్లు వసూలు చేసిన చిత్రాల సంఖ్య ఏడైతే వాటిలో మూడు సినిమాలు మనవే కావడం గర్వంతో కాలర్ ఎగరెయ్యాల్సిన అంశమే.

'యుద్ధం.. యుద్ధం' అంటూ బరిలోకి దిగి బాక్సాఫీస్‌ను షేక్ చేశారు ఆమిర్ ఖాన్. ఆయన నటించిన 'దంగల్' చిత్రం 2016లో రిలీజై.. అప్పటివరకూ ఉన్న సినిమా రికార్డులను కోలుకోలేని దెబ్బ కొట్టింది. నితీశ్ తివారీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం.. గ్లోబల్ బాక్సాఫీస్ దగ్గర రూ.2వేలపై చిలుకు కలెక్షన్లను సాధించింది. ఈ సినిమా మల్లయోధుడు మహావీర్‌సింగ్ ఫోగట్, ఆయన కుమార్తెల జీవితాల్లోని సంఘటనల ఆధారంగా తెరకెక్కింది.

కలెక్షన్లలో 'మాహిష్మతీ సామ్రాజ్య' విజృంభన


దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్ నటించిన 'బాహుబలి'కి కొనసాగింపుగా వచ్చిందే 'బాహుబలి 2'. 2017లో రిలీజైన ఈ సినిమా తెలుగు చిత్ర పరిశ్రమ హద్దులు దాటి ప్రపంచవ్యాప్త హిట్‌గా నిలిచి.. అసలు సిసలు పాన్ ఇండియా సినిమా సక్సెస్ అంటే ఎలా ఉంటుందో అందరికీ రుచి చూపించింది. ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా రూ.1810 కోట్లు కలెక్షన్ల మార్క్ అందుకుంది.

'అసలు సిసలు మల్టీస్టారర్'

దర్శకధీరుడు రాజమౌళి రామ్‌చరణ్, జూనియర్ ఎన్టీఆర్‌తో చేసిన మ్యాజికల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'ఆర్‌ఆర్‌ఆర్'. ఈ కల్పిత పీరియాడికల్ యాక్షన్ డ్రామాలోని పోరాటఘట్టాలు.. పాటలు చూసి పరదేశీయులు ఫిదా అయ్యారు. ఈ సినిమాతో రాజమౌళి సినిమాలకు గ్లోబల్ క్రేజ్ పీక్స్‌కు చేరింది. ఇందులోని 'నాటు నాటు ' పాటకు ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే. హాలీవుడ్ దిగ్గజ దర్శకులు జేమ్స్ కామెరూన్, రూసో బ్రదర్స్ ప్రశంసలు పొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1400 కోట్లు వసూళ్లు చేసింది.







'రాకీ భాయ్' మానియా

యష్ నటించిన 'కేజీఎఫ్'తో కన్నడ ఇండస్ట్రీ వైపు దేశం మొత్తం చూసేలా చేసిన డైరెక్టర్ ప్రశాంత్ నీల్. ఆయన దర్శకత్వంలో ఈ చిత్రానికి కొనసాగింపుగా తెరకెక్కిన 'కేజీఎఫ్ 2'తో కన్నడ సినిమా స్థాయి గ్లోబల్ రేంజ్‌కు ఎదిగింది. యాక్షన్ ప్రియులకు అత్యంత చేరువైన ఈ సినిమా దాదాపు రూ.1300 కోట్లను కలెక్ట్ చేసింది.

'వింటేజ్ కింగ్ ఖాన్' ప్రభంజనం

వరుస ఫ్లాపుల్లో ఉన్న షారుక్ ఖాన్‌ను మళ్లీ హిట్ ట్రాక్‌లోకి ఎక్కించిన చిత్రం 'పఠాన్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.వెయ్యి కోట్లు పైచిలుకు కలెక్షన్లను రాబట్టింది. ఇందులో రా ఏజెంట్‌గా షారుక్, ఐఎస్ఐ ఏజెంట్ పాత్రలో నటించిన జాన్ అబ్రహమ్‌తో చేసిన పోరాటాలు సినిమాకే స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.

'జవాన్' మ్యాజిక్

తమిళ దర్శకుడు అట్లీతో షారుక్ ఖాన్ చేసిన సినిమా 'జవాన్'. సమాజాన్ని దుర్మార్గుల బారి నుంచి కాపాడడానికి తండ్రిగా.. కొడుకుగా షారుక్ ఇందులో డ్యూయెల్ రోల్ పోషించారు. అత్యద్భుత పోరాట ఘట్టాలతో అందరినీ కట్టిపడేసిన ఈ చిత్రం దాదాపు రూ.1200 కోట్ల కలెక్షన్లు కొల్లగొట్టింది.

'కల్కి' హవా

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన విజువల్ వండర్ 'కల్కి 2898 ఏ.డీ'. జూన్‌లో విడుదలైన ఈ సినిమాలో పురాణాల్ని, సైన్స్ ఫిక్షన్‌ను మిళితం చేసి దర్శకుడు అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. ఇందులో అమితాబ్, ప్రభాస్ మధ్య వచ్చే పోరాట ఘట్టాలు.. కాంప్లెక్స్, కాశీ, శంబల ప్రాంతాల విజువల్స్. పతాక సన్నివేశాల్లో ప్రభాస్ కర్ణుడిగా కనిపించే దృశ్యం సినిమా విజయాన్ని మరో లెవెల్‌కు తీసుకెళ్లాయి. రిలీజైన 15 రోజులకే రూ.1000 కోట్ల కలెక్షన్లను అందుకుని.. మరిన్ని రికార్డులు నెలకొల్పే దిశగా దూసుకుపోతోంది.

నటుడు రక్షిత్ శెట్టిపై కేసు



కాపీరైట్ ఉల్లంఘించారనే ఆరోపణలతో శాండల్‌వుడ్ నటుడు రక్షిత్‌శెట్టిపై కేసు నమోదైంది. 'న్యాయ ఎల్లిదె..?', 'గాలి మాతు' అనే రెండు సినిమాల పాటలను అనుమతి లేకుండా ఆయన వినియోగించుకున్నారని ఎంఆర్‌టీ మ్యూజిక్ సంస్థ భాగస్వామి నవీన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బెంగళూరు యశ్వంతపుర పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. రక్షిత్‌శెట్టిని పోలీసులు విచారణకు పిలిచే అవకాశం ఉంది.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

పాత్రను ఇష్టపడి చేసిన సినిమా



బిగ్‌బాస్ ఫేమ్ రవికృష్ణ కీలక పాత్రలో నటించిన చిత్రం 'బర్త్‌డే బాయ్'. విస్కీ దర్శకత్వంలో ఐ.భరత్ నిర్మించారు. ఈ నెల 19న సినిమా విడుదలవుతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా రవికృష్ణ మీడియాతో ముచ్చటించారు. "నాకు రియల్ లైఫ్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కే చిత్రాలంటే చాలా ఇష్టం. ఇందులో నా పాత్ర బాగా నచ్చి కథ విన్న వెంటనే ఒప్పేసుకున్నాను. ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతీ పాత్ర కూడా ఎంటర్టైన్ చేస్తుంది. ఎం.ఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితుల జీవితం చుట్టూ ఈ సినిమా కథ నడుస్తుంది. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది." అని చెప్పారు.

యూరో కింగ్ స్పెయిన్



నాలుగు టైటిళ్లతో రికార్డు
ఫైనల్లో 2-1తో విజయం
ఇంగ్లండ్ మరో'సారీ'

ప్రైజ్‌మనీ
స్పెయిన్‌కు: రూ. 72 కోట్లు
ఇంగ్లండ్‌కు: రూ. 45 కోట్లు

బెర్లిన్: యూరోపియన్ చాంపియన్‌షిప్‌లో స్పెయిన్ జైత్రయాత్ర సంచలనరీతిలో ముగిసింది. పుష్కరకాలం తర్వాత ఫైనల్‌కు చేరిన ఈ జట్టు టైటిల్ కోసం పట్టువదలకుండా పోరాడింది. ఆదివారం అర్ధరాత్రి ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో 2-1 తేడాతో ఇంగ్లండ్‌ను మట్టికరిపించింది. తద్వారా ఏ జట్టుకూ సాధ్యంకాని రీతిలో ఏకంగా నాలుగో టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. వాస్తవానికి ఇరు జట్లు కూడా నువ్వా.. నేనా? అనే తరహాలో పోరాడిన తీరుకు ఎక్స్‌ట్రా సమయం తప్పదనిపించింది. కానీ ఆట చివర్లో స్ట్రయికర్ మైకేల్ ఓయర్జాబల్ (86) చేసిన మెరుపు గోల్‌తో విజయం అందుకుంది. గతంలో స్పెయిన్ 1964, 2008, 2012లో యూరో విజేతగా నిలిచింది. జట్టు తరఫున మరో గోల్ నికో విలియమ్స్ (47) సాధించాడు. అటు ఇంగ్లండ్ తరఫున ఏకైక గోల్‌ను సబ్‌స్టిట్యూట్ మిడ్ ఫీల్డర్ కోల్ పామర్ (73) అందించాడు. మరోవైపు 2020 యూరోలోనూ రన్నరప్‌గా నిలిచిన ఇంగ్లండ్ ఈసారి కూడా అదే ఫలితంతో సరిపెట్టుకుంది. అలాగే 1996 యూరో క్వార్టర్స్‌లో చివరిసారి ఈ రెండు జట్లు తలపడగా.. అప్పటి ఓటమికి స్పెయిన్ గట్టిగానే బదులుతీర్చుకుంది.

ఆఖర్లో అద్భుతం: ఫైనల్ మ్యాచ్ ఆరంభం నుంచే ఇరు జట్ల ఆటగాళ్లు బంతిని తమ ఆధీనంలో ఉంచుకునేందుకు ప్రయత్నించారు. దీంతో హోరాహోరీగా సాగిన తొలి అర్ధభాగంలో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. 45వ నిమిషంలో ఇంగ్లండ్‌కు అవకాశం వచ్చినా సఫలం కాలేదు. ఇక రెండో భాగం 47వ నిమిషంలో లామినే యమాల్ అందించిన పాస్‌ను నికో విలియమ్స్ గోల్‌గా మల్చడంతో స్పెయిన్ ఖాతా తెరిచింది. అయితే 73వ నిమిషంలో ప్రత్యర్థి ఆటగాళ్లను ఏమార్చుతూ పామర్ నేరుగా సంధించిన బంతి గోల్‌పోస్టులోకి వెళ్లడంతో ఇంగ్లండ్ పోటీలోకి వచ్చింది. 1-1తో స్కోరు సమంగా మారిన వేళ.. పోటీ మరింత తీవ్రమైంది. అటు నిర్ణీత సమయం ముగుస్తున్నా మరో గోల్ నమోదు కాకపోవడంతో ఉత్కంఠ పెరిగింది. ఈ దశలో కుకురెల్లా లెఫ్ట్ వింగ్ వైపు బంతిని పాస్ చేయగా.. మెరుపు వేగంతో కదిలిన ఓయర్జాబల్ సిక్స్ యార్డ్ ఏరియా నుంచి బంతిని గోల్‌పోస్టులోకి పుష్ చేశాడు. అంతే.. స్పెయిన్ శిబిరంలో జోష్ ఆకాశాన్నంటింది. అయితే స్కోరును సమం చేసేందుకు 90వ నిమిషంలో ఇంగ్లండ్ ప్లేయర్ల రెండు హెడర్ ప్రయత్నాలను స్పెయిన్ అద్భుతంగా వమ్ము చేసి మ్యాచ్‌ను కాపాడుకోగలిగింది.

ఎదురుచూపులే..

సాకర్ పుట్టినిల్లుగా చెప్పుకొనే ఇంగ్లండ్ జట్టు దాదాపు ఆరు దశాబ్దాలుగా ఓ మేజర్ టైటిల్ కోసం ఎదురుచూస్తూనే ఉంది. 1966లో చివరిసారిగా ఈ జట్టు ఫిఫా వరల్డ్ కప్‌ను గెలిచింది. అప్పటి నుంచీ ఎన్ని ప్రయత్నాలు చేసినా వారిని అదృష్టం మాత్రం వరించడం లేదు. వరుసగా రెండుసార్లు యూరో ఫైనల్‌కు చేరినా కప్‌ను అందుకోలేకపోవడం ఆ జట్టు అభిమానులను దారుణంగా నిరాశపరిచింది. టోర్నీలో మెరుగ్గానే ఆడినా ఈ తుది పోరు ఓటమి తమను చాలాకాలం వెంటాడుతుందని కెప్టెన్ హ్యారీ కేన్ ఆవేదన వ్యక్తంచేశాడు.

1
యూరో చాంపియన్‌షిప్‌ను అత్యధిక సార్లు (4) గెలిచిన జట్టుగా స్పెయిన్. అలాగే టోర్నీలో వరుసగా ఏడు మ్యాచ్‌లను గెలవడం కూడా ఏ టీమ్‌కైనా ఇదే తొలిసారి. దీంతోపాటు అత్యధిక గోల్స్ (15) కూడా స్పెయిన్ ఆటగాళ్లే సాధించారు.



యమాల్‌కు అవార్డు

స్పెయిన్ యువ ఫార్వర్డ్ లామినే యమాల్‌కు యంగ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కింది. తాజా యూరోలో అతడు అత్యధికంగా నాలుగు గోల్స్‌లో భాగస్వామ్యం కాగా.. సెమీస్‌లో గోల్ సాధించిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. యమాల్ శనివారమే 17వ వడిలోకి ప్రవేశించాడు.



థామస్ ముల్లర్ వీడ్కోలు

బెర్లిన్: జర్మనీ ఫుట్‌బాల్ దిగ్గజం థామస్ ముల్లర్ 14 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికాడు. స్వదేశంలో జరిగిన యూరో కప్‌లో అతడు పెద్దగా ప్రభావం చూపలేదు. అలాగే జట్టు కూడా క్వార్టర్స్‌లోనే ఇంటిముఖం పట్టింది. దీంతో 34 ఏళ్ల మిడ్‌ఫీల్డర్ ముల్లర్ ఆటకు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాడు. 2010లో అరంగేట్రం చేసిన ముల్లర్ అదే ఏడాది జరిగిన వరల్డ్‌కప్‌లో గోల్డెన్ బూట్ దక్కించుకున్నాడు. మొత్తంగా 131 మ్యాచ్‌ల్లో 45 గోల్స్ సాధించిన ముల్లర్.. 2014లో ఫిఫా వరల్డ్ కప్ గెలుపులోనూ కీలకపాత్ర పోషించాడు.

సాత్విక్ జోడీకి సులువైన డ్రా

పారిస్ ఒలింపిక్స్

న్యూఢిల్లీ: స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయానికి పారిస్ ఒలింపిక్స్‌లో సులువైన డ్రా లభించింది. బ్యాడ్మింటన్ డబుల్స్ స్వర్ణ పతక రేసులో హాట్ ఫేవరెట్ సాత్విక్-చిరాగ్ జోడీకి మూడో సీడ్ దక్కింది. గ్రూప్-సిలోని భారత్ ద్వయానికి ఇండోనేసియా జోడీ, వరల్డ్ నెంబర్-6 ఫజార్ అల్ఫియాన్-మహ్మద్ రియాన్ నుంచి గట్టి పోటీ ఎదురవనుంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ప్రపంచ 31 ర్యాంకర్ మార్క్ లామ్స్‌ఫస్-మార్విన్ సిడెల్ (జర్మనీ), వరల్డ్ ర్యాంక్ 43 లుకాస్ కోర్వీ-రొనాన్ లాబార్ (ఫ్రాన్స్)తో సాత్విక్ జోడీ పోటీపడనుంది. ఒలింపిక్స్ పురుషుల డబుల్స్‌లో ఈసారి మొత్తం 17 జోడీలు తలపడతున్నాయి.



దివ్యాంగులను కించపరుస్తారా?

యువీ, భజ్జీ, రైనాపై కేసు నమోదు

న్యూఢిల్లీ: దివ్యాంగుల మనోభావాలను కించపరిచేలా వారిని అనుకరిస్తూ చేసిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారన్న ఫిర్యాదుతో మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్, సురేశ్ రైనా, గుర్‌కీరత్ మాన్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళితే.. ఇంగ్లండ్ వేదికగా ఆదివారం రాత్రి ముగిసిన వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ క్రికెట్ లీగ్ ఫైనల్లో యువరాజ్ కెప్టెన్సీలోని హర్భజన్, రైనా, ఊతప్ప తదితర మాజీలతో కూడిన ఇండియా చాంపియన్స్ జట్టు పాకిస్థాన్‌ను ఓడించి విజేతగా నిలిచింది. ఈ విజయాన్ని సెలెబ్రేట్ చేసుకునే క్రమంలో యువరాజ్, భజ్జీ, రైనా కాస్త అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు.

మరికొంత కాలం ఆడతా!

రిటైర్మెంట్‌పై రోహిత్

డాలస్ (యూఎస్): మరికొంత కాలం టెస్టులు, వన్డేలు ఆడతానని భారత కెప్టెన్ రోహిత్ శర్మ చెప్పాడు. వరల్డ్‌కప్ నెగ్గిన అనంతరం టీ20లకు హిట్‌మ్యాన్ రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం క్రికెట్ నుంచి బ్రేక్ తీసుకొన్న 37 ఏళ్ల రోహిత్.. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా అభిమాని అడిగిన ప్రశ్నకు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు. 'సుదీర్ఘ ప్రణాళికలు అంటూ ఏమీ లేవు. మరికొంత కాలం నేను ఆడుతుండగా చూస్తార'ని చెప్పాడు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్, చాంపియన్స్ ట్రోఫీలో కూడా టీమిండియాకు రోహిత్ సారథ్యం వహిస్తాడని బీసీసీఐ కార్యదర్శి జై షా కొద్ది రోజుల క్రితమే స్పష్టం చేశాడు.

ప్రైజ్‌మనీ
అర్జెంటీనాకు: రూ. 133 కోట్లు
కొలంబియాకు: రూ.58 కోట్లు



వారెవ్వా.. అర్జెంటీనా

16వ సారి కోపా కప్ కైవసం

- మార్టినెజ్ లేటు గోల్
- ఫైనల్లో 1-0తో కొలంబియాపై విజయం

మయామి గార్డెన్స్ (యూఎస్): లాటరో మార్టినెజ్ లేటు గోల్‌తో.. కోపా అమెరికా కప్‌లో డిఫెండింగ్ చాంప్ అర్జెంటీనా చరిత్ర సృష్టించింది. రికార్డు స్థాయిలో 16వ సారి టైటిల్‌ను సొంతం చేసుకొంది. సోమవారం జరిగిన ఫైనల్లో అర్జెంటీనా 1-0తో కొలంబియాను ఓడించింది. నిర్ణీత సమయంలో ఇరుజట్లూ గోల్ సాధించక పోవడంతో.. మ్యాచ్ ఫలితం అదనపు సమయానికి దారి తీసింది. ఈ క్రమంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన మార్టినెజ్.. 112వ నిమిషంలో జియోవని లో సెల్సో అందించిన చక్కని పాస్‌ను నేరుగా గోల్‌లోకి కొట్టి అర్జెంటీనాను గెలిపించాడు. దీంతో వరుసగా రెండోసారి మెస్సీ సేన టైటిల్‌ను ముద్దాడింది. 15 సార్లు కోపా విజేతగా నిలిచిన ఉరుగ్వేను అర్జెంటీనా అధిగమించింది. మ్యాచ్ బ్రేక్ సమయంలో కొలంబియా పాప్ స్టార్ షకీరా తన ఆటపాటలతో అభిమానులను ఉర్రూతలూగించింది. కాగా, అర్జెంటీనా విజయంతో స్వదేశంలో అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి.


షకీరా



బోరుమన్న మెస్సీ

అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీ కాలి గాయంతో మధ్యలోనే మ్యాచ్ నుంచి వైదొలగాల్సి వచ్చింది. 64వ నిమిషంలో వేగంగా పరిగెత్తుకొంటూ వెళ్లిన మెస్సీ కూలబడిపోయాడు. నడవలేకపోవడంతో ప్రాథమిక చికిత్స చేసి బయటకు తీసుకెళ్లారు. అయితే, అతడి కుడి కాలి చీలమండ వాచినట్టు స్పష్టంగా కనిపించింది. కీలక మ్యాచ్‌లో ఇలా దూరమవడంపై మెస్సీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. బెంచ్‌పై ఉన్న అతడు కన్నీళ్లు పెట్టుకొంటున్న వీడియో నెట్‌లో వైరల్‌గా మారింది.

ఫ్యాన్స్ రగడ..

భారీ సంఖ్యలో స్టేడియానికి తరలివచ్చిన ఫ్యాన్స్ గందరగోళం సృష్టించడంతో మ్యాచ్ గంటా 22 నిమిషాలు ఆలస్యంగా మొదలైంది. కొలంబియా అభిమానులు ఎక్కువగా స్టేడియంలోకి దూసుకొచ్చేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి అదుపు తప్పింది. కొందరు గేట్లు దూకి స్టేడియంలోకి చొరబడే ప్రయత్నం చేశారు. సెక్యూరిటీ సిబ్బంది అతి కష్టమ్మీద పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

లియోనెల్ చరిత్ర

కెరీర్‌లో అత్యధికంగా 45 టైటిళ్లు సాధించిన ఏకైక ఆటగాడిగా 37 ఏళ్ల లియోనెల్ మెస్సీ చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో బ్రెజిల్ దిగ్గజం డానీ ఆల్వ్స్ అత్యధికంగా 44 టైటిళ్ల రికార్డును అధిగమించాడు. 2005లో అండర్-20 వరల్డ్‌కప్‌తో లియోనెల్ ప్రస్థానం ఆరంభమైంది. 2022 ఫిఫా వరల్డ్‌కప్ సహా గత మూడేళ్లలో జట్టుకు 4 టైటిళ్లు అందించాడు. 2021లో మెస్సీ హయాంలో కోపా కప్ నెగ్గిన అర్జెంటీనా.. మళ్లీ టైటిల్‌నిలబెట్టుకొంది. క్లబ్ కెరీర్‌లో అత్యధికంగా 39 టైటిళ్లను మెస్సీ సాధించాడు.

బిజినెస్

వాణిజ్య లోటు రూ.1.76 లక్షల కోట్లు

ఎగుమతుల్లో వృద్ధి 2.5 శాతం
దిగుమతుల్లో వృద్ధి 5 శాతం



న్యూఢిల్లీ: ప్రపంచ దేశాలు తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్న సమయంలో సైతం దేశీయ ఎగుమతుల రంగం జూన్ నెలలో 2.56 శాతం వృద్ధిని నమోదు చేసింది. జూన్ నెల ఎగుమతులు 3,520 కోట్ల డాలర్లుగా (రూ. 2.95 లక్షల కోట్లు) నమోదు కాగా వాణిజ్య లోటు 2,098 కోట్ల డాలర్లకు (రూ.1.76 లక్షల కోట్లు) పెరిగింది. గత ఏడాది జూన్‌లో వాణిజ్య లోటు 1,919 కోట్ల డాలర్లుంది (రూ.1.61 లక్షల కోట్లు). కాగా దిగుమతులు 5 శాతం పెరిగి 5,618 కోట్ల డాలర్లకు (రూ.4.72 లక్షల కోట్లు) చేరాయి. సోమవారం వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం జూన్ నెలలో క్రూడాయిల్, పప్పులు, ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులు పెరిగాయి. ఇదిలా ఉండగా ఏప్రిల్-జూన్ నెలల మధ్య కాలంలో ఎగుమతులు 5.84 శాతం వృద్ధితో 10,996 కోట్ల డాలర్లకు (రూ.9.24 లక్షల కోట్లు) చేరుకోగా దిగుమతులు 7.6 శాతం పెరిగి 17,223 కోట్ల డాలర్లకు (రూ.14.47 లక్షల కోట్లు) చేరాయి. ఈ మూడు నెలల వాణిజ్య లోటు 5,616 కోట్ల డాలర్ల (రూ.4.72 లక్షల కోట్లు) నుంచి 6,226 కోట్ల డాలర్లకు (రూ.5.23 లక్షల కోట్లు) పెరిగింది. ప్రస్తుత ధోరణిని చూసినట్టయితే ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఎగుమతులు 80 వేల కోట్ల డాలర్ల (రూ.67.20 లక్షల కోట్లు) స్థాయిని దాటవచ్చని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భర్త్వాల్ అంచనా వేశారు. ఇదిలా ఉండగా 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో వస్తు సేవల మొత్తం ఎగుమతులు 20 వేల కోట్ల డాలర్లుగా (రూ.16.80 లక్షల కోట్లు) ఉన్నాయని ఆయన చెప్పారు. ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, కాఫీ, రసాయనాలు ప్రధానంగా ఎగుమతుల వృద్ధికి దోహదపడినట్టు తెలిపారు.

16 నెలల గరిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

ఆహార వస్తువులు ప్రత్యేకించి కూరగాయలు, తయారీ వస్తువుల ధరలు పెరగడంతో జూన్ నెలలో టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) 3.36 శాతానికి దూసుకుపోయింది. ఇది 16 నెలల గరిష్ఠ స్థాయి. ద్రవ్యోల్బణం పెరగడం వరుసగా ఇది నాలుగో నెల. మే నెలలో ఇది 2.61 శాతం ఉండగా గత ఏడాది జూన్‌లో మైనస్ 4.18 శాతం ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఆహార వస్తువుల ధరలు 10.87 శాతం, కూరగాయల ధరలు 38.76 శాతం పెరిగాయి. ప్రత్యేకించి ఉల్లిపాయల ధర 93.35 శాతం, బంగాళాదుంప ధర 66.37 శాతం పెరిగింది. పప్పుల ధరల్లో 21.64 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ఇవి కాకుండా పళ్ల ధర 10.14 శాతం, తృణధాన్యాల ధర 9.27 శాతం, పాల ధర 3.37 శాతం పెరిగాయి.



పబ్లిక్ ఇష్యూకి సాయి లైఫ్ సైన్సెస్

రూ.800 కోట్ల సమీకరణ లక్ష్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): చాలా కాలం తర్వాత మరో హైదరాబాద్ ఫార్మా కంపెనీ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సాయి లైఫ్ సైన్సెస్ ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఈ ఐపీఓ ద్వారా రూ.800 కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇష్యూలో భాగంగా రూ.800 కోట్ల మొత్తానికి కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయటంతో పాటు ప్రమోటర్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా 6.15 కోట్ల షేర్లను విక్రయించనున్నట్టు ముసాయిదా పత్రాల్లో పేర్కొంది. ఓఎఫ్ఎస్ కింద ప్రమోటర్ సంస్థల్లో ఒకటైన సాయి క్వెస్ట్ సిన్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు ప్రైవేట్ ఈక్విటీ సంస్థలైన టీపీజీ ఆసియా 7 ఎస్ఎఫ్ పీటీఈ లిమిటెడ్, హెచ్‌బీఎం ప్రైవేట్ ఈక్విటీ ఇండియా కొంతమేరకు తమ వాటాలను విక్రయించనున్నాయి. ప్రస్తుతం సాయి లైఫ్ సైన్సెస్ ఈక్విటీలో టీపీజీ క్యాపిటల్‌కు 39.69 శాతం, హెచ్‌బీఎం ప్రైవేట్ ఈక్విటీ ఇండియాకు 5.5 శాతం వాటా ఉండగా సాయి క్వెస్ట్ సిన్‌కు 5.61 శాతం వాటాలున్నాయి.

రుణ చెల్లింపుల కోసమే రూ.600 కోట్లు

పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించనున్న రూ.800 కోట్ల మొత్తంలో రూ.600 కోట్లను రుణాల చెల్లింపులకు వినియోగించనున్నట్టు సాయి లైఫ్ సైన్సెస్ వెల్లడించింది. మిగిలిన మొత్తాలను సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వెచ్చించనున్నట్లు తెలిపింది. కాగా సాయి లైఫ్ సైన్సెస్.. ప్రముఖ అంతర్జాతీయ ఫార్మా, బయోటెక్నాలజీ కంపెనీలకు కొత్త ఔషధాల అభివృద్ధికి అవసరమైన ఎండ్ టు ఎండ్ సేవలు అందిస్తోంది. కాగా ఈ ఇష్యూకి కోటక్ మహీంద్రా క్యాపిటల్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ లిమిటెడ్, జెఫ్రీస్ ఇండియా, మోర్గాన్ స్టాన్లీ ఇండియా బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్స్‌గా వ్యవహరించనున్నాయి.

జీవీకే పవర్‌పై దివాలా ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్

ఆదేశాలు జారీ చేసిన ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్

ఐఆర్‌పీగా సతీష్ కుమార్ గుప్తా నియామకం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, జీవీకే నేచురల్ రీసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లపై దివాలా ప్రక్రియకు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించేందుకు గాను సతీష్ కుమార్ గుప్తాను ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్ (ఐఆర్‌పీ)గా నియమించింది. ఆస్ట్రేలియాలో బొగ్గు గనుల అభివృద్ధి కోసం జీవీకే కోల్ డెవలపర్స్ (సింగపూర్) పేరుతో జీవీకే గ్రూప్, జీవీకే నేచురల్ రీసోర్సెస్.. ఐసీఐసీఐ బ్యాంక్ (దుబాయ్, బహ్రెయిన్ శాఖలు), కెనరా బ్యాంక్ (లండన్ శాఖ), బ్యాంక్ ఆఫ్ బరోడా (లండన్, సింగపూర్ శాఖలు) నుంచి 2021లో 100 కోట్ల డాలర్ల రుణం తీసుకుంది. ఈ రుణానికి తోడు మరో 3.5 కోట్ల డాలర్లను లెటర్ ఆఫ్ క్రెడిట్ రూపంలో తీసుకున్నాయి. వడ్డీతో కలిపి ఈ మొత్తం దాదాపు 200 కోట్ల డాలర్ల వరకు అయ్యింది. కాగా ఈ రుణాలను చెల్లించటంలో విఫలం కావటంతో దీనికి హామీగా ఉన్న జీవీకే పవర్, జీవీకే నేచురల్ రీసోర్సెస్ ఈ మొత్తాన్ని వడ్డీతో సహా బ్యాంకులకు చెల్లించాలని లండన్ హైకోర్టు గత ఏడాది స్పష్టమైన తీర్పు వెలువరించింది. అయినా జీవీకే గ్రూప్ నుంచి స్పందన లేకపోవటంతో ఐసీఐసీఐ బ్యాంక్ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం ఇంటెరిమ్ రిలీఫ్ కోసం ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్‌ను ఆశ్రయించింది. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం సోమవారం నాడు ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్-2 మెంబర్ రాజీవ్ భరద్వాజ్ (జుడిషియల్), సంజయ్ పురి (టెక్నికల్).. జీవీకే పవర్, జీవీకే నేచురల్ రీసోర్సెస్‌పై పూర్తి స్థాయి దివాలా ప్రక్రియకు ఆదేశాలు జారీ చేశారు.

జెన్ టెక్నాలజీస్.. ఏఐ ఆధారిత రోబో 'ప్రహస్థ'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పని చేసే జెన్ టెక్నాలజీస్ మరిన్ని కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేసింది. అంతర్జాతీయ, దేశీయ రక్షణ మార్కెట్ కోసం ప్రత్యేకంగా ఈ ఉత్పత్తులను రూపొందించింది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల రక్షణ దళాలకు ట్రైనింగ్ సొల్యూషన్స్, యాంటీ డ్రోన్ టెక్నాలజీలను అందిస్తున్న ఈ సంస్థ తాజాగా కృత్రిమ మేధ (ఏఐ)తో పని చేసే 'ప్రహస్థ' అనే రోబోను మార్కెట్లోకి విడుదల చేసింది. కంపెనీ అనుబంధ సంస్థ ఏఐ టూరింగ్ టెక్నాలజీస్ భాగస్వామ్యంతో కంపెనీ ఈ రోబోను అభివృద్ధి చేసింది. దీనికి తోడు యాంటీ డ్రోన్ సిస్టమ్ కెమెరా 'హ్యాక్ఐ', రిమోట్ కంట్రోల్డ్ వెపన్ స్టేషన్ 'బార్బరిక్-యూఆర్‌సీడబ్ల్యుఎస్, సైనికులను తీసుకువెళ్లే వాహనాలు, తేలికపాటి పోరాట వాహనాలు (ఎల్‌సీవీ), బోట్లకు అవసరమైన 'స్థిర్ స్టాబ్ 640' అనే రగ్గడ్ స్టెబిలైజ్‌డ్ సైట్ డిజైన్డ్ పరికరాలను మార్కెట్లోకి విడుదల చేసింది. ఇందులో ప్రహస్థ రోబో లిడార్ (లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్)తో పనిచేస్తుంది. ఈ స్వయం చాలిత నాలుగు కాళ్ల రోబో ద్వారా రియల్ టైమ్ 3డీ టెరైన్ మ్యాపింగ్ చేసి మిషన్ ప్లానింగ్, నేవిగేషన్, త్రెట్ అసెస్‌మెంట్ చేయవచ్చని తెలిపింది.

కొత్త శిఖరాలకు సూచీలు

బ్యాంకింగ్ షేర్ల జోరు

ముంబై: విదేశీ నిధుల రాక పెరగడంతో పాటు పీఎస్‌యూ బ్యాంక్ షేర్లలో జరిగిన కొనుగోళ్ల ప్రభావంతో ఈక్విటీ మార్కెట్ రికార్డు ర్యాలీని కొనసాగించింది. సెన్సెక్స్ 145.52 పాయింట్ల లాభంతో 80,664.54 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 343.20 పాయింట్లు లాభపడి 80,862.54 పాయింట్లకు దూసుకుపోయింది. ఈ రెండూ చారిత్రక గరిష్ఠ స్థాయిలే. అదే విధంగా నిఫ్టీ కూడా కొత్త రికార్డులు నమోదు చేసింది. ఇంట్రాడేలో 132.9 పాయింట్లు లాభపడి 24,635.05 పాయింట్లకు దూసుకుపోయిన సూచీ చివరికి 84.55 పాయింట్ల లాభంతో 24,586.70 వద్ద స్థిరపడింది. పీఎస్‌యూ బ్యాంకులు ప్రకటించిన ఆర్థిక ఫలితాలు కూడా ఆశావహంగా ఉండడం బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు పెరిగేందుకు దోహదపడింది. పీఎస్‌యూ బ్యాంకుల్లో ఐఓబీ షేరు గరిష్ఠంగా 7.35 శాతం లాభపడగా కెనరా బ్యాంక్, పీఎన్‌బీ, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ షేర్లు కూడా లాభపడ్డాయి.

455 లక్షల కోట్లకు మార్కెట్ సంపద

ఈ ర్యాలీతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.455 లక్షల కోట్లకు దూసుకుపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి అది రూ.4,55,06,566.48 కోట్ల వద్ద స్థిరపడింది. రెండు రోజుల ర్యాలీలో ఇన్వెస్టర్ల సంపద రూ.3.85 లక్షల కోట్ల మేరకు పెరిగింది.

తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో పాలు పంచుకుంటాం: అసోచామ్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను అందించటంతో పాటు ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వాములవుతామని అసోచామ్ ఏపీ, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ప్రకటించింది. కీలకమైన సస్టేనబిలిటీ, సాధికారిత, ఆంత్రప్రెన్యూర్‌షిప్, డిజిటైజేషన్ వంటి విభాగాల్లో ఇరు రాష్ట్ర ప్రభుత్వాలతో అసోచామ్ కలిసి పనిచేస్తుందని అసోచామ్ ఏపీ, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ కె రవికుమార్ రెడ్డి, కో చైర్మన్ శ్రీధర్ పిన్నపురెడ్డి, అసోచామ్ ఏపీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కో చైర్మన్ బన్సీధర్ బండి తెలిపారు.

- పీఎల్ అసెట్ మేనేజ్‌మెంట్‌కు చెందిన ఆక్వా పీఎంఎస్ ఫండ్ ప్రారంభమైన ఏడాది కాలంలోనే మదుపరులకు 76 శాతం రిటర్నులు అందించింది ఫ్లెక్సీక్యాప్ పీఎంఎస్ స్ట్రాటజీస్‌లో ఈ ఫండ్ అత్యుత్తమంగా నిలిచింది. బెంచ్‌మార్క్ ఇండెక్స్ బీఎస్ఈ 500తో పోల్చితే రెండింతలు రిటర్నులు అందించింది.
- నికాన్ కార్పొరేషన్ అనుబంధ సంస్థ నికాన్ ఇండియా.. మార్కెట్లోకి సరికొత్త కెమెరా జెడ్6 ఐఐఐ తీసుకువచ్చింది. ప్రపంచంలో తొలి పార్షియల్ స్టేక్డ్ సీఎంఓఎస్ సెన్సర్ కెమెరా ఇది. ఇన్ కెమెరా ఆర్ఏడబ్ల్యూ, ఎన్-లాగ్ వీడియోస్, ఎక్సీపీడ్ 7 ప్రాసెసర్ ఈ కెమెరా ప్రత్యేకతలు. దీని ధర రూ.2,47,990.


అరబిందో ఫార్మా షేర్ల బైబ్యాక్!

ఈ నెల 18న బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకునే చాన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా షేర్ల బైబ్యాక్‌కు రెడీ అవుతోంది. ఈ నెల 18న జరగనున్న డైరెక్టర్ల బోర్డు సమావేశంలో జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలతో పాటు షేర్ల బైబ్యాక్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. బోర్డు సమావేశంలో దీనికి ఆమోద ముద్ర పడితే కంపెనీ చరిత్రలో షేర్ల బైబ్యాక్‌కి రావడం ఇదే మొదటిసారి అవుతుంది.

షేరు దూకుడు: బైబ్యాక్ వార్తలతో సోమవారం అరబిందో ఫార్మా షేరు లాభాల బాట పట్టింది. బీఎస్ఈలో ఒక దశలో ఆరు శాతం లాభంతో రూ.1,409.25 చేరుకుంది షేరుకిది 52 వారాల గరిష్ఠ స్థాయి. అయితే చివరికి లాభాల స్వీకరణతో 3.53 శాతం లాభంతో రూ.1,373.85 వద్ద ముగిసింది. గత ఏడాది కాలంలో అరబిందో ఫార్మా కంపెనీ షేరు మదుపరులకు దాదాపు 90 శాతం లాభాలు పంచింది.

టీవీఎస్ నుంచి రెండు కొత్త బైక్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టీవీఎస్ మోటార్ కంపెనీ అపాచీ ఆర్‌టీఆర్ సీరిస్‌లో రెండు సరికొత్త 160 సీసీ స్పోర్ట్స్ బైక్స్‌ను సోమవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో విడుదల చేసింది. అపాచీ ఆర్‌టీ ఆర్ 160, ఆర్‌టీఆర్ 160 4వీ ధరలు వరుసగా రూ.1,09,990, రూ.1,19,990 (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయని కంపెనీ ప్రీమియం బిజినెస్ హెడ్ విమల్ సంబ్లీ విలేకరులతో చెప్పారు. సోమవారమే ఈ బైక్స్ బుకింగ్ ప్రారంభమైంది. బుక్ చేసిన వారం పది రోజుల్లోనే ఈ రెండు బైకులను కస్టమర్లకు డెలివరీ చేస్తామని విమల్ తెలిపారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,640 ▼	67,500 ▼	99,700 ▼
ముంబై	72,932 ▲	66,806 ▲	91,835 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

16వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	555
వరంగల్	537	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	102	విజయవాడ	110
వరంగల్	102	గుంటూరు	110
కరీంనగర్	102	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	115
కర్నూలు	102	నెల్లూరు	115
విశాఖపట్నం	102	అనంతపురం	110
గోదావరి	110		

కాంగ్రెస్ ఖాతాలోకి బోడుప్పల్ కార్పొరేషన్

- మేయర్‌గా తోటకూర అజయయాదవ్ ఎన్నిక
- డిప్యూటీ మేయర్‌గా కొత్త స్రవంతి కిశోర్ గౌడ్

ఉప్పల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలోని బోడుప్పల్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఖాతాలో చేరింది. మేయర్‌గా మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్ కుమారుడు తోటకూర అజయ్ యాదవ్ ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా కొత్త స్రవంతి కిశోర్ గౌడ్ నియమితులయ్యారు. సోమవారం కీసర ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి మొత్తం 28 మంది కార్పొరేటర్లకు గాను 26 మంది హాజరయ్యారు. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మేయర్ బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవి గౌడ్‌లు హాజరు కాలేదు. హాజరైన కార్పొరేటర్లలో మేయర్ పదవికి కేవలం అజయ్ యాదవ్ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. డిప్యూటీ మేయర్‌కు ఇద్దరు పోటీ పడగా.. చివరకు 4వ డివిజన్ కార్పొరేటర్ కొత్త స్రవంతి కిశోర్ వైపే ఎక్కువ మంది మొగ్గు చూపారు. అనంతరం జరిగిన అభినందన సభలో మైనంపల్లి హన్మంతరావు, మలిపెద్ది సుధీర్ రెడ్డి, వజ్రేష్‌యాదవ్‌లు నూతనంగా ఎన్నికైన మేయర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో మాజీ మంత్రి మల్లారెడ్డి చేసిన అరాచకాలను బయట పెడతామని అజయ్ యాదవ్ హెచ్చరించారు. కాగా, ఇటీవల ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో పీఠం కాంగ్రెస్ కైవసమైంది.

అధునాతన పరికరాలు అందజేసినందుకు కృతజ్ఞతలు చెబుతూ సీఎం రేవంత్ చిత్ర పటానికి కాంగ్రెస్ అనుబంధ కలుగీత కార్మిక సంఘం నేతలు క్షీరాభిషేకం చేశారు.

రైతుల్లో వర్షాతిరేకం!

(మొదటి పేజీ తరువాయి)

వర్షం పడింది. వికారాబాద్ జిల్లా కోటపల్లి ప్రాజెక్టులోకి ఒక్కసారిగా ప్రవాహం పెరగడంతో ఆదివారం ప్రాజెక్టులోపలి భాగంలో పార్క్ చేసిన సందర్శకులకు సంబంధించిన రెండు వాహనాలు నీళ్లలో చిక్కుకుపోయాయి. అదేరోజు వాటిని ట్రాక్టర్‌తో బయటకు లాగేందుకు ప్రయత్నించగా ట్రాక్టర్ ఇంజన్ పల్టీకొట్టింది. సోమవారం పోలీసులొచ్చి గ్రామస్థుల సాయంతో వాహనాలను బయటకు తీశారు. జిల్లాలోని మర్పలి మండలం సిరిపురంలో ఓ ఆర్టీసీ బస్సులో బురదలో దిగబడింది. అతికష్టమ్మీద బయటకు లాగారు. కాగా, ఎగువన వర్షాలు పడుతుండటంతో గోదావరి, కృష్ణాలకు వరద కొనసాగుతోంది. శ్రీరాంసాగర్‌లోకి 3831, మేడిగడ్డకు 41,200, సమ్మక్క సాగర్‌కు 66వేలు, సీతమ్మసాగర్‌కు 72వేల క్యూసెక్కుల వరద వస్తోంది. కాగా అన్నారం బ్యారేజీ వద్ద చేపట్టిన జియో ఫిజికల్ పరీక్షలకు వరద కారణంగా అంతరాయం ఏర్పడింది. భద్రాద్రి జిల్లాలోని కిన్నెరసాని ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 407 అడుగులు కాగా, ప్రస్తుతం 402 అడుగుల మేర నీరు చేరింది. 2,200 క్యూసెక్కుల వరద వస్తోంది. ఇక కృష్ణానది పరిధిలో ఆల్మట్టికి నిలకడగా వరద కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి 25,123 క్యూసెక్కుల నీరు వస్తోంది. నారాయణపూర్ ప్రాజెక్టులోకి 10,404 క్యూసెక్కుల వరద వస్తోంది. జూరాలకు 2,894 క్యూసెక్కులు, శ్రీశైలం ప్రాజెక్టులోకి 1,055 క్యూసెక్కుల వరద వస్తోంది.


మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో అలుగు పోస్తున్న కాకతీయుల నాటి పెద్ద చెరువు


వికారాబాద్ జిల్లా కోటపల్లి ప్రాజెక్టు బురద నీటిలో దిగబడిన వాహనాన్ని బయటకు లాగుతున్న స్థానికులు

ఐదు రోజులు వర్షాలే!

రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆగ్నేయ, పశ్చిమ బంగాళాఖాతంలో అల్పపీడనంతో పాటు షియర్ జోన్ ఏర్పడిందని ఈ ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. 17, 18 తేదీల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, వరంగల్, కొత్తగూడెం, ఖమ్మం,నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఇది సగటు సముద్ర మాట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఏర్పడిందని, ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి దిశవైపునకు వాలి ఉందని తెలిపింది.

రుణమాఫీ మార్గదర్శకాలు వడపోతకోసమేనా?

- విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం.. సీఎం క్షమాపణ చెప్పాలి: హరీశ్ రావు



హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పథకం అమలుకు ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు చూస్తే, రైతుల వడపోతలపైనే దృష్టి పెట్టినట్లు కనబడుతోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికలప్పుడు ఒక మాట, అధికారం చేపట్టాక మరోమాట.. చెప్పేదొకటి, చేసేదొకటి అనే పద్ధతి చెయ్యి గుర్తు పార్టీకి అలవాటుగా మారిందని సోమవారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. 2018 డిసెంబర్ 12వ తేదీకి ముందు అప్పులున్న రైతులకు వర్తించదనే నిబంధన పెట్టడం సరికాదని, ఆహార భద్రత కార్డు, పీఎం కిసాన్ పథకం ప్రామాణికమని ప్రకటించడంతో లక్షలాది మంది రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయిందని పేర్కొన్నారు. హైదరాబాద్ చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో చదువుకుంటున్న విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని హరీశ్ మరో ట్వీట్‌లో తెలిపారు. గ్రూప్స్, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులపై ప్రభుత్వం ఇంత పాశవికంగా ప్రవర్తించడం దుర్మార్గమని మండిపడ్డారు. 'అప్పుడేమో సిటీ సెంట్రల్ లైబ్రరీకి రాహుల్ గాంధీని తీసుకెళ్లి ఓట్లు కొల్లగొట్టారు. ఇప్పుడేదే లైబ్రరీకి పోలీసులను పంపి విద్యార్థుల వీపులు పగలగొడుతున్నారు' అని ఫైర్ అయ్యారు. ఈ ఘటనకు బాధ్యత వహించి సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధికి నోచుకోక హైదరాబాద్ బ్రాండ్ రోజురోజుకు దిగజారిపోతోందని.. రాజకీయ లబ్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పేరుతో కొత్త నాటకానికి తెర తీస్తున్నారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆరోపించారు. జీహెచ్ఎంసీతోపాటు శివారు ప్రాంతాల్లోని కార్పొరేషన్లలో కాంగ్రెస్‌కు బలం లేనందుకే హైడ్రా పేరుతో పెత్తనం చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తోందన్నారు.

కనీసం విచారణకు ఆదేశించరా?

దోపిడీ ముఠా కథనంపై వైద్యశాఖలో తీవ్ర చర్చ

- అబ్బే అదేం లేదంటూ టీఎస్ఎంఎస్ఐడీసీ ఈడీ వివరణ
- కలకలం రేపిన 'ఆంధ్రజ్యోతి' కథనం

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీఎస్ఎంఎస్ఐడీసీ)లో పొరుగు సేవల ఉద్యోగులు పాల్పడుతోన్న అక్రమాలపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'టీఎస్ఎంఎస్ఐడీసీలో దోపిడీ ముఠా' కథనం కలకలం రేపింది. వైద్య ఆరోగ్యశాఖలో ఈ కథనంపై తీవ్ర చర్చ జరిగింది. ఈ కథనం అక్షర సత్యమని సంస్థ ఉద్యోగులు తెలిపారు. ఆ కథనంపై టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ కనీసం విచారణకు ఎందుకు ఆదేశించలేదని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఆరోపణలు ఎదుర్కొంటోన్న పొరుగు సేవలు, ఒప్పంద ఉద్యోగుల్లో ఒకరైన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సోమవారం ఆఫీసుకు డుమ్మా కొట్టారు. ఇదిలావుంటే 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై వైద్యమంత్రి కార్యాలయం నుంచి కనీస స్పందన లేదు. మంత్రి పేషీ ఉద్యోగులే టీఎస్ఎంఎస్ఐడీసీలోని ఒకరిద్దరు పొరుగు సేవల ఉద్యోగులకు కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతోన్న వేళ కనీసం ఆరా కూడా తీయలేదని సమాచారం. అందుకే అక్కడ పొరుగు సేవల ఉద్యోగులు రెచ్చిపోతున్నారు. ఇక 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై టీఎస్ఎంఎస్ఐడీసీ ఈడీ కౌటిల్య రెడ్డి వివరణ ఇచ్చుకున్నారు. సంస్థపై వచ్చిన వార్తలన్నీ నిరాధారమైనవని పేర్కొన్నారు. 'నిజంగా నిరాధారమైతే అవసరం లేని ఔషధాలను కోట్లాది రూపాయలు పెట్టి ఎందుకు కొన్నారో సంస్థ వెల్లడించాలి. అలాగే రిటైర్ అయిన ఉద్యోగులకు వేలాది రూపాయలు ఎందుకిస్తున్నారో తెలపాలి. పొరుగు సేవల ఉద్యోగుల్లో కీలక స్థానాల్లో ఉండి ఆరోపణలు ఎదుర్కొంటోన్న వారిపై ఎందుకు విచారణకు ఆదేశించలేదో బహిర్గతం చేయాలి' అన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఇచ్చంపల్లి వద్దు!

- ఆకస్మిక వరద వస్తే సమ్మక్క సాగర్‌కు ఇబ్బంది
- అనుసంధానం నీళ్లలో సగం మాకే ఇవ్వాలి
- గోదావరి-కావేరీ సమావేశంలో తెలంగాణ
- ఇచ్చంపల్లి, సమ్మక్కలకు ఒప్పుకోం: ఛత్తీస్‌గఢ్
- ఇబ్బందనుకుంటే ఇంద్రావతిపై రిజర్వాయర్
- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌కు కేంద్రం ప్రతిపాదన
- పోలవరం నుంచైతే మాకు ఓకే: ఆంధ్రప్రదేశ్
- త్వరలో రాష్ట్రాలతో భేటీ: జలశక్తి శాఖ

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరీ అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి అంగీకరించేది లేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇచ్చంపల్లి నుంచి కేవలం 24 కిలోమీటర్ల దిగువలోనే తుపాకులగూడెం (సమ్మక్క సాగర్) బ్యారేజీ ఉందని, ఇచ్చంపల్లి నుంచి వరదను అకస్మికంగా వరద విడుదల చేయాల్సి వస్తే ఆ వరదను నియంత్రించే పరిస్థితుల్లేవని చెప్పింది. సోమవారం జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) పాలక మండలి సమావేశం కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన వర్చువల్‌గా జరిగింది. దీనికి ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ భోపాల్‌సింగ్‌తో పాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. తెలంగాణ నుంచి నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్ కుమార్, అంతర్రాష్ట్ర వ్యవహారాల చీఫ్ ఇంజనీర్ మోహన్ కుమార్ హాజరయ్యారు. తెలంగాణ అభ్యంతరాలను అనిల్‌కుమార్ నివేదించారు. ఇదే అంశంపై మార్చి 6న రాసిన లేఖలోని అంశాలన్నీ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఇచ్చంపల్లికి దిగువన 158 టీఎంసీలకు సరిపడా తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులను చేపట్టిందని, గోదావరి-కావేరీ అనుసంధానం కోసం ఇచ్చంపల్లి నిర్మిస్తే ఈ ప్రాజెక్టులు ఏమైపోవాలని ప్రశ్నించారు. అనుసంధానంలో కర్ణాటక వాటాకు బదులుగా కృష్ణా బేసిన్‌లో అల్మట్టి రిజర్వాయర్ వద్ద ఆ రాష్ట్రానికి మరో 16 టీఎంసీలు అదనంగా కేటాయిస్తే దిగువన జూరాల, శ్రీశైలం జలాశయాలపై ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం బదలాయింపులో భాగంగా ఇప్పటికే కర్ణాటకకు 21 టీఎంసీలు, మహారాష్ట్రకు 14 టీఎంసీలను కృష్ణా నుంచి కేటాయించే కార్యక్రమం ఉందని గుర్తు చేశారు. కర్ణాటకలోని బెడ్తి-వారాదా నదుల అనుసంధానంలో తరలించే 18 టీఎంసీల్లో 9 టీఎంసీలను తెలంగాణకు కేటాయించాలని కోరారు. గోదావరి బేసిన్‌లో 968 టీఎంసీల నికర జలాల వినియోగానికి తెలంగాణ రూపొందించుకున్న ప్రణాళికలు, ఏర్పాటు చేసుకున్న సదుపాయాలపై కొత్తగా తలపెట్టిన అనుసంధానం ప్రభావం పడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనుసంధానంలో తరలించే నీటిలో 50 శాతం తెలంగాణకే ఇవ్వాలన్నారు. కరువు పీడిత మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో 86 శాతం భూములకు సాగునీటి వసతి లేదని ప్రస్తావించారు. కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల మధ్య పంచే వరకు నాగార్జున సాగర్‌ను కావేరీ అనుసంధానంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చొద్దని కోరారు. వాటాలు తేలాక సమగ్ర నీటి అధ్యయనం తర్వాతే ఎలాంటి ఇబ్బందులు లేవని తేలితేనే బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చాలని సూచించారు. సీతారామ ఎత్తిపోతల పథకం, సమ్మక్క సాగర్ బ్యారేజీల డీపీఆర్ లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఆమోదించాలని కోరారు.

ఇచ్చంపల్లి, సమ్మక్కకు ఒప్పుకోం: ఛత్తీస్‌గఢ్

ఇచ్చంపల్లి, సమ్మక్కసాగర్ బ్యారేజీలతో తమ రాష్ట్రంలో ముంపు సమస్య తీవ్రంగా ఉంటుందని, ఈ రెండింటికీ అంగీకరించే ప్రసక్తే లేదని ఛత్తీస్‌గఢ్ స్పష్టం చేసింది. పోలవరం నుంచి గోదావరి-కావేరీ అనుసంధానం చేపడితే అభ్యంతరాల్లేవని ఏపీ స్పష్టం చేసింది. అనుసంధానానికి రాష్ట్రాలు సూత్రప్రాయంగా అంగీకరించడంపై కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ హర్షం వ్యక్తం చేశారు. ప్రభావిత రాష్ట్రాలతో త్వరలోనే సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఇచ్చంపల్లి, సమ్మక్క సాగర్‌లపై అభ్యంతరాలుంటే కొత్తగా ఇంద్రావతిపై రిజర్వాయర్ కట్టి, నీటిని తరలించే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తామని ప్రకటించారు.

డీపీఆర్ ఆమోదించకుండానే బ్యారేజీలపై నిర్ణయం!

- తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత ఉంది
- జస్టిస్ ఘోష్ కమిషన్‌కు తెలిపిన విద్యుత్తు రంగ నిపుణుడు రఘు

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు ఆమోదం లేకుండానే బ్యారేజీలపై నిర్ణయం తీసుకున్నారని విద్యుత్తు రంగ నిపుణుడు కంచర్ల రఘు చెప్పారు. ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించతలపెట్టిన ప్రదేశంలో 165 టీఎంసీల నీటి లభ్యత ఉందని, అక్కడ బ్యారేజీ కట్టి ఉంటే ఎల్లంపల్లి దాకా 2 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేదని గుర్తు చేశారు. సోమవారం జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ముందు రఘు విచారణకు హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నీటి లభ్యత లేదని, 152 మీటర్లకు తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టడానికి మహారాష్ట్ర అంగీకరించలేదనే కారణాలు చూపించి, మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టడంతో 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు లేకుండా పోయిందని ఆక్షేపించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కడితే 71 కిలోమీటర్ల(మైలారం) దాకా గ్రావిటీతో సాగునీరు అందేదని, దీనివల్ల ఎత్తిపోతల పథకాల కరెంట్ బిల్లులు కూడా తగ్గేవని గుర్తుచేశారు. ఎల్లంపల్లి నుంచి 100 కిలోమీటర్ల దిగువన మేడిగడ్డ బ్యారేజీ కట్టడం వల్ల రూ.వేల కోట్ల వృథాతో పాటు ఆర్థికంగా నష్టం చేకూరిందని, అంతేకాకుండా ఏటా రూ.వందల కోట్లు కరెంట్ బిల్లుల కోసం వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంట్రాక్టు ఒప్పందాల్లో అవకతవకలు జరిగాయని రఘు ఆరోపించారు. బ్యారేజీ ఎఫ్ఆర్ఎల్ ఎగువన పంప్‌హౌస్‌ల సర్వీసు బే కట్టాల్సి ఉండగా దిగువన కట్టారని.. అందుకే పంప్‌హౌస్‌ల్లోకి నీరు చేరుతుందని చెప్పారు. కాగా, కేంద్ర జలశక్తి శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరామ్ మంగళవారం కమిషన్ ఎదుట హాజరుకానున్నారు.

కాళేశ్వరంలో మా పాత్రేం లేదు!


విచారణకు హాజరైన సోమేశ్, రామకృష్ణారావు, వికాస్‌రాజ్, రజత్‌కుమార్, స్మితా సభర్వాల్, రాహుల్ బొజ్జా

(మొదటి పేజీ తరువాయి)

అంచనాల సవరణ, ఉల్లంఘనలు తదితర అంశాలపై వారిని ప్రశ్నించినట్లు సమాచారం. నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారించి, ఇప్పటికే సేకరించిన సమాచారం ఆధారంగా ఐఏఎస్, మాజీ ఐఏఎస్ అధికారులపై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలపైనా లోతుగా విచారించినట్లు సమాచారం. అంచనా వ్యయ ఆమోదం, పరిపాలనా అనుమతులు, సవరణ అంచనాలు, నిధుల విడుదల, కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతులు, దాని ద్వారా రుణాలు సమీకరించిన తీరు తదితర అంశాలపై వారిని ప్రశ్నించినట్లు తెలిసింది. ఏ నిర్ణయం కూడా తాము తీసుకోలేదని, అన్నీ ఉన్నతస్థాయిలోనే జరిగాయని అధికారులు తెలిపినట్లు సమాచారం. ఉన్నతస్థాయిలో జరిగిన నిర్ణయాలనే అమలు చేశామని, బ్యారేజీల నిర్మాణం, వైఫల్యం, అంచనాల సవరణతో తమకెలాంటి ప్రత్యక్ష సంబంధాల్లేవని వారు వివరించినట్లు తెలిసింది. ఇక కమిషన్‌కు నివేదించిన అంశాలను అఫిడవిట్ల రూపంలో వారంలోగా సమర్పించాలని జస్టిస్ పీసీ ఘోష్ ఆదేశించారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనల తయారీలో నిమగ్నమై ఉండడంతో ఆయనకు ఆగస్టు 5వరకు గడువు ఇచ్చారు. కాగా, విచారణకు పూర్తి సహకారం అందిస్తామని ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లు స్పష్టం చేశారు.

అధిపతుల విచారణ ఎందుకంటే?

తెలంగాణ ఏర్పాటయ్యాక సుదీర్ఘకాలం పాటు నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి/ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే జోషి పని చేశారు. ఆ తర్వాత మూడేళ్లకు పైగా ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రజత్‌కుమార్ వ్యవహరించారు. సోమేశ్‌కుమార్, వికాస్‌రాజ్ కొంత కాలం ఆశాఖ కార్యదర్శులుగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించారు. మాజీ సీఎం కేసీఆర్ కార్యదర్శిగా పనిచేసిన స్మితా సబర్వాల్ కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. దాంతో వీరిని కమిషన్ విచారించింది. కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతుల జారీ, రుణాల సమీకరణ, వినియోగం, బడ్జెట్ నిధుల కేటాయింపులు, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కమిషన్ విచారించింది. విశ్రాంత ఐఏఎస్ వి.నాగిరెడ్డిని సైతం ఇదే వ్యవహారంలో ప్రశ్నించడానికి కమిషన్ రమ్మని కోరగా, ఆయన నుంచి స్పందన రాలేదని తెలిసింది. సోమవారం విచారణలో ఇతర అధికారులు కూడా అఫిడవిట్లు దాఖలు చేశారు.

రేషన్‌కార్డు లేకున్నా రుణమాఫీ



- రైతులెవరూ ఆందోళన చెందొద్దు
- కేసీఆర్ హయాంలో చేసింది సగమే..
- అదీ ఐదేళ్ల తర్వాత మాఫీ చేశారు
- మేం తొలి పంట నాటికే, ఒకేసారి చేస్తున్నాం
- 'ఆంధ్రజ్యోతి'తో వ్యవసాయ మంత్రి తుమ్మల

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు లేకపోయినా రుణమాఫీ చేస్తామని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రుణం ఉన్న ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగదన్నారు. సోమవారం రుణమాఫీ విధివిధానాలను విడుదల చేసిన తర్వాత వాటిపై వచ్చిన పలు అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. తెల్లకార్డు లేకపోయినా.. బ్యాంకుల్లో రుణం ఉంటే రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని ఆయన 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. తమ దగ్గర అందరి వివరాలు ఉన్నాయన్నారు. తెల్లకార్డు అనేది కుటుంబ నిర్ధారణ కోసం మాత్రమేనని, కార్డు లేని వారికి సంబంధించి వ్యక్తిగతంగా విచారణ చేపడతామని చెప్పారు. అయితే ఇంట్లో మొత్తం ఎంతమంది ఉంటున్నారు? ఎవరి పేరు మీద ఎంత రుణం ఉందనే వివరాలను పరిశీలించి కుటుంబం మొత్తానికి కలిపి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని తేల్చిచెప్పారు. తెల్లకార్డు ఉన్నా లేకపోయినా రుణమాఫీ చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదని హామీచ్చారు. రూ.31 వేల కోట్ల మేర మాఫీని ఏకమొత్తంలో చేస్తున్నామన్నారు.

కేసీఆర్ చేసింది సగమే..

గత ప్రభుత్వ హయాంలో రూ.లక్ష రుణమాఫీకి సంబంధించి బీఆర్ఎస్ తొలిసారి (2014-18) ఏటా రూ.25 వేల చొప్పున నాలుగేళ్లు చేసిందని, అయితే అది వడ్డీలకే సరిపోయిందని తుమ్మల అన్నారు. తర్వాత 2018 ఎన్నికల సమయంలో కేసీఆర్ మళ్లీ రూ.లక్ష మాఫీ చేస్తామని ప్రకటించినా.. ఐదేళ్లపాటు చేయలేదని గుర్తుచేశారు. 2023లో ఎన్నికల నోటిఫికేషన్ ముందు ఓఆర్ఆర్‌ను లీజుకిస్తే వచ్చిన డబ్బుతో రుణమాఫీ చేశారని తెలిపారు. మొత్తం రుణమాఫీకి రూ.20 వేల కోట్లు అవసరమవ్వగా, రూ.13 వేల కోట్లే విడుదల చేశారని చెప్పారు. అందులోనూ మళ్లీ రూ.1,400 కోట్ల నగదు రైతులు రెన్యువల్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వానికి వెనక్కి వచ్చిందని, ఆ నిధులను రైతులకు అందించలేదని విమర్శించారు. అంటే ఐదేళ్ల తర్వాత వాళ్లు మాఫీ చేసింది రూ.11 వేల కోట్లేనన్నారు. దీని వల్ల తమ ప్రభుత్వంపై రూ.10 వేల కోట్ల భారం పడుతోందని చెప్పారు. అయినప్పటికీ గతం నుంచి రుణాలున్న రైతులకు కూడా రూ.2 లక్షల మేర మాఫీ చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ సర్కారు తరహాలో ఐదేళ్లలో కాకుండా ఒకేసారి రైతు రుణమాఫీ చేస్తున్నామని, అది కూడా తొలి పంట కాలంలోనే పూర్తిచేసేలా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు నీతులు చెప్పడం సరికాదని, ప్రజలు వారిని నమ్మడం లేదని చెప్పారు.

బేగంపేట రైల్వేస్టేషన్‌కు 22.57 కోట్లు: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): బేగంపేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులకు కేంద్రం ప్రభుత్వం రూ.22.57 కోట్లు కేటాయించిందని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరచడం, సదుపాయాలను కల్పించడంలో భాగంగా చేపట్టిన ఈ పనులు ఇప్పటికే 50శాతం మేర పూర్తయ్యాయని తెలిపారు. నిర్మాణంలో ఉన్న బేగంపేట రైల్వేస్టేషన్ చిత్రాలను ఆయన సోమవారం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద బేగంపేట రైల్వేస్టేషన్‌ను ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

'అంగన్‌వాడీ'తో పిల్లల భవితకు పునాది: సీతక్క

ములుగు రూరల్ జూలై 15: పసిప్రాయం నుంచే అక్షరాభ్యాసం చేయించాలనే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల భవిష్యత్‌కు పునాది వేస్తున్నామని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ములుగు జిల్లాలోని మహ్మద్‌గౌస్‌పల్లిలో మంత్రి సోమవారం ప్రారంభించారు. 3-5 ఏళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి వారికి విద్య నేర్పించేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలో పిల్లలకు ఆట వస్తువులు, పౌష్టికాహారంతో పాటు యూనిఫాం అందజేస్తోందని తెలిపారు. పేద పిల్లలకు పౌష్టికాహారం, విద్య, భద్రత ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ములుగు మండలం ఇంచర్ల గ్రామ శివారులోని ఎర్రిగట్టమ్మ గుడి వద్ద ఎకో పార్క్‌లో మంత్రి సీతక్క మొక్కలు నాటారు. వన మహోత్సవం లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మేడారం వన దేవతలను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల చేత విరివిగా మొక్కలు నాటిస్తామన్నారు. 'మొక్కలతో మొక్కులు చెల్లిస్తాం' అనే నినాదంతో పని చేస్తామని తెలిపారు.

అన్ని ఉత్పత్తులకు కనీస మద్దతు ధర: ఉత్తమ్

హైదరాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): అన్ని వ్యవసాయ ఉత్పత్తులను కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ)కు కొనుగోలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మధ్యవర్తులు, వ్యాపారుల ఆగడాలను కట్టడి చేసేందుకు అన్ని ఉత్పత్తులకు ఎమ్మెస్పీని నిర్ణయించనున్నట్లు చెప్పారు. సోమవారం తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో చైర్మన్ అన్వేష్‌రెడ్డిని కలిసి మాట్లాడారు. రైతుల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందించడంతో పాటు రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందిస్తామన్నారు.

ఒకేచోట 5 ఏళ్ల సర్వీసు పూర్తయితే బదిలీ

- కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల ఉద్యోగులకు వర్తింపు

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్, డిగ్రీ కళాశాలలతో పాటు ఇతర ఉన్నత విద్యాసంస్థలు, కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈమేరకు విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. బోధన, బోధనేతర ఉద్యోగులు, ఇతర సిబ్బందికి ఈ నిబంధనలు వర్తించనున్నాయి. ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు ఈ బదిలీల షెడ్యూల్‌ను పూర్తి చేయనున్నారు. ఒకే ప్రాంతంలో జూన్ 30వ తేదీ నాటికి 5 ఏళ్ల సర్వీసు పూర్తయిన ప్రతీ ఉద్యోగి బదిలీ కావాల్సి ఉంటుంది. అలాగే.. రెండేళ్ల సర్వీసు పూర్తయినవారు బదిలీకి అర్హులు అవుతారు. ఈ బదిలీల్లో భార్య/భర్త కేటగిరీ ఉద్యోగులకు 20 పాయింట్లను కేటాయించనున్నారు. వికలాంగ ఉద్యోగులకు 15 పాయింట్లను, వితంతువులు, ఒంటరి మహిళ వంటివారికి 10 పాయింట్లను కేటాయించనున్నారు.

'ఏకలవ్య' పాఠశాలలకు 479 మంది సిబ్బంది

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల(ఈఎంఆర్ఎస్)కు కేంద్రం పూర్తి స్థాయి సిబ్బందిని నియమించింది. ఈ మేరకు 479 మంది సిబ్బంది రాగా వీరిలో 433 మంది బోధన, 46 మంది బోధనేతర సిబ్బంది ఉన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఈఎంఆర్ఎస్‌లలో ఖాళీ పోస్టులను ఇటీవల కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (ఎన్ఈఎస్‌టీ) భర్తీ చేసింది. ఈ భర్తీలో భాగంగా తెలంగాణలో ఇప్పటివరకు తాత్కాలిక సిబ్బందితో నడుస్తున్న ఏకలవ్య పాఠశాలలకు పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించింది.

గ్రామ న్యాయాలయాలు ఏర్పరచండి: ఎఫ్‌జీజీ

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం లా కమిషన్ సిఫారసు చేసిన గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి సోమవారం లేఖ రాశారు. ఈ గ్రామ న్యాయాలయాలకు అయ్యే మొత్తం ఖర్చులో సగాన్ని తామే భరిస్తామంటూ కేంద్రప్రభుత్వం స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో కొన్ని రాష్ట్రాల్లో గ్రామ న్యాయాలయాలు ఏర్పాటయ్యాయని, కానీ తెలంగాణలో మాత్రం ఇప్పటివరకు ఏర్పాటు కాలేదని పేర్కొన్నారు. ఈ దృష్ట్యా రాష్ట్రంలో గ్రామ న్యాయాలయాలు ఏర్పాటు అంశాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లాలని రిజిస్ట్రార్ జనరల్‌ను పద్మనాభరెడ్డి కోరారు.

పన్ను చెల్లింపుదారులకు మాఫీ లేనట్లే!

'రుణమాఫీ'లో పీఎం-కిసాన్ మార్గదర్శకాలు

హైదరాబాబాద్, జులై 15 (ఆంధ్రజ్యోతి): పంట రుణమాఫీ మార్గదర్శకాల్లో పీఎం-కిసాన్ పథకం మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఫలితంగా ఆదాయ పన్ను చెల్లింపుదారులకు రుణమాఫీ వర్తించే అవకాశాలు దాదాపుగా లేవు అని తెలుస్తోంది. పీఎం-కిసాన్ పథకంలో కూడా ఐటీ చెల్లింపుదారులు, ప్రజా ప్రతినిధులు, నేతలకు పెట్టుబడి సాయం ఇవ్వటం లేదు. అదేపద్ధతిలో రాష్ట్రంలో రుణమాఫీ పథకాన్ని అమలుచేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఫలితంగా పన్ను చెల్లింపుదారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జెడ్పీ చైర్మన్లు, మునిసిపల్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు తదితర ప్రజాప్రతినిధులకు, ఆదాయపన్ను పరిధిలోకొచ్చే ప్రభుత్వ ఉద్యోగులకు మాఫీ వర్తించే అవకాశం లేదు. ఇప్పటికే.. రాష్ట్రంలో ఆదాయపు పన్ను చెల్లించేవారు ఎందరున్నారు? పన్ను చెల్లించకపోయినా ఐటీ రిటర్నులు దాఖలుచేసే వారెందరున్నారు? అనే వివరాలను కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వం తెప్పించుకుంది. పిల్లల చదువులు, స్టడీలోన్లు, హౌసింగ్‌లోన్లు ఇతరత్రా అవసరాలకోసం కొందరు రైతులు, ఆదాయం తక్కువున్న వాళ్లు కూడా ఐటీ రిటర్నులు దాఖలుచేస్తున్నారు. ఇలాంటివారికి రుణమాఫీ వర్తింపజేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగులైనా ఐటీ పరిధిలోకి రాకపోతే మాఫీ ఉంటుంది. రైతు రుణమాఫీలో కుటుంబాన్ని నిర్ధారించడం కోసమే రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటారు. కార్డులో పేర్లు ఉన్నవారినంతా ఒక కుటుంబంగా పరిగణిస్తారు. ఆ ఇంట్లో ఒకరికి మించి లోన్లు ఉన్నా అందరికీ కలిపి గరిష్ఠంగా రూ.2లక్షల వరకే మాఫీ చేస్తారు. ఉదాహరణకు రేషన్‌కార్డులో ఉన్న కుటుంబసభ్యుల్లో నలుగురి పేరుమీద తలా రూ.50వేల రుణం ఉంటే మొత్తంగా రూ.2లక్షలు మాఫీ అవుతుంది. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలున్నాయి. కానీ పీఎం-కిసాన్ పథకంలో సుమారు 40 లక్షల మంది లబ్ధిదారులే ఉన్నారు. పీఎం-కిసాన్ మార్గదర్శకాల ప్రకారం వడపోస్తే రైతుల సంఖ్య బడ్జెట్ తగ్గే అవకాశాలున్నాయి. ప్రస్తుతం నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్(ఎన్ఐసీ)లో ఈ వడపోత జరుగుతోంది.

మాఫీకి మార్గమిదీ!

(మొదటిపేజీ తరువాయి)



స్వల్పకాలిక పంట రుణాలను మాఫీ చేయనున్నట్లు తెలిపింది. రుణమాఫీ మొత్తాన్ని ఆధారంగా చేసుకొని ఆరోహణ క్రమంలో (తక్కువ నుంచి ఎక్కువ) మాఫీ చేస్తామని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం-కిసాన్ మినహాయింపులను రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న డేటా మేరకు పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. ఈ మేరకు రుణమాఫీ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలపై జీవో ఆర్టీ నంబరు 567ను రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు సోమవారం జారీ చేశారు.

జీవోలో పేర్కొన్న వివరాలు..

రుణమాఫీ పథకం-2024 పరిధి, వర్తింపు ఇలా..

- తెలంగాణలో భూమి కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ రూ.2 లక్షల పంట రుణమాఫీ వర్తిస్తుంది. స్వల్పకాలిక పంట రుణాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు.
- రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు(ఉమ్మడి బ్యాంకులు), వాటి శాఖ (బ్రాంచి)ల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలకు రుణమాఫీ పథకం వర్తిస్తుంది.
- 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ నాటికి మంజూరైన, రెన్యువల్ అయిన, రుణ బకాయిలకు వర్తిస్తుంది. బకాయి ఉన్న అసలు, వర్తించే వడ్డీ మొత్తం పథకానికి అర్హత కలిగి ఉంటుంది.
- రైతు కుటుంబాన్ని నిర్ణయించడానికి పౌరసరఫరాల శాఖ జారీ చేసిన ఆహార భద్రత కార్డు డేటా బేస్‌ను ప్రామాణికంగా తీసుకుంటారు.
- కుటుంబ యజమాని, జీవిత భాగస్వామి, వారిపై ఆధారపడి ఉన్న పిల్లలను ఒక కుటుంబంగా పరిగణిస్తారు.

రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తారిలా..

- రుణమాఫీ మొత్తాన్ని డీబీటీ (నగదు బదిలీ) పద్ధతిలో నేరుగా లబ్ధిదారులైన రైతు రుణ ఖాతాలకు జమ చేస్తారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఉన్న రుణమాఫీ మొత్తాన్ని డీసీసీబీలకు గానీ, వాటి పరిధిలోని బ్రాంచిలకుగానీ విడుదల చేస్తారు. ఆ బ్యాంకర్లు రుణమాఫీ మొత్తాన్ని వారి పరిధిలో ఉన్న రైతుల ఖాతాల్లో జమ చేస్తారు.
- ప్రతి రైతు కుటుంబానికి 2023 డిసెంబరు 9 నాటికి ఉన్న మొత్తం రుణం ఆధారంగా ఆరోహణ క్రమంలో మాఫీ సొమ్మును జమ చేస్తారు. మొత్తం రుణం గానీ, లేక రూ.2 లక్షల వరకు గానీ.. ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని రైతు కుటుంబం పొందే అర్హత ఉంటుంది.
- రూ.2 లక్షలకు మించి రుణం ఉంటే.. ఆ రైతు రూ.2 లక్షలకు పైబడి ఉన్న రుణాన్ని మొదట బ్యాంకులకు చెల్లించాలి. ఆ తర్వాత అర్హత కలిగిన 2 లక్షల మొత్తాన్ని రుణ ఖాతాకు బదిలీ చేస్తారు.
- రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న పరిస్థితుల్లో.. కుటుంబంలో రుణం తీసుకున్న మహిళల రుణాన్ని మొదట మాఫీ చేసి, మిగులు మొత్తాన్ని దామాషా పద్ధతిలో కుటుంబంలో పురుషుల పేరు మీద తీసుకున్న రుణాలను మాఫీ చేస్తారు.
- పథకం అమలుకు ఏర్పాట్లు, కసరత్తు, షరతులు
- వ్యవసాయశాఖ కమిషనర్/డైరెక్టర్‌ను పంట రుణ మాఫీ- 2024 పథకాన్ని అమలు చేసే అధికారిగా ప్రభుత్వం నిర్ణయించింది.
- హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్(ఎన్ఐసీ) ఈ పథకానికి ఐటీ భాగస్వామిగా బాధ్యతలు నిర్వర్తిస్తుంది.
- వ్యవసాయశాఖ డైరెక్టర్, ఎన్ఐసీ సంయుక్తంగా ఈ పథకం అమలు కోసం ఒక ఐటీ పోర్టల్‌ను నిర్వహిస్తారు. ఈ పోర్టల్‌లో ప్రతి రైతు కుటుంబానికి సంబంధించిన లోన్ అకౌంట్ డేటా సేకరణ, డేటా వ్యాలిడేషన్, అర్హత మొత్తాన్ని నిర్ణయించడానికి సౌకర్యం ఉంటుంది. ఈ పోర్టల్‌లో ఆర్థిక శాఖ నిర్వహించే 'ఐఎఫ్ఎంఐఎస్' పోర్టల్‌కు బిల్లుల సమర్పణ, పథకానికి సంబంధించిన భాగస్వాములందరితో సమాచారాన్ని పంచుకోవడం, రైతులు ఇచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి మాడ్యూల్స్ ఉంటాయి.
- ఈ పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒక అధికారిని 'బ్యాంకు నోడల్ అధికారి'(బీఎన్‌వో)గా నియమిస్తారు. ఈ నోడల్ అధికారి.. బ్యాంకులకు, వ్యవసాయశాఖ డైరెక్టర్, ఎన్ఐసీ మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.
- రుణమాఫీ పొందటానికి రైతులు తప్పుడు సమాచారం ఇచ్చినా, మోసపూరితంగా పంట రుణాన్ని పొందినా, పథకానికి అర్హులు కాదని తేలినా.. రుణమాఫీ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. దీనిని రికవరీ చేసే అధికారం వ్యవసాయశాఖ డైరెక్టర్‌కు ఉంటుంది.
- రైతుల సందేహాలు, ఇబ్బందులను పరిష్కరించడానికి వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఒక పరిష్కార విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. రైతులు తమ ఇబ్బందులను ఐటీ పోర్టల్ లేదా మండల స్థాయిలో స్థాపించిన సహాయ కేంద్రాల వద్ద తెలిపే అవకాశం కల్పించారు. ప్రతి అభ్యర్థనను 30 రోజుల్లోపు పరిష్కరించి దరఖాస్తుదారునికి తెలపాలి.

రుణమాఫీ వీటికి వర్తించదు..

- రుణమాఫీ పథకం.. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీల)కు, జాయింట్ లయబిలిటీ గ్రూప్ (జేఎల్‌జీ)లు, రిసోర్స్ మేనేజ్‌మెంట్ గ్రూప్ (ఆర్ఎంజీ)లు, లోన్ ఎలిజిబిలిటీ కార్డ్ స్కీం (ఎల్ఐసీఎస్)లకు తీసుకున్న రుణాలకు వర్తించదు.
- పునర్వ్యవస్థీకరించిన లేదా రీషెడ్యూలు చేసిన రుణాలకు రుణమాఫీ పథకం వర్తించదు. ప్రకృతి విపత్తులు సంభవించి.. రైతులకు తీరని నష్టం కలిగినప్పుడు ఆ ప్రాంతంలో రైతులు తీసుకున్న పంట రుణాలపై ప్రభుత్వ మారిటోరియం ప్రకటిస్తే అది రీషెడ్యూలు కిందకు వస్తుంది. అప్పుడా రుణాలు స్వల్పకాలం నుంచి దీర్ఘకాలిక రుణాల జాబితాలోకి వెళ్తాయి.
- కంపెనీలు, ఫర్మ్‌లు వంటి సంస్థలకు ఇచ్చిన పంట రుణాలకు వర్తించదు. పీఏసీఎస్‌ల ద్వారా తీసుకున్న పంట రుణాలకు వర్తిస్తుంది.
- కేంద్రం అమలు చేసే పీఎం-కిసాన్ మినహాయింపులను రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న డేటా లభ్యత మేరకు.. ఆచరణాత్మకంగా అమలు చేయడానికి వీలైనంత వరకు పరిగణనలోకి తీసుకుంటారు.

తెలుగులో మొదటి జీవో

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా ఒక ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) తెలుగు భాషలో వెలువడింది. పెద్దగా ఆంగ్ల పదాలు లేకుండా.. తెలుగు పడికట్టు, సంక్లిష్ట పదాలు లేకుండా ఇలా ఒక జీవో వెలువడడం ఇదే మొదటిసారి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలుగులో జీవోలను వెలువరించాలని ప్రయత్నించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. కానీ అదే బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఓ వెలుగు వెలిగిన వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు తాజాగా పూర్తిగా తెలుగు భాషలో ఒక జీవోను జారీ చేయడం గమనార్హం. పంట రుణాల మాఫీ పథకం మార్గదర్శకాలకు సంబంధించిన జీవో (నంబర్ 567)ను మంగళవారం ఆయన పూర్తిగా తెలుగు భాషలో జారీ చేశారు. తద్వారా రేవంత్ సర్కారు తెలుగు భాషాభిమానుల మనసు చూరగొన్నది. ఇకమీదటైనా ఇదే సంప్రదాయాన్ని కొనసాగించడానికి అన్ని శాఖల కార్యదర్శులూ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేసీఆర్ ప్రకటించినా..


జీవోలు, ఆర్డినెన్స్‌లు, చట్టాలు, నిబంధనలు, మాన్యువల్స్‌ను తెలుగులో ప్రచురించాలని గత బీఆర్ఎస్ సర్కారు కూడా యోచించింది. పాలనలో తెలుగుకే ప్రాధాన్యమిస్తామంటూ.. 2017 డిసెంబరులో హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్‌లను అనుసరించే ప్రతి ప్రైవేటు పాఠశాలలో తెలుగును రెండో భాషగా బోధించాలంటూ 2022లో ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి సీఎం ఓఎస్‌డీ దేశపతి శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్‌ల బృందం. ప్రభుత్వ పరిపాలనా నియమావళిని, సచివాలయ నిబంధనావళిని సరళమైన తెలుగులోకి అనువదించే ప్రయత్నం చేసింది. అదే కోవలో జీవోలను కూడా తెలుగులోనే ప్రచురించాలని నిర్ణయించారు. కానీ.. జీవోలను తెలుగులో అప్‌లోడ్ చేయడం మాట అటుంచి, ముఖ్యమైన జీవోలను కూడా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపర్చలేదు. అలాంటి పరిస్థితుల నుంచి ఇప్పుడు తెలుగు భాషలో ఒక జీవో రావడం విశేషమే.

సీఎంతో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి భేటీ

బాధ్యతల స్వీకరణ తర్వాత మర్యాద పూర్వకంగా సమావేశం

సంగారెడ్డిలో పలు అభివృద్ధి పనులకు జగ్గారెడ్డి ప్రతిపాదనలు

హైదరాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): టీజీఐఐసీ చైర్‌పర్సన్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన తూర్పు నిర్మలా జగ్గారెడ్డి.. సోమవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెతో పాటు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి సైతం ఉన్నారు. ఈ సందర్భంగా వారి క్షేమ సమాచారాన్ని సీఎం రేవంత్ ఆరా తీశారు. కాగా, సంగారెడ్డి నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డికి జగ్గారెడ్డి సమర్పించారు. ఆ ప్రతిపాదనల పట్ల సీఎం సానుకూలంగా స్పందించారు.



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

2/3 వంతు చేరితే బీఆర్ఎస్ఎల్పీ విలీనమే

గతంలో ఆ పార్టీ వాళ్లు ఇలాగే చేశారు కదా.. ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా వస్తున్నారు

- డీఎస్సీని రద్దు చేయించి బదనాం చేసే కుట్ర
- మీడియాతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- ప్రజలిచ్చిన తీర్పును కాపాడుకుంటాం: పొన్నం
- ఇష్టం లేకున్నా.. తప్పని పరిస్థితుల్లోనే చేరికలు
- బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి ముమ్మర యత్నం: మధుయాష్కీగౌడ్







మహబూబ్‌నగర్/కరీంనగర్/హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చే ఎమ్మెల్యేలందరూ స్వచ్ఛందంగా ఆయా నియోజకవర్గాల అభివృద్ధి కోసమే చేరుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మూడింట రెండు వంతుల ఎమ్మెల్యేలు చేరిన తర్వాత సీఎల్పీలో బీఆర్ఎస్ఎల్పీ విలీనం అవుతుందని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలను చేర్చుకొని సీఎల్పీ విలీనమైందంటూ బీఆర్ఎస్ నేతలు మాట్లాడారని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు వారే తమను ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఆయన మాట్లాడారు. తమ మూడు నెలల పని తీరుకు లోక్‌సభ ఎన్నికలే రెఫరెండం అని చెప్పామని, అనుకున్న దాని కంటే సీట్లు తగ్గినా అసెంబ్లీతో పోల్చితే ఓటింగ్ శాతం పెరిగిందని గుర్తు చేశారు. గత పదేళ్లలో ఉద్యోగాలు ఇవ్వడం బీఆర్ఎస్‌కు చేతకాలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కోర్టు కేసులను పరిష్కరించి.. 30 వేల మందికి ఉద్యోగాలిచ్చామని చెప్పారు. పకడ్బందీగా డీఎస్సీ నిర్వహణకు తాము కసరత్తు చేస్తుంటే.. దాన్ని రద్దు చేయాలంటూ కొందరు డిమాండ్ చేయడం శోచనీయమన్నారు. నిరుద్యోగుల భవిష్యత్‌ను ఆగం చేయవద్దని బీఆర్ఎస్ నేతలను కోరారు. త్వరలోనే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని, 65 పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏటా 10 వేల మందికి వివిధ రంగాల్లో శిక్షణ ఇప్పిస్తామని వివరించారు. రీజనల్ రింగ్ రోడ్డుకు సంబంధించి సెప్టెంబరులో టెండర్లు పిలవనున్నామని, ఈ నెల 22న ట్రైపార్టీ అగ్రిమెంట్ జరగనుందని తెలిపారు.

కేటీఆర్‌కు మాట్లాడే అర్హతే లేదు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామని బీఆర్ఎస్, బీజేపీ నేతలు మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? అని మంత్రి పొన్నం ప్రభాకర్ నిలదీశారు. తాము బాధ్యతలు చేపట్టకముందే ఈ సర్కారు కూలిపోతుందంటూ బీజేపీ, బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ఫిరాయింపులకు కాంగ్రెస్ వ్యతిరేకమని, కానీ.. ప్రజలు ఇచ్చిన తీర్పును కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఫిరాయింపులపై కేటీఆర్‌కు మాట్లాడే అర్హతే లేదని, బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేతో రాజీనామా చేయించకుండా మంత్రిని చేయలేదా? అని ప్రశ్నించారు. కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

చట్టంలోని వెసులుబాటు ప్రకారమే..

ఇష్టం లేకున్నా.. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తెలిపారు. ఆత్మరక్షణ కోసం ఏఐసీసీ అనుమతితోనే ఈ చేరికలు జరుగుతున్నట్లు తెలిపారు. సామాన్య రైతు కుంటుంబం నుంచి వచ్చిన రేవంత్ రెడ్డి సీఎం కావడాన్ని కేసీఆర్ జీర్ణించుకోలేక పోతున్నారని దుయ్యబట్టారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో చేరే ఎమ్మెల్యేలకు ఎలాంటి పదవులు, హామీలు ఇవ్వట్లేదని, చట్టంలో ఉన్న వెసులుబాటు ప్రకారమే చేర్చుకుంటున్నామని తెలిపారు. దళిత నాయకుడు భట్టి అసెంబ్లీలో నిలదీస్తే కేసీఆర్ తట్టుకోలేకపోయారని, ఆ తర్వాతి సెషన్ వచ్చే సరికి 12మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేసుకున్నారన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసేందుకు కేటీఆర్, హరీశ్‌రావు ఢిల్లీలో చర్చలు జరిపారని, కేసీఆర్ కూడా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కవితను జైలు నుంచి విడిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అయితే, బీఆర్ఎస్‌ను విలీనం చేసుకునే అంశంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయన్నారు. విలీనానికి కిషన్‌రెడ్డి ఓకే చెప్పారని, సంజయ్ మాత్రం హరీశ్‌ను లాక్కుని బీఆర్ఎస్‌ను చీల్చాలని చూస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగాలు కావాలనుకునే వాళ్లు పరీక్షల వాయిదాను కోరుకోరని, వాయిదే వేస్తే శిక్షణా సంస్థలు రూ.వంద కోట్ల మేర లబ్ధి పొందుతాయన్నారు. బీఆర్ఎస్ ఎంగిలి మెతుకులు తిన్న కొందరు బీసీలమని చెప్పుకుంటూ సచివాలయ ముట్టడి చేపట్టారని, వాళ్లు నిజమైన బీసీ ప్రతినిధులు కాదని అన్నారు. టీపీసీసీ అధ్యక్ష పదవి ఇస్తే తీసకుంటానని, వేరే పదవి తీసుకోనని స్పష్టం చేశారు.

నేడు కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి సమావేశం

- ఎజెండాలో ధరణి సహా 9 అంశాలు
- వ్యవసాయం, వాతావరణంపైనా చర్చ

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, పోలీసు సూపరింటెండెంట్లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం సమావేశమవుతున్నారు. సచివాలయంలోని ఏడో అంతస్తులో గల కాన్ఫరెన్స్ హాల్(పశ్చిమ)లో ఉదయం 9.30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుంది. సమావేశానికి రావాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశపు ఎజెండాలో 9 అంశాలను చేర్చారు. ప్రజాపాలన, ధరణి, వ్యవసాయం-వాతావరణ పరిస్థితులు, ఆరోగ్యం-సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళాశక్తి, విద్య, శాంతి భద్రతలు, డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంఅంశాలు ఉన్నాయి.

ధరణి సమస్యలపై ప్రధాన దృష్టి

సమావేశంలో ధరణి సమస్యల పరిష్కారంపైనే ప్రధానంగా దృష్టి పెట్టనున్నారు. ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి? వాటి పరిష్కారానికి ఏం చేయాలని, కొత్తగా వచ్చిన దరఖాస్తులను ఏ మేరకు పరిశీలించారు? ధరణి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు ఏమైనా ఉన్నాయా? అనేది చర్చించనున్నారు. ధరణి పోర్టల్‌ను ప్రక్షాళన చేస్తామని కూడా ముఖ్యమంత్రి రేవంత్ బాధ్యతలు చేపట్టిన కొత్తలో ప్రకటించారు. ధరణి సమస్యల పరిష్కారానికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ధరణి కమిటీని వేశారు. కమిటీ సూచనల మేరకు కొన్ని మాడ్యూల్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. కలెక్టర్లకు మాత్రమే ఉన్న అధికారాల్లో కొన్నింటిని అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసిల్దార్లకు బదలాయించారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ అటు ధరణి కమిటీతో, ఇటు అధికారులతో పలుమార్లు సమావేశమై పెండింగ్ దరఖాస్తుల సంఖ్యను తగ్గిస్తూ వచ్చారు. జూన్ 14న కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పెండింగ్ దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం అదనపు లాగిన్‌లను జారీ చేశారు. తహసిల్దార్లకు రెండో లాగిన్‌ను అదనంగా ఇచ్చారు. పాత లాగిన్‌ను వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌కు వినియోగించాలని, కొత్త లాగిన్‌ను ధరణి దరఖాస్తుల పరిష్కారానికి వాడాలని చెప్పారు. కొన్ని మాడ్యూల్స్‌లోని దరఖాస్తులను పరిష్కరించేందుకు ఎమ్మార్వోలకు అదనపు ఆప్షన్స్ ఇచ్చి, రోజుకు వంద దరఖాస్తులను పరిశీలించాలని లక్ష్యాలు నిర్దేశించారు.తాజాగా సీఎం సమీక్ష సమావేశంలో ఇంకా ఏం చేసే అవకాశం ఉందనే దాని మీద చర్చ జరపనున్నారు.

భూములు ఇచ్చేదే లే..!

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ రహదారులు మంజూరైన 7 జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. వరంగల్ (ఎన్‌హెచ్ 163, 563); ఖమ్మం (ఎన్‌హెచ్ 365ఏ), (ఎన్‌హెచ్ 365 బీజీ, 365 బీబీ), మహబూబ్‌నగర్ (ఎన్‌హెచ్ 150 సీసీ, 44), హైదరాబాద్ (ఎన్‌హెచ్ 44, 65, 163), కామారెడ్డి (ఎన్‌హెచ్ 44), మంచిర్యాల (ఎన్‌హెచ్ 363), సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ (ఎన్‌హెచ్ 161) కలిపి రాష్ట్రానికి దాదాపు 1,442 కిలోమీటర్ల జాతీయ రహదారులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ రోడ్ల నిర్మాణాలకు మొత్తం 8,199 హెక్టార్ల భూమి అవసరమని ఎన్‌హెచ్‌ఏఐ తేల్చింది. ఆయా జిల్లాల్లో తీసుకోవాల్సిన భూమి, రైతుల వివరాలను కూడా సేకరించింది. కానీ, ఇప్పటివరకు సగం భూవిని మాత్రమే ఎన్‌హెచ్‌ఏఐకి అప్పగించారు. కొన్నిచోట్ల రైతులు భూములివ్వబోమని చెప్పడం, మరికొన్ని చోట్ల అలైన్‌మెంట్ మార్చాలని పట్టుబడుతుండడంతో రహదారుల నిర్మాణ పనులు జాప్యం అవుతున్నాయి. రహదారుల నిర్మాణ పనులకు అవసరమైన మొత్తం 8,199 హెక్టార్లలో ఇప్పటివరకు 5,694 హెక్టార్ల భూమినే సేకరించారు. ఇందులోనూ ఎన్‌హెచ్‌ఏఐ (జాతీయ రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూవికి ఎలాంటి ఆటంకాలు లేకుండా భూమిని తీసుకునేటప్పుడు భారత రాష్ట్రపతి పేరు మీద మ్యుటేషన్ చేస్తారు)కు 3,859 హెక్టార్లు మాత్రమే మ్యుటేషన్ అయింది. అంటే సేకరించిన భూమిలోనే ఇంకా 1,835 హెక్టార్లు ఎన్‌హెచ్‌ఏఐకు అందాల్సి ఉంది. మొత్తం 4,340 హెక్టార్ల భూమి ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలోకి తీసుకోవాల్సి ఉందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. పెండింగ్‌లో ఉన్న భూ సేకరణకు సహకారం అందించాలని, సేకరణను వేగిరం చేసేలా కలెక్టర్లకు ఆదేశాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. అదేవిధంగా భూ సేకరణ సమయంలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు పోలీస్ రక్షణ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిసింది.

ఎన్‌ఎండీసీ శాశ్వత చైర్మన్ నియామకమెప్పుడో?

- అమితవ ముఖర్జీనే రెండోసారి ఇన్‌చార్జ్‌గా కొనసాగిస్తూ నిర్ణయం
- తెలంగాణ నుంచి ఎన్.శ్రీధర్ పేరును తిరస్కరించిన ఏసీసీ

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ) కు శాశ్వత చైర్మన్ నియామకంపై తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగుతున్న అమితవ ముఖర్జీనే రెండో పర్యాయం కూడా కొనసాగిస్తూ ఉక్కు మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. 2022 మార్చిలో తొలిసారి పొడిగించింది. తాజాగా ఈ ఏడాది నవంబర్ 19 వరకు ఆయనే ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగనున్నట్లు తెలిపింది. మేజర్ మైనింగ్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న ఆయనకే సీఎండీగా అదనపు బాధ్యతలను అప్పగించారు. గత మార్చిలో సీఎండీ పోస్టులో తెలంగాణకు చెందిన ఐఏఎస్ నడిమట్ల శ్రీధర్‌ను నియమించేందుకు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు సిఫార్సు చేసింది. అయితే క్యాబినెట్ నియామకాల కమిటీ (ఏసీసీ) దీన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ఈ ఏడాది జూన్ 30న జరిగిన క్యాబినెట్ నియామకాల కమిటీ సమావేశంలో సీఎండీ నియామకాల కోసం వచ్చిన ప్రతిపాదనలను తిరస్కరించింది. ఎన్ఎండీసీ చైర్మన్ కమ్ సీఎండీ నియామకానికి సంబంధించి మళ్లీ ఎంపిక ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. సింగరేణి సీఎండీగా శ్రీధర్‌పై వచ్చిన ఆరోపణల వల్లే ఎన్ఎండీసీ సీఎండీ నియామకానికి ఆటంకంగా మారాయనే ప్రచారం జరిగింది.

ముఖర్జీపై ఆరోపణలు..

ప్రస్తుతం జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థకు చైర్మన్‌గా కొనసాగుతున్న అమితవ ముఖర్జీపై పలు ఆరోపణలున్నాయి. ఏపీలోని విశాఖపట్నంలో ఉన్న ఎన్ఎండీసీ ప్రాంతీయ కార్యాలయాన్ని మూసివేయించారని, అక్కడ కార్యాలయం లేకున్నా సిబ్బంది కొనసాగడం, గతంలో 35రోజులు కార్మికులు సమ్మె చేస్తే దాని వల్ల కార్పొరేషన్‌కు సుమారు రూ.500 కోట్ల నష్టం వాటిల్ల డానికి ఆయన నిర్ణయాలే కారణమనే ఆరోపణలూ వచ్చాయి. ఏదేమైనా ఏసీసీ శాశ్వత చైర్మన్ నియామకం చేపడితే తప్ప ఇన్‌చార్జిగా కొనసాగుతున్న ముఖర్జీ తప్పుకొనే పరిస్థితి లేదు.

4 వారాల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలి

- ఇదే చివరి అవకాశం..ఏపీకి కృష్ణా ట్రైబ్యునల్ ఆదేశం

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి తెలంగాణ దాఖలు చేసిన స్టేట్‌మెంట్ ఆఫ్ కేసు (ఎస్‌వోసీ)పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి ఆంధ్రప్రదేశ్‌కు జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ (కృష్ణాట్రైబ్యునల్-2) నాలుగు వారాల గడువు ఇచ్చింది. ఇదే చివరి అవకాశమని, మళ్లీ గడువు ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ట్రైబ్యునల్ ఆగస్టు 28, 29 తేదీలకు వాయిదా వేసింది.

ఏపీకి 4.5, తెలంగాణకు 5.5 టీఎంసీలు

- తాగునీటికే కృష్ణా జలాలు .. ఇరు రాష్ట్రాల నిర్ణయం

హైదరాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు లేనందున ఎగువ ప్రాంతాల నుంచి జలాలు వచ్చే దాకా తాగునీటి అవసరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని రెండు తెలుగు రాష్ట్రాలు నిర్ణయించాయి. సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడికాలువ నుంచి ఏపీకి 4.5 టీఎంసీలు, ఎడమ కాలువ నుంచి తెలంగాణకు 5.5 టీఎంసీల నీటిను విడుదల చేయాలని నిర్ణయించారు. ఈనెల 17వ తేదీ నుంచి ఈ మేరకు నీటిని విడుదల చేయనున్నారు. ఇక సాగర్‌లో తగినన్ని నీటినిల్వలు లేనందు వల్ల శ్రీశైలం నుంచి 6 టీఎంసీల నీటిని(రెండు రాష్ట్రాలకు చెరో 3 టీఎంసీల చొప్పున) జలవిద్యుత్ అవసరాలకు వినియోగించాలని నిర్ణయించారు.

ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ మెటీరియల్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 'కోటా' ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ డిజిటల్ స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్స్‌ను సిద్ధం చేసినట్లు కోటా పేజెస్(ఆర్) తెలిపింది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఫౌండేషన్ మెటీరియల్, అసైన్‌మెంట్స్‌ను డిజిటల్ మొబైల్ వెర్షన్‌లో వాట్సప్ ద్వారా పొందవచ్చని చెప్పింది. మరింత సమాచారం కోసం IITF, MEDF అనిటైపు చేసి 9849016661 నంబరుకు వాట్సాప్‌లో మెసేజ్ చేయాలని సూచించింది.

తోకతో చిన్నారి.. ఎయిమ్స్‌లో తొలగింపు

బీబీనగర్, జూలై 15: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని అఖిల భారత వైద్యవిజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) వైద్యులు అరుదైన ఘనత సాధించారు. తోకతో పుట్టిన చిన్నారికి క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి తోకను తొలగించారు. తెలంగాణకు చెందిన ఓ దంపతులకు తొమ్మిది నెలల క్రితం తోకతో బాబు పుట్టగా ఈ ఏడాది జనవరి నెలలో బాబును తల్లిదండ్రులు ఎయిమ్స్‌కు తీసుకువచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించి.. గర్భం దాల్చే సమయంలో సమస్య తలెత్తి స్పైనల్ కార్డ్ సరిగా ఏర్పడక బాబు తోకతో జన్మించాడని, దీనిని వైద్య పరిభాషలో స్పినా బిఫిడగా పరిగణిస్తారని తల్లిదండ్రులకు వైద్యులు తెలిపారు. వెన్నెముకతో తోక అనుసంధానమై ఉందని గుర్తించారు. కేసును సవాలుగా తీసుకున్న నిమ్స్ వైద్యులు జనవరిలో చిన్నపిల్లల వైద్య విభాగం సీనియర్ వైద్యులు డాక్టర్ శశాంక్ పండ నేతృత్వంలో రెండున్నర గంటలకు పైగా శ్రమించి 15 సెంటీమీటర్ల పొడవున్న ఆ తోకను బాబు శరీరం నుంచి వేరు చేశారు. ఐదు రోజుల పాటు చిన్నారి ఆరోగ్య పరిస్థితులను గమనించిన అనంతరం డిశ్చార్జ్ చేశారు. ఆరు నెలలుగా బాబును పర్యవేక్షించిన వైద్యులు సోమవారం మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించి బాబుకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తలేదని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని నిర్ధారించారు.

అర్చకుల బదిలీలపై హైకోర్టు మధ్యంతర స్టే

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పూజారులు, అర్చకుల బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలపై హైకోర్టు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఎండోమెంట్ శాఖ పరిధిలోని ఉద్యోగులు ప్రత్యేకంగా పూజారులు, అర్చకుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తేస్తూ జారీ చేసిన ఆర్థికశాఖ జీవో 80, రెవెన్యూశాఖ (ఎండోమెంట్) జీవో 64లను సవాల్ చేస్తూ భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఉప ప్రధాన అర్చకులుగా సేవలు అందిస్తున్న కోటి శ్రీమన్నారాయణాచార్యులు, అమరవాది మురళీకృష్ణమాచార్యులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. ఎండోమెంట్ శాఖ ఉద్యోగుల బదిలీల పేరిట ప్రభుత్వం పూజారులు, అర్చకుల బదిలీలకు ఆప్షన్స్ ఇవ్వాలని కోరుతోందన్నారు. తెలంగాణ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్ యాక్ట్ ప్రకారం ఆధ్యాత్మిక కేంద్రాల్లోని సంప్రదాయాలు, పూజలు, ధర్మాలకు సంబంధించిన వ్యక్తుల విషయంలో జోక్యం చేసుకోరాదని పేర్కొన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా వారి వ్యవహారాలను పర్యవేక్షించే అధికారం ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. అర్చకుల బదిలీలపై మధ్యంతర స్టే విధించింది. రెండువారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలిస్తూ విచారణను వాయిదా వేసింది.

తుది తీర్పు ప్రకారమే ప్రభుత్వ ప్లీడర్ల నియామకం

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియమించిన ప్రభుత్వ ప్లీడర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను తొలగించి నూతన నియామకాలు చేపట్టిన వ్యవహారం తుది తీర్పునకు లోబడి ఉంటుందని హైకోర్టు స్పష్టంచేసింది. జిల్లా, ఇతర దిగువ కోర్టుల్లో ప్రభుత్వ ప్లీడర్లను తొలగించి కాంగ్రెస్ ప్రభుత్వం నూతన నియామకాలు చేపట్టడాన్ని సవాల్ చేస్తూ పలువురు న్యాయవాదులు హైకోర్టులో వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం నూతన నియామకాలు తాము ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేస్తూ విచారణను వాయిదా వేసింది.

స్థానిక సంస్థల ఎన్నికలు: ఎప్పట్లోగా పెట్టగలం?

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల పెంపుపై సచివాలయంలో అధికారులతో సమీక్ష జరిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజ నరసింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ముఖ్యనేత కె.జానారెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు సాధ్యాసాధ్యాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే కుల గణనకు ఆమోదం తెలిపినందున, దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుందని, అందుకు ఎంత సమయం తీసుకుంటారని సీఎం అధికారులను ప్రశ్నించారు. గత పంచాయతీ ఎన్నికల్లో అనుసరించిన విధానం, రానున్న ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును అధికారులు వివరించారు. కర్ణాటకలో 2015లో, బిహార్‌లో 2023లో కులగణన చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో కులగణన చేసినప్పటికీ ఇంకా వివరాలు బయట పెట్టలేదని తెలిపారు. 2011లో కేంద్ర ప్రభుత్వం కుల గణనకు ఉపయోగించి ఫార్మాట్‌లో 53 కాలాలు ఉన్నాయని, వాటికి మరో మూడు కాలాలు జోడించి కుల గణన చేపడితే ఐదున్నర నెలల్లో పూర్తి చేయవచ్చని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణలో పంచాయతీ ఎన్నికల విషయంలో అనుసరించిన విధానాలు, వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసులు, వాటి తీర్పులు, పర్యవసానాలను కాంగ్రెస్ ముఖ్యనేత, మాజీ మంత్రి జానారెడ్డి వివరించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ, స్థానిక సంస్థల్లో ఇప్పటిదాకా అమలు చేసిన రూల్ ఆఫ్ రిజర్వేషన్లకు సంబంధించి, గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాలకు సంబంధించి సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా సందేహాలు వస్తే మాజీ మంత్రి జానారెడ్డితో పాటు పంచాయతీరాజ్ శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని, చట్టపరమైన విషయాల్లో అడ్వొకేట్ జనరల్‌తో చర్చించాలని సూచించారు. మిగతా రాష్ట్రాలు రిజర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న విషయాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. త్వరగా ఆయా అంశాలపై నివేదిక రూపొందిస్తే శాసనసభ సమావేశాలకు ముందే మరోసారి సమావేశమై ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుందామని సీఎం వెల్లడించారు.



కాంగ్రెస్ గూటికి మహిపాల్‌రెడ్డి

కండువా కప్పి ఆహ్వానించిన సీఎం

తిరిగి వచ్చిన గాలి అనిల్‌కుమార్

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి.. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతోపాటు జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, పలువురు కార్పొరేటర్లు, నేతల అనుచరులు కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. సీఎం నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు. గూడెం మహిపాల్‌రెడ్డి కుటుంబంపై మైనింగ్ కేసులు నమోదు కావడం, ఆ తర్వాత ఈడీ సోదాలు చేపట్టడం తెలిసిందే. అది జరిగిన కొన్ని రోజులకే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నప్పుడు.. మహిపాల్‌రెడ్డి కూడా వెళ్లడంతో కాంగ్రెస్‌లో ఆయన చేరుతారని ప్రచారం జరిగింది. చివరకు ఆదివారం తన అనుచరులతో సంప్రదింపులు జరిపిన మహిపాల్‌రెడ్డి.. కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. సోమవారం తన అనుచరులతో పాటు సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మరోవైపు.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ దక్కక పోవడంతో బీఆర్ఎస్‌లో చేరిన గాలి అనిల్‌కుమార్.. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. సోమవారం ఆయన కూడా సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. కాగా, మహిపాల్‌రెడ్డి చేరికతో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య పదికి చేరింది. ఫిరాయింపుల నిరోధక చట్టంలోని వెసులుబాటు ప్రకారం మూడింట రెండు వంతుల మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరితేనే టీఆర్ఎస్ఎల్పీ విలీనమైనట్లుగా పరిగణిస్తారు. ఈ లెక్కన 26మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరాల్సి ఉంది. ఈ లెక్కన మరో 16మంది ఎమ్మెల్యేలు చేరితే సీఎల్పీలో బీఆర్ఎస్ఎల్పీ విలీనం కానుంది. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో చేరికల ప్రక్రియను సీఎం వేగవంతం చేయనున్నట్లు చెబుతున్నారు.

గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాల చెల్లింపు

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు గత కొద్ది నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తక్షణం వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని 29,676 మంది కార్మికులకు వేతన బకాయిలు చెల్లించేందుకుగాను రూ.150,57,59,500 విడుదల చేసింది. ఈ మొత్తాన్ని జిల్లాల వారీగా కేటాయిస్తూ.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితారామచంద్రన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ మినహా.. రాష్ట్రంలోని 32 జిల్లాల పరిధిలో ఒక్కో జిల్లాలో పనిచేసే గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ల సంఖ్య, వారి వేతనాల కోసం విడుదల చేసిన మొత్తం, ఆ జిల్లాకు సంబంధించిన డీడీ కోడ్‌ను సూచిస్తూ తక్షణం చెల్లింపులు జరపాలని ఆయా జిల్లాల అధికారులను కమిషనర్ ఆదేశించారు.

'జ్యుడీషియల్ కమిషన్'పై సుప్రీంలో కేసీఆర్ పిటిషన్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు కొనుగోలు, థర్మల్ విద్యుత్కేంద్రాల నిర్మాణాల్లో అవకతవకలపై విచారణ జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం నియమించిన జ్యుడీషియల్ కమిషన్‌ను రద్దు చేయాలంటూ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టాల్సి ఉంది. ఉదయమే కేసు విచారణకు రాగా కేసీఆర్ తరఫున న్యాయవాది మోహిత్ రావు సీనియర్ న్యాయవాది రాలేదని, సమయం ఇవ్వాలని కోరారు. సాయంత్రం కేసీఆర్ పిటిషన్ విచారణకు వచ్చే సమయానికి కోర్టు పనివేళలు ముగియడంతో మంగళవారం ఉదయం విచారణ చేపడతామని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు.

డ్రగ్స్ వినియోగదారుల్లో.. రకుల్ తమ్ముడు

హైదరాబాద్ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటి రకుల్ ప్రీత్‌సింగ్ సోదరుడు అమన్ ప్రీత్‌సింగ్ తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్)కు చిక్కాడు. హైదరాబాద్ హైదర్షాకోట్‌లోని విశాఖనగర్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా ఉన్నట్లు సమాచారం అందుకున్న టీజీ న్యాబ్ అధికారులు.. సైబరాబాద్ పోలీసులతో కలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో.. అమన్ ప్రీత్‌సింగ్ సహా.. 13 మంది వినియోగదారులు పట్టుబడ్డారు. ఇద్దరు నైజీరియన్లు సహా.. ఐదుగురు డ్రగ్స్ స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం పోలీసులు నిర్వహించిన డ్రగ్స్ పరీక్షల్లో 10 మంది పాజిటివ్‌గా తేలగా.. వారిలో అమన్ ప్రీత్‌సింగ్ కొకైన్ తీసుకున్నట్లు తేలిందని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన కేసు వివరాలను వెల్లడించారు. "నైజీరియాకు చెందిన ఒనూహ బ్లెసింగ్ అలియాస్ జొయానా గోమ్స్ అలియాస్ జో అనే మహిళ డ్రగ్స్ కింగ్‌పిన్ అని గుర్తించాం. ఆమెతోపాటు నైజీరియాకు చెందిన అజీజ్ నోహిమ్ అడెషోలా పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌కు చెందిన అల్లం సత్యవెంకట గౌతమ్, సానబోయిన వరుణ్‌కుమార్, మహమ్మద్ మహబూబ్ షరీఫ్ వీరి ముఠాలో పెడ్లర్లుగా పని చేస్తున్నారు. వీరంతా విశాఖనగర్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో ఉన్నట్లు ఉప్పందడంతో దాడి చేసి, అరెస్టు చేశాం. వీరి నుంచి రూ.35 లక్షల విలువైన 199 గ్రాముల కొకైన్‌ను సీజ్ చేశాం. ఇదే ముఠాకు చెందిన నైజీరియన్ స్మగ్లర్లు డైవిన్ ఎబుకా అలియాస్ ఇమాన్యుయెల్, ఎజియోనిలి ఫ్రాంక్లిన్ అలియాస్ కలేషీ పరారీలో ఉన్నారు" అని డీసీపీ వివరించారు.

కింగ్‌పిన్ మహిళ-- జొయానాగోమ్స్ 2017లో భారత్‌కు వచ్చి.. బెంగళూరులో హెయిర్ స్టైలిస్ట్‌గా పనిచేసిందని, ఆ సమయంలోనే ఆమెకు నైజీరియాకు చెందిన డ్రగ్స్ స్మగ్లర్ డైవిన్ ఎబుకాతో పరిచయం ఏర్పడిందని చెప్పారు. 2018 నుంచి ఆమె డ్రగ్స్ సరఫరాలో కీలకంగా మారిందని పోలీసులు గుర్తించారు. ఆమెపై 2019లో ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఎన్డీపీఎస్ కేసు నమోదైనట్లు డీసీపీ వివరించారు. "జొయానాగోమ్స్ తన పాస్‌పోర్టును దాచి, మారు పేరుతో పశ్చిమ ఆఫ్రికా పాస్‌పోర్టు సంపాదించింది. గినీబిసావు అనే పేరుతో భారత్‌లో చలామణి అయ్యింది. పోలీసులకు పట్టుబడ్డప్పుడు మారు పేరు, నకిలీ పాస్‌పోర్టును వాడుకునేది. నైజీరియాకు వెళ్లినప్పుడు మాత్రం తన అసలు పాస్‌పోర్టును వాడేది. మరో నిందితుడు అజీజ్ నోహిమ్ 2014లో విద్యార్థి వీసాపై హైదరాబాద్‌కు వచ్చాడు. ఉస్మానియా వర్సిటీలో నకిలీ డీడీ సమర్పించిన కేసులో జైలుకు వెళ్లాడు. బెయిల్‌పై బయటకు వచ్చాక.. ఎజియోనిలి ఫ్రాంక్లిన్‌తో పరిచయం ఏర్పడడంతో డ్రగ్స్ పెడ్లర్‌గా మారాడు" అని డీసీపీ వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన గౌతమ్, వరుణ్, షరీఫ్‌లు డ్రగ్స్ సరఫరాలో కీలకంగా వ్యవహరించారని చెప్పారు. గౌతమ్ ఏడు నెలల కాలంలో 2.6 కిలోల కొకైన్‌ను సరఫరా చేశాడన్నారు. వరుణ్ ఈ ముఠా నుంచి ఒక్కో గ్రాము కొకైన్‌కు రూ.8 వేలు చెల్లించేవాడని, దాన్ని 12 వేలకు అమ్మేవాడని పేర్కొన్నారు. మరో నిందితుడు షరీఫ్ కొరియోగ్రాఫర్ అని.. వరుణ్, గౌతమ్‌లతో ఉన్న పరిచయంతో సినీ ఇండస్ట్రీలో వినియోగదారులకు డ్రగ్స్ సరఫరా చేసేవాడని వివరించారు. విశాఖనగర్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో 13 మంది డ్రగ్స్ కస్టమర్లను అరెస్టు చేశామని, ఉస్మానియా ఆస్పత్రిలో వారికి డ్రగ్స్ టెస్ట్‌లు నిర్వహించగా.. 10 మందికి పాజిటివ్ వచ్చిందన్నారు. పాజిటివ్‌లుగా గుర్తించిన వారిలో రకుల్ ప్రీత్‌సింగ్ సోదరుడు అమన్ ఉన్నట్లు డీసీపీ తెలిపారు.

స్మగ్లర్స్‌ను పట్టిస్తే రూ.4లక్షల నజరానా

ఈ కేసులో పరారీలో ఉన్న నైజీరియన్ స్మగ్లర్లు డైవిన్ ఎబుకా, ఎజియోనిలి ఫ్రాక్లిన్‌ను పట్టిచ్చినా.. వారి జాడ తెలిపినా రూ.4 లక్షల నజరానాను టీజీ న్యాబ్ ప్రకటించింది. డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. పరారీలో ఉన్న ఒక్కో నిందితుడిపై రూ.2 లక్షల రివార్డు ఉన్నట్లు వివరించారు. వీరికి సంబంధించిన సమాచారం తెలిస్తే.. +91 8712671111 నంబర్‌కు ఫోన్ ద్వారా తెలియజేయాలని కోరారు.

స్మగ్లరా? కస్టమరా??

రకుల్ సోదరుడు ప్రస్తుతానికి కస్టమరేనని తాము గుర్తించినట్లు టీజీ న్యాబ్ పోలీసులు తెలిపారు. అతను నిజంగానే కస్టమరా? లేక డ్రగ్స్ సప్లయరా? అనేది దర్యాప్తులో తేలుతుందని వ్యాఖ్యానించారు. గతంలో డ్రగ్స్ కేసులో రకుల్ పేరు బయటపడిన నేపథ్యంలో.. ఇప్పుడు అమన్ పోలీసులకు పట్టుబడడం సినీ ఇండస్ట్రీలో మరోమారు చర్చనీయాంశమైంది. అప్పట్లో రకుల్ ఈడీ విచారణను సైతం ఎదుర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఇదే విషయమై డీసీపీని ప్రశ్నించగా.. "ముఠాను పట్టుకున్న రెండు గంటల్లోనే ప్రెస్‌మీట్ పెట్టాం. పూర్తిస్థాయిలో విచారణ జరపాల్సి ఉంది. ఆ తర్వాతే అమన్ కస్టమరా? లేక స్మగ్లరా? అనే విషయాలు తేలుతాయి. అప్పుడు మరో ప్రెస్‌మీట్ పెడతాం" అని వ్యాఖ్యానించారు.

ఇంజనీరింగ్ కాలేజీల్లో 10వేల సీట్ల పెంపు?

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్ల సంఖ్య భారీగా పెరగనుంది. ఈ సీట్ల సంఖ్య 10 వేల వరకు పెరగవచ్చని తెలుస్తోంది. రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్ల సంఖ్యను పెంచుతున్నట్టు అధికారులు సోమవారం ప్రకటించారు. కానీ ఎన్ని సీట్లు పెరుగుతాయన్నదానిపై స్పష్టత ఇవ్వలేదు. దీనికి సంబంధించి ఉత్తర్వులు వెలువడితే కొత్తగా పెరిగే సీట్ల సంఖ్యపై స్పష్టతరానుంది. అయితే కొత్తగా 10 వేల వరకు సీట్లు పెరగవచ్చని సమాచారం. కాగా సీట్లను పెంచాలని నిర్ణయించిన నేపథ్యంలో అభ్యర్థుల వెబ్ ఆప్షన్ల నమోదుకు ఇచ్చిన గడువును ఈ నెల 17 వరకు పొడిగించారు. ఈ ఏడాది రాష్ట్రంలో 98,296 ఇంజనీరింగ్ సీట్లకు ఇప్పటికే ప్రభుత్వం అనుమతిచ్చింది. వీటిలో ఎక్కువ శాతం కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించినవే. అయితే అదనపు సీట్లకు అనుమతివ్వాలని కాలేజీల యజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరాయి. 20వేల సీట్ల వరకు పెంచాలని కాలేజీలు ప్రతిపాదించగా పరిశీలించిన ప్రభుత్వం 10 వేల సీట్ల వరకు పెంచడానికి అనుమతించినట్టు సమాచారం. పెరిగిన సీట్లలో ఎక్కువ శాతం కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించినవే ఉండనున్నట్టు తెలుస్తోంది. కాగా ఈసారి కోర్సుల కన్వర్షన్ పెద్ద ఎత్తున జరిగింది. పెద్దగా డిమాండ్‌లేని సివిల్, మెకానికల్ వంటి కోర్సుల్లోని సీట్లను తగ్గించుకుని, డిమాండ్ భారీగా ఉన్న కంప్యూటర్ ఆధారిత కోర్సుల్లో సీట్ల సంఖ్యను పెంచుకోవడానికి చాలా కాలేజీలు ఆసక్తి చూపాయి. కోర్సుల కన్వర్షన్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేయగా పరిశీలించి 7వేల సీట్ల వరకు కోర్సుల కన్వర్షన్‌కు అనుమతించింది. ఈ మేరకు కంప్యూటర్ కోర్సుల్లోని సీట్ల సంఖ్య పెరగనుంది. ఇంజనీరింగ్ సీట్లను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అభ్యర్థులు నమోదు చేసుకునే వెబ్ ఆప్షన్ల గడువును సోమవారం పొడిగించారు. సోమవారంతో ముగిసిన వెబ్‌ఆప్షన్ల నమోదు గడువును 17 వరకు పొడిగించారు. దీంతో అభ్యర్థులు తాము కోరుకునే కాలేజీల్లో కోరుకున్న సీట్ల కోసం వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవచ్చు. సోమవారం వరకు రాష్ట్రంలో 93,167 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నారు.

సచివాలయ ముట్టడి ఉద్రిక్తం

ఏఐఎస్ఎఫ్, బీసీ సంఘాల నేతల అరెస్టు

సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగుల మెరుపు ధర్నా

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): గ్రూప్ 2,3 పోస్టులను పెంచాలని.. గ్రూప్-2, డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని పలు సంఘాలు.. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నేతలు చేపట్టిన సచివాలయ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. సోమవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో సచివాలయ ముట్టడికి యత్నించిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. సమగ్ర కుల గణన జరిపి బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, మెగా డీఎస్సీ వేయాలని, గ్రూప్-2, 3 పోస్టులను పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ కులాలు, బీసీ సంఘాల ఐక్య వేదిక, బీసీ జన సభ, విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య, హిందూ బీసీ మహాసభ, ఆలిండియా ఓబీసీ జేఏసీ, బీఆర్ఎస్వీ నేతలు నల్లపోచమ్మ దేవాలయం నుంచి మీడియా పాయింట్ మీదుగా సచివాలయం వైపు దూసుకొచ్చారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. అడ్డుకున్నారు. సచివాలయ ముట్టడికి మద్దతు పలికిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను సోమవారం ఉదయమే పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

డీఎస్సీ వాయిదా వేయాలని ధర్నా

చిక్కడపల్లి సిటీ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు సాయంత్రం మెరుపు ఆందోళనకు దిగారు. తొలుత అభ్యర్థులంతా లైబ్రరీ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ మీదుగా శాంతి ర్యాలీ తీసేందుకు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. లైబ్రరీ నుంచి ఎవరూ బయటకు రాకుండా గేటుకు తాళం వేశారు. దీంతో నిరుద్యోగులంతా అక్కడే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. నిరుద్యోగుల ఆందోళన నేపథ్యంలో పెద్దఎత్తున ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ దిగింది. దీంతో నిరుద్యోగులంతా లైబ్రరీ లోపలికి పరుగులు తీశారు. ఓసారి పోలీసులు ముందుకు రావడం.. మరోసారి వెనక్కి వెళ్లడం.. ఇదే క్రమంలో నిరుద్యోగులు వెనక్కి, ముందుకు పరుగులు తీశారు. రెండు గంటలకు పైగా ఆందోళన కొనసాగింది. లైబ్రరీ గేటు దాటి వచ్చిన దాదాపు 20 మందిని పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్సీ వాయిదా వేయాలని నిరుద్యోగులు దిల్‌సుఖ్‌నగర్‌లోని కమల ఆస్పత్రి ముందు సోమవారం రాత్రి ధర్నా చేశారు.



చిక్కడపల్లిలోని సిటీ లైబ్రరీ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగ అభ్యర్థులు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● మంగళవారం 16 జూలై 2024

జయశంకర్ వర్సిటీలో
బీటెక్, బీఎస్సీ ఆనర్స్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)-ఎంపీసీ స్ట్రీమ్ కింద నిర్వహిస్తున్న డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్, బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కేటగిరీల్లో సీట్లు ఉన్నాయి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బీటెక్‌లో గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం అలాగే బీఎస్సీ ఆనర్స్‌లో రూరల్ కోటా కింద 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. స్థానికులకు 85 శాతం సీట్లు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్): సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో మొత్తం 29 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫార్మర్స్ కోటా కింద 20 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 9 సీట్లను నిర్దేశించారు.


బీటెక్(ఫుడ్ టెక్నాలజీ): నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మొత్తం 15 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫార్మర్స్ కోటా కింద 10 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 5 సీట్లను నిర్దేశించారు.

బీఎస్సీ ఆనర్స్(కమ్యూనిటీ సైన్స్): హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో మొత్తం 42 సీట్లు ఉన్నాయి. వీటిలో 37 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. మూడేళ్ల డిప్లొమా(హోమ్ సైన్స్) అభ్యర్థుల కోసం అదనంగా 8 రెగ్యులర్ సీట్లు కేటాయించారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

- ఫార్మర్స్ కోటాలో రిజర్వేషన్ సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే అభ్యర్థులు గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన వారై ఉండాలి. తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్ (కమ్యూనిటీ సైన్స్) ప్రోగ్రామ్‌లో రూరల్ కోటా కింద అప్లయ్ చేసుకోవాలంటే కూడా గ్రామాల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 17
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **దరఖాస్తులో కరెక్షన్స్:** ఆగస్టు 19
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in



హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ), వీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ(పీవీఎన్ఆర్‌టీవీయూ), సిద్దిపేట్-ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) ఉమ్మడిగా వ్యవసాయ ఆధారిత డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి. బైపీసీ స్ట్రీమ్ కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరీల సీట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అగ్రికల్చరల్, వెటర్నరీ, హార్టికల్చర్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. ప్రొఫెసర్ జయశంకర్, శ్రీ కొండా లక్ష్మణ్ వర్సిటీల పరిధిలో ఒక్కోదానిలో 40 శాతం సీట్లు; వీవీ నరసింహారావు వర్సిటీ పరిధిలో 25 శాతం సీట్లను గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ప్రత్యేకించారు. మొత్తమ్మీద 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

తెలంగాణ వ్యవసాయ కళాశాలల్లో
డిగ్రీ ప్రవేశాలు

బీఎస్సీ ఆనర్స్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్, హార్టికల్చర్ విభాగాలు ఉన్నాయి.
- పీజేటీఎస్ఏయూ పరిధిలోని రాజేంద్రనగర్, అశ్వారావుపేట, పొలాస, పాలెం, వరంగల్ అర్బన్, సిరిసిల్లా, ఆదిలాబాద్, తోర్నాల అగ్రికల్చరల్ కాలేజీల్లో మొత్తం 615 రెగ్యులర్ సీట్లు, 227 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. సైఫాబాద్ కమ్యూనిటీ సైన్స్ కాలేజీలో 38 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.
- ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ పరిధిలోని రాజేంద్రనగర్, మోజెర్ల, మల్యాల్ హార్టికల్చర్ కాలేజీల్లో మొత్తం 200 రెగ్యులర్ సీట్లు, 34 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.

బీటెక్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. స్పెషలైజేషన్ 'ఫుడ్ టెక్నాలజీ'.
- పీజేటీఎస్ఏయూ పరిధిలోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(నిజామాబాద్ జిల్లా-రుద్రూర్)లో 25 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.
- బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో 20 శాతం సీట్లను ఐకార్ కోటా కింద ప్రత్యేకించారు. వీటిని 'సీయూఈటీ(ఐకార్-యూజీ)2024' ఎగ్జామ్ స్కోర్, ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌ల ద్వారా ఐకార్ భర్తీ చేస్తుంది.

బీవీఎస్సీ & ఏహెచ్

- ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో వెటర్నరీ సైన్స్ ప్రధాన విభాగం.
- పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని రాజేంద్రనగర్, కోరుట్ల, మామునూర్ వెటర్నరీ సైన్స్ కాలేజీల్లో మొత్తం 184 సీట్లు ఉన్నాయి.


బీఎఫ్ఎస్సీ

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో ఫిషరీ సైన్స్ ప్రధాన విభాగం.
- పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని పెబ్బేర్ ఫిషరీ సైన్స్ కాలేజీలో 28 సీట్లు, నెల్లూరు జిల్లా-ముత్తుకూరు ఫిషరీ సైన్స్ కాలేజీలో 11 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఇంటర్‌స్థాయిలో ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులందరూ తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లలో చేరాలంటే అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

టీటీడీ స్విమ్స్‌లో
పీజీ, పీజీ డిప్లొమా

తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(స్విమ్స్)- ఎమ్మెస్సీ, ఎంపీటీ, పీజీ డిప్లొమా, పోస్ట్ బేసిక్ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పోస్ట్ బేసిక్ డిప్లొమాలో అకడమిక్ మెరిట్ ద్వారా, మిగిలిన అన్ని కోర్సుల్లో వర్సిటీ నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



● ఎమ్మెస్సీ నర్సింగ్

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. స్పెషలైజేషన్‌ల వారీగా చైల్డ్ హెల్త్ నర్సింగ్ 6, అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ నర్సింగ్ 8, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్ 7, సైకియాట్రీ నర్సింగ్ 6, మెడికల్ సర్జికల్ నర్సింగ్ 6 చొప్పున మొత్తం 33 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో బీఎస్సీ నర్సింగ్/బీఎస్సీ ఆనర్స్ నర్సింగ్/పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి. అభ్యర్థులందరూ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ నుంచి నర్స్/మిడ్‌వైఫ్ గుర్తింపు పొంది ఉండాలి.

● ఎంపీటీ

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. స్పెషలైజేషన్‌ల వారీగా ఆర్థోపెడిక్స్ 9, న్యూరాలజీ 6, కార్డియోథొరాసిక్ 9, స్పోర్ట్స్ 3 చొప్పున మొత్తం 27 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ ఉత్తీర్ణతతోపాటు 2024 ఆగస్టు 31 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.

● ఇతర ఎమ్మెస్సీ కోర్సులు

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎకోకార్డియోగ్రఫీ, కార్డియాక్ క్యాథరైజేషన్ ఇంటర్వెన్షన్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లలో ఒక్కోదానిలో ఒక సీటు చొప్పున 2 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ ఉత్తీర్ణతతోపాటు పీజీ డిప్లొమా(ఈసీఈ&సీవీటీ) పూర్తిచేసి కనీసం మూడేళ్ల అనుభవం ఉన్నవారు/బీఎస్సీ(సీవీటీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. కరస్పాండెన్స్ కోర్సులు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. డయాలసిస్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 2 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ(డయాలసిస్ టెక్నాలజీ)పూర్తిచేసినవారు అర్హులు. కార్డియో-పల్మనరీ పెర్‌ఫ్యూజన్ టెక్నాలజీ(సీపీపీటీ) స్పెషలైజేషన్‌లో 2 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ(సీపీపీటీ)/బీఎస్సీ పెర్‌ఫ్యూజన్ టెక్నాలజీ/బీఎస్సీ ఉత్తీర్ణతతోపాటు పీజీ డిప్లొమా ఇన్ సీపీపీటీ చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. క్లినికల్ వైరాలజీ స్పెషలైజేషన్‌లో 2 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ(మైక్రోబయాలజీ/బయోటెక్నాలజీ/జువాలజీ/బోటనీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

● పీజీ డిప్లొమా

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. స్పెషలైజేషన్ 'మెడికల్ రికార్డ్స్ సైన్స్'. ఈ ప్రోగ్రామ్‌లో 9 సీట్లు ఉన్నాయి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

● పోస్ట్ బేసిక్ డిప్లొమా(నర్సింగ్)

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌ల వారీగా కార్డియాక్ ఇంటెన్సివ్ కేర్ అండ్ క్యాథరైజేషన్ ల్యాబొరేటరీ నర్సింగ్ 6, సీటీ సర్జరీ నర్సింగ్ 6, పెరిటోనల్ డయాలసిస్ నర్సింగ్ 2, హీమో డయాలసిస్ నర్సింగ్ 2, రెనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నర్సింగ్ 2, అంకాలజీ నర్సింగ్ 5 చొప్పున మొత్తం 23 సీట్లు ఉన్నాయి.
బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు సమయంలో నెలకు రూ.5000ల స్టయిపెండ్ ఇస్తారు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్

- ఎమ్మెస్సీ నర్సింగ్, ఎంపీటీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో సంబంధిత డిగ్రీ సిలబస్ నుంచి 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంటన్నర. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు 40శాతం; బీసీ అభ్యర్థులకు 35 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 30శాతం మార్కులు రావాలి.
- మిగిలిన కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంగ్లీష్ నుంచి 30శాతం, లాజికల్ రీజనింగ్ నుంచి 30శాతం, బయాలజీ నుంచి 20 శాతం, ఫిజికల్ సైన్సెస్ నుంచి 20శాతం ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఇంటర్ స్థాయిలోనే ఉంటాయి. పరీక్ష సమయం గంటన్నర. వీరికి క్వాలిఫయింగ్ కటాఫ్ లేదు. అకడమిక్ మెరిట్‌కు 80 శాతం, ఎంట్రెన్స్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,900; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,956
- **దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** ఆగస్టు 8
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 19
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** పోస్ట్ బేసిక్ డిప్లొమాకి ఆగస్టు 19న; ఎమ్మెస్సీ నర్సింగ్‌కి ఆగస్టు 22; ఎంపీటీ సహా మిగిలిన కోర్సులకు ఆగస్టు 24న
- **కౌన్సెలింగ్:** ఎమ్మెస్సీ నర్సింగ్, పోస్ట్ బేసిక్ డిప్లొమా ప్రోగ్రామ్‌లకు ఆగస్టు 31న, మిగిలిన కోర్సులకు సెప్టెంబరు 4న
- **తరగతులు ప్రారంభం:** ఎమ్మెస్సీ నర్సింగ్, పోస్ట్ బేసిక్ డిప్లొమా ప్రోగ్రామ్‌లకు సెప్టెంబరు 11 నుంచి, మిగిలిన కోర్సులకు సెప్టెంబరు 23 నుంచి
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, అలిపిరి రోడ్, తిరుపతి-517507
- **వెబ్‌సైట్:** https://svimstpt.ap.nic.in

నల్సార్ వర్సిటీలో
రాజ్యాంగంపై బేసిక్ కోర్సు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా- భారత రాజ్యాంగానికి సంబంధించి 'ఆన్‌లైన్ బేసిక్ కోర్సు'ను అందిస్తోంది. భారత రాజ్యాంగంపై పూర్తి అవగాహన కల్పించడమే ఈ కోర్సు ప్రధాన ఉద్దేశం. పాఠశాల విద్యార్థులు, కాలేజీ స్టూడెంట్స్, పోటీ పరీక్షలకు సన్నద్ధమౌతున్న ఉద్యోగార్థులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. కోర్సు వ్యవధి నాలుగు నెలలు. ఈ కోర్సును తెలుగు మాధ్యమంలో నిర్వహిస్తారు. పదోతరగతి ఉత్తీర్ణులైనవారందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

కోర్సు వివరాలు
'సామాజిక, రాజకీయ న్యాయపత్రం'గా పరిగణించే భారత రాజ్యాంగంలోని పలు అంశాలను రికార్డెడ్ సెషన్స్ ద్వారా వివరిస్తారు. ముసాయిదాకు సంబంధించిన సంక్షిప్త చరిత్ర, రాజ్యాంగ మౌలిక స్వరూపం, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ఫెడరల్ వ్యవస్థ, కాలగమనంలో సంభవించిన మార్పులు, సమకాలీన సమస్యలు తదితరాలపై మొత్తం 32 వీడియో సెషన్స్ ఉంటాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు వీటిని యాక్సెస్ చేసుకునేందుకుగాను లాగిన్ ఐడీ ఇస్తారు. ఈ సెషన్స్‌ను కాపీ చేయడం, డౌన్‌లోడ్ చేయడం సాధ్యం కాదు. కోర్సు చివరలో ఆన్‌లైన్ టెస్ట్ ఉంటుంది. ఇందులో కనీసం 50 శాతం మార్కులు వచ్చినవారికి మాత్రమే 'కోర్సు కంప్లీషన్ సర్టిఫికెట్' ఇస్తారు. అంతకన్నా తక్కువ మార్కులు వచ్చినవారికి 'పార్టిసిపేషన్ సర్టిఫికెట్' ఇస్తారు. అభ్యర్థులకు సర్టిఫికెట్ సాఫ్ట్ కాపీలను ఈ-మెయిల్ ద్వారా పంపుతారు. ప్రింట్ కాపీలు ఇవ్వరు.

ముఖ్య సమాచారం
- కోర్సు ఫీజు: రూ.1500
- రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఆగస్టు 5
- లాగిన్ ఐడీ ఇచ్చే తేదీ: ఆగస్టు 10న
- కోర్సు ప్రారంభం: ఆగస్టు 10 నుంచి
- ఆన్‌లైన్ టెస్ట్ తేదీ: డిసెంబరు 8న
- సర్టిఫికెట్ కాపీని అభ్యర్థుల ఈ-మెయిల్‌కు పంపు తేదీ: డిసెంబరు 20
- వెబ్‌సైట్: www.nalsar.ac.in, www.nalsarpro.org

ఎన్ఏబీఐలో
రీసెర్చ్ ప్రోగ్రామ్

మొహాలీలోని నేషనల్ అగ్రి ఫుడ్ బయోటెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఏబీఐ)- పీహెచ్‌డీ (బయోటెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు ఫరీదాబాద్‌లోని రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ) డిగ్రీని ప్రదానం చేస్తుంది. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు ఇంటర్వ్యూ, వైవా నిర్వహించి మెరిట్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 25 సీట్లు ఉన్నాయి.

రీసెర్చ్ విభాగాలు
అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ, ఫుడ్ బయోటెక్నాలజీ, న్యూట్రిషన్ బయోటెక్నాలజీ, ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్, నానోబయోసైన్సెస్, పోస్ట్-హార్వెస్ట్ టెక్నాలజీ, ఫంక్షనల్ ఫుడ్స్, జినోమిక్స్ అండ్ కంప్యూటేషనల్ బయాలజీ

అర్హత
గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంఫార్మా/ఎంవీఎస్సీ/ఎంబీబీఎస్/(ఎమ్మెస్సీ/ఎంటెక్)(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 5 శాతం మినహాయింపు వర్తిస్తుంది. యూజీసీ/సీఎస్ఐఆర్/ఐసీఎంఆర్/డీఎస్‌టీ/డీబీటీ ఫెలోషిప్ అర్హత పొంది ఉండాలి. గేట్ అర్హత ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి మెరిట్ ఆధారంగా ఎన్ఏబీఐ కోర్ ఫెలోషిప్ లభిస్తుంది.


ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 5
- **ఇంటర్వ్యూలు:** ఆగస్టు 21, 22
- **వెబ్‌సైట్:** nabi.res.in




తగిన శాస్తి

రామాపురంలో క్రిష్ణయ్య అనే యువకుడు ఉండేవాడు. అతను ఎంతో తెలివైన వాడు ఇంకా సాహసవంతుడు కానీ చాలా దురాశాపరుడు ఒక రోజు ఆ ఊరిలో రామనాథం అనే వ్యాపారి ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. ప్రాణ నష్టం ఏమీ లేకున్నా, ఇంటి లోపలి విలువైన వస్తువులు కాలి బూడిదవుతున్నాయి. ఇంతలో అక్కడికి వచ్చిన రామనాథం వ్యాపారానికి కావల్సిన డబ్బు నాలుగు లక్షలు లోపల పెట్టాను అది కూడా బూడిదైతే ఎలా అని పెద్దపెట్టున ఏడవసాగాడు. ఇంతలో అక్కడికి వచ్చిన క్రిష్ణయ్య 'రామనాథం గారూ మీ డబ్బు లోపలి నుండి నేను క్షేమంగా తెచ్చి ఇస్తాను. కానీ తెచ్చిన డబ్బులో నాకు ఇష్టమైనది మీకు ఇచ్చి మిగతాది నేను తీసుకుంటాను. సరేనా? సరే అన్నాడు రామనాథం. అప్పుడు క్రిష్ణయ్య ఎంతో ధైర్యంగా లోపలికి వెళ్లి, డబ్బుమూట బయటకు తెచ్చాడు కానీ, తెచ్చిన సొమ్ములో వంద రూపాయలు మాత్రం రామనాథానికి ఇచ్చి, మిగతా డబ్బు మొత్తం తన సంచీలో వేసుకుని, వెళ్లబోయాడు. ఇది అన్యాయం అని క్రిష్ణయ్యను ఆపాడు రామనాథం. 'నేను చెప్పినట్లే కదా చేశాను ఇంకేం అన్యాయం'అన్నాడు క్రిష్ణయ్య. విషయం పంచాయితీ దాకా వెళ్లింది, పంచాయితీ పెద్ద కేశవరావు జరిగినదంతా విని, క్రిష్ణయ్యతో ఇలా అన్నాడు.'క్రిష్ణయ్యా ఆ డబ్బుమూట మరియు వంద రూపాయలు చెరోవైపున పెట్టు' అన్నాడు. అలాగే చేశాడు క్రిష్ణయ్య. ఇప్పుడు చెప్పు క్రిష్ణయ్యా ఈ రెండిటిలో నీకు ఇష్టమైనది ఆ పెద్ద డబ్బు మూటనే కదా అని అడిగాడు. అవును అని జవాబు చెప్పాడు క్రిష్ణయ్య. 'నువ్వు నీకు ఇష్టమైనది రామనాథానికి ఇస్తాను అని కదా అన్నావు? కాబట్టి మారు మాట్లాడకుండా ఆ డబ్బు మూటను అతనికి ఇచ్చేసి, అతను సంతోషంగా ఎంత ఇస్తే అంత పుచ్చుకో' అన్నాడు కేశవరావు దానికి క్రిష్ణయ్య 'నా ఉద్దేశం అది కాదు నాకు ఇష్టమైనది అంటే నాకు నచ్చినంత అని అర్థం' అన్నాడు. దానికి కేశవరావు 'నీ ఉద్దేశం మంచిదైతే ఈ గొడవే లేదు కదా. నువ్వు తెలివైనవాడివి.. కానీ ఈ దురాశ మంచిది కాదు మానుకో' అని హితవు చెప్పి, అతన్ని అక్కడినుండి పంపేశాడు పంచాయితీ పెద్ద. అతని దురాశకు తగిన శాస్తి జరిగిందని అందరూ అనుకున్నారు.

10 తేడాలు గుర్తించండి!






దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 359

			6	7			1	3
				5			2	
					3	4		
	3				7			2
7		4				5		8
5			4				6	
		8	9					
	2			8				
6	9			3	1			

సుడోకు - 358 సమాధానం

5	6	9	7	1	3	4	8	2
2	1	8	5	9	4	3	7	6
4	7	3	8	2	6	5	9	1
7	3	1	2	5	8	6	4	9
6	9	4	1	3	7	8	2	5
8	2	5	6	4	9	1	3	7
3	4	2	9	6	5	7	1	8
9	8	6	3	7	1	2	5	4
1	5	7	4	8	2	9	6	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.